కథ

# కథామంజరి

పది కథల సమాహారం

## జన్మదిన ప్రత్యేక సంచిక

జూలై 2021

జయంతి ప్రకాశ శర్మ

సంపాదకుడు

అవసరాల వెంకట రావు

ప్రకాశకుడు


కథామంజరి కి
స్వాగతం



# యువ కథ


పేరులోనే కొంత అర్థమయి ఉండాలి. కాకపోయినా 'కథామంజరి' ఆశయం తెలిసుంటే భావం స్ఫురిస్తుంది. సరే.. సూటిగా విషయంలోకి వచ్చేస్తే.. యువ కథకుల కథల కదంబం. సెప్టెంబరు 21 సంచిక కోసం యువతరం నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. నిబంధనలంటూ పెద్ద మాటలు వాడం గాని, సూచనలు మాత్రం కొన్ని పొందుపరుస్తున్నాం.

- యువతరం అంటే నలభై సంవత్సరాల లోపు వయసులో ఉన్న వారి కథలను మాత్రమే ఎంపిక ప్రక్రియలోకి తీసుకోబడతాయి.
- వయసు వివరాలు అక్కర్లేదు గాని, రచయితల విజ్ఞతకే ఆ విషయం వదిలిపెట్టేస్తున్నాం.
- కథ పంపే మెయిల్లో "కథ యువకథ కోసం" అని స్పష్టంగా రాయాలి".
- కథతో పాటు హామీపత్రం జత చెయ్యాలి. అందులో.. కథ స్వీయ రచన అనీ, ఇతర పత్రికల పరిశీలనలో లేదనీ, సాంఘిక మాధ్యమాలలో రాలేదనీ, వయసు విషయంలో అర్హత కలదనీ.. కథతో పాటు పంపాలి.
- కథాంశం ఏదైనా కావొచ్చు. 1000 పదాలకు మించకుండా కథ ఉంటే మంచిది. కథని వర్డ్ లో యూనికోడ్ లో టైపు చేసి submit@kathamanjari.in కి పంపాలి.
- ఎంపిక చేసిన కథలకు తగు పారితోషికం ఇవ్వబడుతుంది.
- కథలు మాకు చేరవలసిన ఆఖరు తేది. 10.08.2021 రాత్రి 10 గంటలు.


**ఎప్పటిలాగే మా ఈ చిన్ని ప్రయత్నాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం.**

## "రండి! 'యువ' సంచిక చేద్దాం!"

# అంకితం







తెలుగుకథ ఒక్కసారి భోరుమంది. వెక్కి వెక్కి విలపించింది. మాకు పాఠాలు చెప్పి, బుద్ధి నేర్పి, త్రోవ చూపించి.. చివరికి మాకు శాశ్వత వసతి కూడా ఏర్పాటు చేసిన మా పెద్ద దిక్కు మమ్మల్ని వదిలి సుదూర తీరాలకు వెళ్ళిపోయిందంటూ బావురమంది.

ఏడు దశాబ్దాలుగా తెలుగుకథని పెంచి, పెద్ద చేసి, దిశ, దశ కల్పించిన కథల మాష్టారు శ్రీ కాళీపట్నం రామారావు గారు.. జూన్ 4, 2021న మరణించారనే వార్త తెలుగు సాహితీ ప్రపంచాన్ని కుదిపేసింది. మాష్టారి కథలు రాశిలో తక్కువైనా, వాసిలో ఎవరెస్టు శిఖరాన్ని తాకినవే. తన కథలకంటే తెలుగుకథ అంటేనే మాష్టారికి చాలా ఇష్టం. మరో ప్రాణం కూడా! ఆ దిశలోనే 'కథాయజ్ఞం' చివరి వరకు చేస్తూనే ఉన్నారు. తనకొచ్చిన సాహిత్య అకాడమీ పురస్కారంతో మన తెలుగుకథకి ఓ ఇల్లు కట్టారు. మందీ మార్బలాన్ని ఇచ్చారు. కొన్ని యుగాలు తెలుగుకథ చిరంజీవిగా నిలబడ్డానికి పునాదిని వేశారు. తెలుగు కథా రచయితలలో అగ్రస్థానంలో నిలచి, మొన్నటి తరంవారిలో చివరివారిగా వీడ్కోలు తీసుకున్న 'కారా'మాష్టారికి .. అశ్రు నయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తూ.. కథామంజరి..

ఈ సంచికను వారికి అంకితం ఇస్తున్నాం!



# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | విన్నపాలు వినవలె.. | | v |
| | | | |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
| 1 | నీ వేదన నా మదిలోనే | ద్విభాష్యం రాజేశ్వర రావు | 1 |
| 2 | జీవితంపై దాడి | పి వి ఆర్ శివకుమార్ | 6 |
| 3 | స్నే'హితుడు' | ఇందు రమణ | 14 |
| 4 | భయం అభయం | విహారి | 23 |
| 5 | తప్పు తాళం కప్పదే | ఆదూరి వెంకట సీతారామ మూర్తి | 29 |
| 6 | వంటకం | మెడికో శ్యామ్ | 39 |
| 7 | మారాజులొచ్చారు | వసుంధర | 47 |
| 8 | స్నే'హితుడు' | సమ్మెట ఉమాదేవి | 53 |
| 9 | బామ్మగారొస్తున్నారు .. బహుపరాక్ | పోలాప్రగడ జనార్ధన రావు (జెన్నీ) | 60 |
| 10 | ఆపాత మధురం | డి కామేశ్వరి | 67 |
| 11 | జీవన వేదం | గంధం యాజ్ఞవల్క్య శర్మ | 77 |
| | | | |



# మా జట్టు

**సాంకేతిక సహకారం**

harbinger PUBLISHING

**బొమ్మలు**

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

**సంపాదక సహకారం**

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు

శ్రీ పి కృపాకర్


# కృతజ్ఞతలు

## SPONSORS

## ఈ సంచికకు ఆర్ధిక సహకారం

## OF THE ISSUE

# డా. కె. కమల గారు





# 'కథా'కీయం



నాకు చాలా సందర్భాలలో భర్తృహరి సుభాషితాలలో ఉన్న ఈ పద్యం గుర్తుకు వస్తుంటుంది.

"ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై
యారంభించి పరిత్యజించుదురు విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్ననిహన్య మానులగుచు ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధులల్ గావునన్

ఏదైనా పని మొదలు పెట్టినపుడు ఎన్ని అడ్డంకులు ఎదురయినా, చివరివరకు లక్ష్యం కోసం శ్రమించడమే కార్య సాధకుడి లక్షణం అని, నిగూఢంగా ఎంతో అందంగా హృద్యంగా చెప్పబడింది ఈ పద్యంలో!

ఆ స్ఫూర్తితోనే, 'నేటి తెలుగు కథ' ని ఒడిసి పట్టుకుని, ముందుకు బుడిబుడి అడుగులు వేసిన "కథామంజరి", పన్నెండు నెలల ప్రాయంలో తప్పడడుగులు పడకుండా, కనీసం నిలువుగా నిలబడ్డానికి ప్రయత్నం చేస్తున్నాం. అలా అనీ, ఆ అడుగులు పరుగులవాలనీ, ఏదో సాధించి "ఉత్తముడు" అని అనిపించుకోవలనీ కోరికలు ఆశయాలు లేవు గాని, 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అంటూ.. ఎంతోమంది ఉత్తములు తెలుగుభాషను, తెలుగుకథను కాపాడుకోవటానికి చేస్తున్న కృషికి, ఉడుతాభక్తిగా మాకున్న పరిధిలో సహాయం అందిస్తున్నామనే తృప్తితో ఆ బుడిబుడి అడుగులతోనే ముందుకు వెళ్తున్నాం. ఈ త్రోవలో లక్ష్యసాధన అంటే.. ప్రతీ తరం, సాధన చేస్తూనే ఉండాలి! అలా ఒక తరం తర్వాత మరో తరం, భాషని ఉనికిని కాపాడుకుంటూ ముందు తరాలకి అందించడమే లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో, మా అడుగులకు ముందు, వెనుక ఉండీ, ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న శ్రేయోభిలాషులకు, అక్షరసాయం చేస్తున్న రచయిత(త్రి)లకు, భుజం తట్టి ప్రోత్సహిస్తున్న పెద్దలకు, పాఠకులకు "కథామంజరి" జన్మదిన శుభవేళ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.
తెలుగు కథ 'జాడ' నిరంతరం కనిపించి, ముందు తరాలకు అందించాలనే ఓ ఉత్సాహ ఆలోచనలో నుంచి ఉద్భవించిన ఈ "కథామంజరి" పన్నెండు అడుగులు వేసి జన్మదినం జరుపుకుంటున్నా... అసలు ఈ రంగంలో అడుగు పెట్టడమే ఓ సాహసం అనుకుని అడుగులు వేసినా... యువతరంలో కథకులను చూడాలనీ, ఈ తరంలో కథలు విరివిగా రావాలనీ, నేటి కథని రేపటికి అందించాలనే 'లక్ష్యం'తోనే ముందుకు అడుగులు వేస్తున్నాం. "కథామంజరి" పన్నెండు సంచికలతో, అందులో రెండు ప్రత్యేక సంచికలతో..

కేవలం తెలుగుకథ మాత్రమే కనబడాలనీ తలచి పరుచుకున్న మా బాట.. దారి తప్పలేదు. ఆ బాటలో తెలుగు కథాదీపం.. మిణుకు మిణుకు వెలిగి, క్రమేపీ కాంతివంతమవుతుందనే ఆశ, సాధించగలమనే నమ్మకం ఉన్నాయి. ఆ నమ్మకం వెనుక కొన్ని తార్కాణాలు:

"పన్నెండు నెలల కాలంలో మాకు వచ్చిన ఎనిమిది వందల పద్నాలుగు కథల్లోంచి, నెలకొకరు చొప్పున పన్నెండు మంది లబ్దప్రతిష్టులు ఎంపిక చేసిన నూటిరవై ఏడు కథలు మీ ముందుకు వచ్చాయి. ఈ కథాయజ్ఞం వెనుక ఎనభై ఐదు మంది కథకుల పరిశ్రమ ఉంది. వీరు కాక మరో అరవై నాలుగు మంది కథకులలో కథలు రాయలనే ఉత్సాహం కనబడింది. అంతే కాదు.. తెలుగుకథని నిలబెట్టాలనే వేలాదిమంది పాఠకుల ఆదరణ, పట్టుదల ఉన్నాయి. అంతేకాదు.. మేమున్నాం అంటూ అర్థిక వనరులను అందించిన పన్నెండు మంది దాతలున్నారు. ఇవి "కథామంజరి" మనుగడకు ఊపిరినివ్వడమే కాదు, శక్తిని, యుక్తిని కూడా ఇచ్చాయి!"


కథకుల సంఖ్య పెరిగింది. వారిలో ఉత్సాహం పెరిగింది. రాసి పెరిగింది. కథనాల్లో నాణ్యత పెరిగింది. ఇవన్నీ చూస్తుంటే.. పడుతున్న శ్రమలో స్వేద బిందువులు ముత్యాల్లా కనిపిస్తున్నాయి. ఆ ఉత్సాహంతోనే ఈ జన్మదిన ప్రత్యేక సంచిక ఆలోచన పురుడు పోసుకుంది. పన్నెండు మంది విశిష్ట అతిథులను ఈ సంచిక కోసం కథ రాయలని అభ్యర్థించాం. ఆనందంగా స్పందించి ఆశీర్వదించారు. ఈ సమయంలోనే 'కరోనా' బాధితులైనా సరే, కథ కోసం 'కరోనా'ను జయించి, కథ రాసి అందించిన ఓ ఇద్దరు పెద్దలకి ఏ విధంగా ఋణం తీర్చుకోగలం! ఇతరత్రా పనుల ఒత్తిడితో కొత్త కథ రాయలేని పరిస్థితులలో, నలుగురు పెద్దలు ఆణిముత్యాలంటి వారి వారి ప్రచురిత కథలను అందించారు. ఆ కథలు స్వాతి వారపత్రిక, నవ్య వారపత్రిక, రచన మాస పత్రికలో ప్రచురితమైనవే.. అయితేనేం ఎన్నిసార్లైనా చదివించగలవు. వెరసి.. ఈ సంచిక పదకొండు కథలతో ముస్తాబై మీ ముందుకు వచ్చింది.

బహుముఖ ప్రజ్ఞాపాటవాలతో నిత్యం కాలం వెంట పరుగిడుతూనే, రచనాశక్తిని కూడా వెంటేసుకుని తెలుగు సాహితీవనంలో గుబాళించే కథాపుష్పాలను అందించిన రచయిత్రి శ్రీమతి బొమ్మదేవర నాగకుమారి గారు. వారు అనివార్య కారణాల వలన కథను అందించలేక పోయారని తెలియజేస్తూ, వారి రచనలు భవిష్యత్తులో కథామంజరిలో అలరిస్తాయాని ఆశిస్తున్నాం.

అలా .. ఈ విశిష్ట రచయిత(త్రు)ల కథల సమాహారాన్ని అందించడం ఓ అనిర్వచనీయమైన అనుభూతి.. స్ఫూర్తిని ఇచ్చాయి. తెలుగు కథకు ఈ సంచిక ఓ మణిహారంగా ఉంటుందని ఆశిస్తూ... రెండో సంవత్సరంలోకి అడుగు వేస్తున్నాం!

ఆ అడుగు కూడా మరో ఆలోచనకు శ్రీకారం చుట్టింది! అదే.. 'యువకథ'. మరో పేజీలో ఆ కథా కమామీషు ఉంది. తప్పకుండా.. ఈ సంకల్పానికి ఆదరణ, ప్రోత్సాహం ఉంటుందని ఆశిస్తూ.. మరోసారి మీ అందరికి అభివందనలు తెలుపుకుంటున్నాం!!

***0***



# "విన్నపాలు వినవలె .."

నమస్కారం. కథామంజరి కథా సేవలో వెన్ను కాసిన కథకులకు, పాఠకులకు, దాతలకూ .. మా జట్టు కీ సదా నమామి. ఏడాదికి పైగా రేగిన, దాగిన అనేక భావాలను పంచుకోవడానికి నేనూ మీ ముందుకు వచ్చాను. ఈ భావాలు, అనుభవాలు ప్రత్యేకం ఏమీ కాదు. ఏ కార్యం చేబట్టినా ఇవి లేకుండా అవదు కదా! కానీ, ఈ సముదాయంలో కొన్ని ప్రశ్నలు కూడా ఉండిపోయాయి. వాటి సమాధానాలు పత్రిక మనుగడకి చాలా ముఖ్యం అనిపించింది. అందుకే మీ ముందుకి వచ్చాను.

తెలుగు ప్రజలలో తెలుగు తెలిసిన, వచ్చిన ప్రజలు తగ్గిపోతున్నారు. 'టెల్గూ' ప్రజల శాతం పెరుగుతోంది. తెలుగు మాట్లాడడం, కనీసం తెలుగు వచ్చని చెప్పడం నామోషీగా తలిచే ప్రజలు కూడా బానే పెరుగుతున్నారు. తెలుగు రాయడం, చదవడం రాని యువత శాతం తలుచుకుంటేనే భయపడేటంత ఉంది.

అయితే .. 'కథామంజరి' తో ఈ అరాచకాన్ని ఆపేయగలమా?! నిశ్చయంగా ఎక్కువమంది స్పందన "కాదు" "లేదు". ఎక్కడో మా "జెపి" లాంటి వాళ్లకు తప్ప, ఎవరికీ ఆ ఆశ లేదు. కానీ మా ఆశయం అదే! ఓ కొంతమంది పెద్దలు "నేను సైతం.." అన్నారుగా. ఒక చిన్న పత్రికతో .. వెబ్, ఈ మెయిల్, ఇంటర్నెట్ లాంటి సాంకేతిక ప్రత్యామ్నాయాలను వాడుకుంటూ, యువతకు దగ్గిరవ్వాలని. అందుకే వచ్చిన కొత్తల్లో కథకుల వయస్సు అడిగాం .. కానీ దెబ్బతిన్నాం. ఇప్పుడు మన కథకులలో ఎక్కువ మంది 'యువ' స్థాయిని దాటినవారే. ముందు పత్రిక నిలబడాలి .. అందుకే అందరి కథల్ని ఆదరిస్తున్నాం... 'వయస్సు అడగకుండా...యువతకు ప్రత్యేకత లేకుండా.. !'

కొత్త పత్రిక .. అందునా మెయిల్ కు మాత్రమే వస్తుంది. కథకులూ, పాఠకులూ ముందుకు రావడానికి సంకోచించారు. ఇది సహజం. అప్పుడు 'మా జట్టు' ఇద్దరమే .. నేనూ, జెపి. కొంత కష్టంతో 'సంచికకి

సరిపడే కథలు వస్తాయా?' అనే స్థాయి నుంచి బయటపడ్డాం. కానీ, కథల స్థాయి చూసి నిరుత్సాహం. మళ్ళీ చిన్న సర్దుబాటు .. ముందు ఇలాగే ఉంటుంది. రాను రాను చాలా మంచి కథలను వేయగలం .. ఈనాటికీ మేం ఆశించిన స్థాయి కథను పాఠకులకు అందించలేక పోతున్నామేమో అనే ఓ ఆవేదన ఉన్నా.. .. అక్కడక్కడ పెద్దలు, పిన్నలు వెదజల్లిన మెరుపులు ఆశాకిరణాలను వెదజల్లుతున్నాయి. .

ఒక్కసారి నిర్మొహమాటంగా పరిస్థితి ప్రస్తావించాలని అనుకుంటున్నాను. వాటిల్లో ఒకటి .. విరామ చిహ్నాల వాడుక. ఎందుకో తెలియదు.. చాలా మంది కథకులు వీటిని పట్టించుకోరు. కొన్ని కథల్లో వందల చిహ్నాలు బాగా విరివిగా వాడుతున్నారు.. ఒకదాని పక్కన ఒకటి కూడా .. అనవసరంగా. మరొకటి ఆంగ్ల పదాల వాడుక, అన్యాయంగా! పాత్రోచితంగా ఆంగ్ల పదాల వాడుక సమంజసమే. కానీ, కథనంలో కూడా .. తెలుగుకి తిలోదకాలిచ్చేసి, ఆంగ్లపదాలతో నడిపించడం న్యాయమా? కథకులు దయచేసి ఆలోచించండి. ఏ కళా ప్రక్రియకైనా లక్ష్యం దాని వినియోగదారుడ్ని రంజింపజేయడమే. తన కథ పాఠకుడ్ని ఎంతవరకూ రంజింపజేయగలుగుతోంది అని ఒక్కసారి కథకులను ఆలోచించమని మా విజ్ఞప్తి. 'మంచి కథలను కనడానికి కథకులు ఎందుకంత వేదనపడతారో' ఒక్కసారి విశ్లేషించి, అర్థం చేసుకుని కథ రాస్తే, అది తప్పక పండుతుంది. ఇది ఓ పాఠక పక్షపాతి కథకులకు చేస్తున్న అభ్యర్థన.

ఇక ఆశయసాధన కోసం 'కథామంజరి' కొత్త పుంతలు తొక్కుతోంది. తెలుగు కథ చదవలేని, చదవడానికి నిజంగా సమయం సరిపోని పాఠకుల కోసం "కథామంజరి శ్రావ్య సంచిక" ని తెచ్చింది .. ఈ నెలనుండే. చదవగలిగిన పాఠకులు చదవలేని పాఠకులకు దీనిని అందేలా చేయండి. విస్తృతంగా దీనిని వాడడం వల్ల మరింతమంది తెలుగుకి దగ్గరవుతారని ఆశ.

నమస్కారం!

**ప్రకాశకుడు**




కథామంజరి  జులై 2020

సంచిక విశిష్ట అతిథి

# నీ వేదన నా మదిలోనే

## ద్విభాష్యం రాజేశ్వరరావు

కథ



కథలకు తనదైన శైలిలో భాష్యం చెప్పుతున్న రచయిత శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు గారు. ఇరవై రోజులు అనారోగ్యంతో ఇబ్బంది పడినా, పత్యం కన్నా ముందే కలం పట్టి, కథామంజరి జన్మదిన సంచికకు కథని అందించిన కథల కలంకారి కలం నించి జారిన మరో కథారత్నం "నీ వేదన నా మదిలోనే.."



# నీ వేదన నా మదిలోనే

ద్విభాష్యం రాజేశ్వరరావు

మెడికల్ ఓ.పి. పూర్తి చేసుకుని, రౌండ్స్ కి బయలుదేరాను. నర్స్ 'ఫ్లోరెన్స్' నా వెంట నడిచి వస్తూ, నేను రోగి బెడ్ దగ్గర ఆగినప్పుడల్లా నాకు ఆ కేసు గురించి వివరిస్తోంది. రోగి వివరాలకు సంబంధించిన 'కేసు షీటు' అందించడం, టెంపరేచర్ తీసి చెప్పడం, ఇలాంటివన్నీ చకచకా చేసేస్తోంది. అంతా యాంత్రికంగా జరిగిపోతోంది.

'గైనిక్ పోస్ట్ ఆపరేటివ్' వార్డ్ కు వచ్చాను. ప్రతి తల్లి పక్కలో బోసి నవ్వులు చిందించే పాపాయిలు! నాలుగో నెంబర్ బెడ్ వద్దకు వెళ్లి, యాంత్రికంగా నర్స్ అందించిన 'కేసు షీటు' అందుకున్నాను

"నిన్న రాత్రి అడ్మిట్ అయ్యారు! నార్మల్ డెలివరీ, పేరు శివరంజని .." నర్స్ వివరాలు చెప్పుకుపోతోంది.

శివరంజని!! ఆ రాగమన్నా, ఆ పేరన్నా నాకు ఎంతో ఇష్టం. అంత విషాదంలోనూ ఎంతో తీయదనం ఆ రాగంలో! బెడ్ వంక చూశాను. తలగడలు వీలుగా అమర్చుకుని, నడుం జాగ్రత్తగా సర్దుకుని, ఆల్చిప్పలంత కళ్ళతో నా వంకే చూస్తోంది ఆమె. జుత్తు చిందరవందరగా తలగడ చుట్టూ పరుచుకుని ఉంది. అమాయకమైన ముఖం, అందమైన ముక్కు! అంత నీరసంలోనూ ఆమె కళ్ళు నవ్వుతూనే ఉన్నాయి. పక్కలో పాప నిద్రపోతుంది. ఈమె.. శివరంజని! ఎక్కడో చూశాను! ఎక్కడో ఈ పేరు విన్నాను!! ఆలోచనలో పడ్డాను! ఆ!! .. గుర్తుకొచ్చింది. ఆమె కూడా నా వంక చూపులు మార్చి మార్చి చూస్తోంది.

"శివరంజనీ! నేను గుర్తున్నానా?" ఆప్యాయంగా అడిగేను, మెడలో స్టెత్ సర్దుకుంటూ.

"మిమ్మల్ని మరిచిపోగలనా డాక్టర్!" ఈ మాటలు అంటుంటే ఆమె పెదాలు వణికేయి. మాటలు ఆపి, రెండు చేతులు జోడించి నమస్కరించింది.

"శివరంజనీ .. ఆ మాట నేను అనాలి. నీకు చేసిన సర్వీసుకి నా ఫీజు , నేను వసూలు చేసుకున్నాను. కానీ నువ్వే .. కేవలం కృతజ్ఞతతో నాకు వచ్చిన కష్టం తెలుసుకుని, నాకు ఏమాత్రం శ్రమ ఇవ్వకుండా నీ పరపతి ఉపయోగించి, నన్ను సంకట పరిస్థితి నుండి బయటపడేశావు..." అంటూ వుంటే పల్చగా నవ్వుతూ, మళ్లీ రెండు చేతులూ నీరసంగా ఎత్తి మరోమారు నమస్కరించింది.

జ్ఞాపకాల దొంతరలు మనసులో నిండేయి.

సుమారు అయిదు సంవత్సరాల క్రితం. ..

ఓ రోజు నా ప్రైవేట్ క్లినిక్ లో కూర్చున్నాను. అప్పటికింకా గవర్నమెంట్ సర్వీసులో చేరలేదు. ప్రైవేట్ ప్రాక్టీసుతో విశాఖపట్నంలో మేడలు కట్టేద్దామని ఉబలాట పడిపోయిన రోజులవి. ఉదయం పదకొండు గంటలవుతోంది.

“నమస్తే డాక్టర్!” గంభీరమైన గొంతు విని తల ఎత్తి చూసాను. తెల్లగా, పొడుగ్గా, హుందాగా ఉన్నాడా యువకుడు. ‘పురుషుల్లో ఇంత అందగాళ్లుంటారా?’ అనిపించేటంత బాగున్నాడు. సుమారు పాతికేళ్ళుంటాయతనికి.

“ఈమె నా భార్య శివరంజని” అంటూ తన భార్యను పరిచయం చేద్దామని పక్కకు చూశాడు. ఆమె బయటే ఆగిపోయినట్లుంది, అతని మాటలు విని మెల్లగా అడుగులు వేసుకుంటూ, తలదించుకుని లోనికి వచ్చింది.

“కూర్చోండి!” అంటూ ఇద్దరికీ కుర్చీలు చూపించేను.

అమాయకమైన పెద్ద కళ్ళతో నా వంక రెండు సార్లు చూసి, తల దించుకుంది. రెండు నిమిషాలు మా మధ్య మాటలు లేవు. అతడు దేనికో సంశయిస్తున్నాడని గ్రహించాను.

“చెప్పండి! ..”అన్నాను సంభాషణకుపక్రమిస్తూ..

“ఈమెను ఒకసారి పరీక్షించాలి .. గర్భిణీ అని అనుమానం ..”

“ఎన్నో నెల? ..” ఆమె వంక చూస్తూ అడిగాను, ఆమె సమాధానం చెప్పలేదు.

“మూడో నెల అనుకుంటున్నాం ..” అతడే సమాధానం చెప్పేడు.

ఆమె వంక చూస్తూ “అలా లోనికి వెళ్ళి బెడ్ మీద పడుకోండి! చూస్తాను” అంటూ స్టెత్ తీసుకుని, లోనికి నడిచాను. నా వెంట ఆమె కూడా వచ్చింది. బెడ్ మీద పడుకుంటూ నా వంక భయంగా చూసింది.

“ఫర్వాలేదు! అంత భయం దేనికి? మొదటి కాన్పా?” అంటూ మాటల్లోకి దింపాను. అవునన్నట్టు తల ఊపింది.

ఐదు నిమిషాల్లో పరీక్షించడం ముగించి బయటకు వచ్చాను.

“కంగ్రాట్స్! మూడు వెళ్ళి నాలుగు వచ్చింది!” అన్నాను అతడితో.

“డాక్టర్ ఆమెకు ఎబార్షన్ చెయ్యాలి!” అన్నాడు.

“అప్పుడే పిల్లలు వద్దనుకుంటున్నారా?”

“అవును డాక్టర్! పెళ్ళయి ఇంకా సంవత్సరం కూడా కాలేదు!”

“ఈసారికి వదిలేసి మళ్ళీ సారికి జాగ్రత్త పడండి!” అంటూ సలహా ఇచ్చాను.

“వద్దు డాక్టర్! ప్రస్తుతం మా కుటుంబ పరిస్థితుల దృష్ట్యా, పిల్లల్ని ఆహ్వానించదలుచుకోలేదు!” అన్నాడు.

అంతలో శివరంజని మెల్లగా లోపలి నుండి వచ్చి, అతని పక్కన కూర్చుంది.

“మీకు అభ్యంతరం లేకపోతే ఇప్పుడే ..” అంటూ అర్థోక్తిగా ఆగేడు.

“ఓకే! మీ ఇష్టం! ఇదిగో.. ఈ చీటీలోని మందులు తీసుకురండి. ఈలోగా నేను థియేటరులో అన్నీ రెడీ చేసుకుంటాను” అంటూ చీటీ రాసి ఇచ్చాను.

పది నిమిషాల్లో అతడు కావాల్సిన మందులు అన్నీ తెచ్చాడు.

"డాక్టర్! తొందరగా వెళ్లిపోవచ్చా?" అని అడిగింది శివరంజని.

"ఈ రాత్రికి క్లినిక్ లో పడుకొని రేపు ఉదయం వెళ్ళు!" అన్నాను.

"అమ్మో! రాత్రి పదిగంటల్లోగా ఇంటికి వెళ్ళిపోవాలి! మా మామగారికీ, అత్తగారికీ ఈ పని ఇష్టం లేదు. వాళ్ళకి తెలియకుండా వుండాలి" అంది బెదిరే గొంతుతో.

"సరే! రాత్రి తొమ్మిదిన్నరకు పంపించేస్తానులే! కానీ మూడు రోజుల తర్వాత, మళ్లీ ఒకసారి రావాలి! ఎగ్జామిన్ చేసి, మళ్ళీ కొన్ని మందులు రాస్తాను!" అంటూ ఆమెకు ధైర్యం చెప్పేను.

ఓ గంటలో తతంగమంతా పూర్తయింది. సుమారు అరగంట తర్వాత తెలివి వచ్చింది ఆమెకు. రాత్రి తొమ్మిది గంటల వరకూ విశ్రాంతి తీసుకున్నాక, నా ఫీజు చెల్లించి, ఇద్దరూ వెళ్లిపోయారు.

తర్వాత మూడో రోజున పొద్దుట పదకొండు గంటలకు శివరంజనీ, ఆమె భర్తా క్లినిక్ కి వచ్చారు.

"నేను అర్జంటుగా ఇన్కమ్ టాక్స్ ఆఫీస్ కి వెళ్ళాలి. మా ఆడిటర్ ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ సంతకాలు పెట్టేశాను. అతడు రిటర్న్ లు నింపటంలో చేసిన పొరపాట్లు నా పీకకి చుట్టుకున్నాయి. నన్ను అర్జెంటుగా వచ్చి కలవమని ఆ ఇన్స్పెక్టర్ నాకు తాఖీదు పంపించాడు .." అంటూ నర్స్ తో చెబుతూ, కుర్చీలోంచి లేస్తూ ఉంటే "డాక్టర్! మీరు గాభరా పడకండి. ఆ కాగితం మా ఆయన చేతికి ఇవ్వండి. ఆయనకి ఇన్కంటాక్స్ ఆఫీసులో బోలెడంత పలుకుబడి వుంది. అయిన మీకు సాయం చేస్తారు!" అంది శివరంజని.

నేను కొంత ఆశగా, మరింత ఆశ్చర్యంగా వారిద్దరి వంక చూశాను. శివరంజని నాకు సహాయం చేయవలసిందిగా అభ్యర్థిస్తున్నట్లు అతని వంక చూసింది.

"సరే! ఆ కాగితం ఇటివ్వండి!" అన్నాడతను ముఖంలో ఏ భావమూ చూపకుండా. నా హ్యాండ్ బాగ్ లోని కాగితాలు తీసి, అతనికి అందించి, వివరాలు చెప్పాను. వాటిని రెండు నిమిషాలు తిరగేసి చూసి ధీమాగా "మీరీ విషయం మరిచిపోండి. నేను చూసుకుంటాను" అన్నాడు క్లుప్తంగా.

నా గుండెల మీద నుండి పెద్ద భారం దింపినట్లయింది!

"థాంక్సండీ!" అన్నాను అతనితో. తర్వాత శివరంజనిని పరీక్షించి, అంతా బాగానే ఉందని చెప్పి, నా దగ్గర వున్న శాంపిల్స్ తీసి ఇచ్చి, వాటిని వాడే విధానం చెప్పి, అతని వంక తిరిగి "మరి నేను ఇన్కంటాక్స్ ఆఫీస్ కు వెళ్లనక్కరలేదా?" అని అడిగాను.

"వాళ్ల బాబాయి అసిస్టెంట్ కమిషనర్! ఆయన చూసుకుంటారు అన్నీ! మీరు వెళ్లనక్కర్లేదు." అంది శివరంజని కల్పించుకుంటూ.

వాళ్ళిద్దరికీ మరోమారు థ్యాంక్స్ చెప్పాను.

ఓ వారం తరువాత వాళ్ళిద్దరూ నా క్లినిక్ కి వచ్చారు. నేనిచ్చిన కాగితాలు నాకు తిరిగి ఇచ్చేశారు.

“మా బాబాయ్ మీ ఆడిటర్ ని పిలిపించి, అంతా సెట్ చేయించారు. ఆ తాఖీదుల సంగతి ఇక మర్చిపోండి. మీ పని పూర్తయిపోయింది!” అన్నాడు అతడు తాపీగా.

నాకెంతో ఆనందమయింది. “నా గురించి ఎంతో కష్టపడ్డారు మీరు!” అంటూ కృతజ్ఞతాపూర్వకంగా వారి వైపు చూశాను.

తర్వాత శివరంజనిని మరోమారు పరీక్షించి, నా దగ్గర ఉన్న విటమిన్ మాత్రలు ఇచ్చి, క్రమం తప్పకుండా వాడమన్నాను. భవిష్యత్తులో ఆరోగ్యపరంగా ఏ అవసరం పడినా తప్పక రమ్మని చెప్పేను.

వాళ్ళిద్దరూ సెలవు తీసుకుని వెళ్ళిపోయారు.

అంతే!!

మళ్ళీ ఇన్నాళ్ళ తరువాత.. కాదు, ఇన్నేళ్ళ తర్వాత శివరంజనిని చూడటం!

“టెంపరేచర్ చూడమంటారా?”

నర్స్ ఫ్లోరెన్స్ మాటలతో ఆలోచనల నుండి విడివడ్డాను.

“అవసరం లేదు!” అంటూ మెల్లగా దగ్గరికు వెళ్లి స్టెత్ తో పరీక్షించాను.

“కులాసాగా ఉందా శివరంజనీ?” అడిగాను. మెల్లగా తలవూపింది.

తరవాత, “డాక్టర్! మీతో ఒక విషయం చెప్పాలి” అంది హీన స్వరంతో.

ఏమిటన్నట్లు ఆమె కన్నుల్లోకి చూశాను.

మాట్లాడటానికి ఆమె కాసేపు తటపటాయించింది.

నర్స్ ను దూరంగా వెళ్ళమని కళ్ళతోనే సంజ్ఞ చేశాను.

“డాక్టర్! మీరు నాకొక మాట ఇవ్వాలి ..” అంటూ వాక్యం పూర్తి చేయకుండానే ఆగిపోయింది.

అంతలో నల్లగా, పీలగా ఉన్న ఒక యువకుడు బెడ్డుకు కాస్త ఆవలగా నిలబడి ఇటువైపు చూస్తూ “నమస్తే డాక్టర్ గారూ!” అన్నాడు.

ప్రతి నమస్కారం చేస్తూ అనుమానంగా శివరంజని వంక చూశాను.

“మావారు” అంది శివరంజని వణికే పెదాలతో.

ఆల్చిప్పల్లాంటి ఆమె వెడల్పైన కళ్ళ నిండా నీళ్ళు!

ఆ కన్నీళ్ల వెనుక వేదన నాకు అర్థమయింది!

ఆమెకు ఇవ్వాల్సిన మాట నాకు అవగతమయింది!!

దీర్ఘంగా నిట్టూర్చి “నీకేం పర్వాలేదు!” అంటూ ఆమె భుజాలమీద అనునయంగా రాసి, ఆమెకు ఇవ్వాల్సిన మందులు “కేసు షీటు” లో ‘నోట్’ చేసి పక్క బెడ్ వైపు కదిలేను.

***0***




కథామంజరి ఆగస్టు 2020

సంచిక విశిష్ట అతిథి

# జీవితంపై దాడి

పి వి ఆర్ శివకుమార్



కుండ బద్దలు కొట్టే నిజాయితీ సైనా, గుండె పగిలే నిజాలనైనా, పులకరించే హాస్యాన్నైనా.. అలవోకగా కథగా అందించగల శ్రీ పి.వి.అర్. శివకుమార్ గారి దినచర్యలో ఓ భాగమైన "కథాకృత్యం' నుంచి కథామంజరి జన్మదిన సంచికకు అందించిన ప్రత్యేక కథ "జీవితంపై దాడి"

# జీవితంపై దాడి

## పి వి ఆర్ శివకుమార్



శవం లేచిన ఇల్లు, శవం లేచిన ఇల్లులా లేదు ..

అప్పగింతలు జరిగిన పెళ్లి పందిరిలా ఉంది.

"ఇంకో రెండు ఇడ్లీలు వేసుకోవచ్చుగా!"

"వద్దులే, అయిపోయేటట్లుగా ఉన్నాయి."

"నీ మొగమాటం చల్లగుండా! అయిపోతే మళ్ళీ తెప్పిస్తారు. కడుపు నిండా తిను, నిన్న రోజంతా ఏమీ తిననే లేదు. భోజనాలు చేసేసరికి అటు సాయంత్రమూ ఇటు రాత్రీ కాకుండా అయింది. ఎవరమూ సరిగ్గా భోజనమే చేయలేకపోయాం. ఈ పూట బ్రేక్ ఫాస్ట్ అయినా సరిగ్గా పడనియ్."

"ఎలాగో అలా ఆ ఇడ్లీలు మా అందరితో చెల్లగొట్టిస్తే, ఆ తరవాత తీరిగ్గా పూరీల పొట్లాలు విప్పుకు తిందామనా! వాడి మొగమాటం ఎలా వున్నా, నీ స్వార్థం బాగుంది." మరొక గొంతు.

"అది చిన్నప్పటి నుంచీ అంతే! అమ్మ పూరీలు చేస్తే, తనకి తప్ప ఎవరికీ పెట్టకూడదంటూ రాగాలు పెట్టేది!" మూడో గొంతు. గొల్లున నవ్వులు!

"అదికాదు, అసలా ఇడ్లీలు…" కలగా పులగంగా మాటలు, చతురోక్తులు!! ఎవరూ శబ్ద నియంత్రణ పాటించటం లేదు. మాటలు, నవ్వులు అన్నీ అతి సహజంగా, లోపలికి వినపడకూడదన్న స్పృహ ఏమీ లేకుండానే దొర్లుతున్నాయి! అన్నీ ఆ వరండా పక్కనే ఉన్న గదిలో కూర్చుని ఉన్న స్వరూప చెవుల్లో పడుతూనే ఉన్నాయి.

"ఇంతకీ అమ్మ ఏమైనా తిందా?"

"పెట్టి వచ్చాను. వేలు పెట్టి ముట్టటం లేదు."

"బావుంది, ఆవిడని అలా వదిలేసి, మనం ఒక్కళ్లం ఎలా తింటాం? నేను చెప్పి వస్తానుండు."

గుమ్మంలో అలికిడై తల కొద్దిగా ఎత్తి చూసింది స్వరూప. గుమ్మంలో కూతురు నిలబడి ఉంది.

"అమ్మా, ఆ పూరీలు రెండు తిను. నీకు అవే సహిస్తాయని తెప్పించాము."

కన్నీళ్లు జలజల రాలుతుండగా తల అడ్డంగా తిప్పింది స్వరూప.

"అలా అంటే ఎలా? నీరసం రాదూ? తిను."

"నాకేమీ తినాలని లేదు." గొంతు పెగల్చుకుని అంది స్వరూప.

"మాకు మాత్రం ఉందా? తప్పదు కదా!"

మాట్లాడలేదు స్వరూప. ఒక నిముషం గుమ్మంలోనే నిల్చుంది ప్రణవ. తల్లి నుంచి ఎలాటి రెస్పాన్స్ లేకపోవటంతో, విసుగ్గా మొహం పెట్టి, బయటకు వెళ్ళిపోయి, అన్నగారితో చెప్పింది. విసురుగా గుమ్మం ముందుకు వచ్చాడు ముకుందరావు.

"కొంచెమైనా తినకుండా కూర్చుంటే ఏమన్నట్టు? అక్కడికి మాకెవరికీ నాన్న మీద ప్రేమలేనట్టా? నిన్న రోజంతా ఓ గ్లాసు కాఫీ తప్ప ఏమీ తీసుకోలేదు నువ్వు. రాత్రికూడా పస్తు పడుకున్నావు. నువ్వు ఇలా మొండికేస్తే, నీ ఆరోగ్యమూ ఒక సమస్య అయిపోతుంది! నువ్వు తినటం లేదని, అవతల బావగారు కూడా ఏమీ ముట్టుకోవటం లేదు. అల్లుడి మర్యాద అయినా పాటించాలి కదా?"

నిన్ననే తండ్రిని తగలబెట్టి వచ్చిన కొడుకు, తల్లితో పలుకుతున్న సాంత్వన వచనాలు!

ఆమె తినటం లేదన్న తపన కన్నా, వాళ్ళకి ఇబ్బందిగా ఉందన్న అసహనమే ఎక్కువగా ధ్వనించింది అతడి మాటల్లో.

'చిన్నప్పుడు తిండికి ఎంత మారాం చేసేవాడు వీడు! ప్రతి పూటా గంటసేపు ఎత్తుకుని, ఇల్లంతా తిప్పుతూ, మరిపించి, బులిపించి, బెల్లించి ముద్ద ముద్దా తినిపిస్తే, బలవంతాన తినేవాడు. అది అందరు తల్లులకూ సహజం కావచ్చు. మరి, తండ్రి పోయి ఒక్క రోజు కూడా గడవక ముందే, తల్లిని తినమని ఈ విధంగా బ్రతిమిలాడే పద్ధతీ అందరూ కొడుకులకూ సహజమేనా?'

ఆమెలో పెల్లుబుకుతున్న దుఃఖం.. పెద్ద కొడుకు మాటలతో గొంతులోనే గడ్డ కట్టుకు పోయింది.

"తింటానులే, వెళ్ళు. మీరంతా సరిగా తినండి." అనేసింది. ముకుందరావు వరండాలోకి వచ్చేశాడు.

బలవంతాన ఆ టిఫిన్ నోట్లో కుక్కుకుని, ఇన్ని మంచినీళ్లు గొంతులో పోసుకుని, ముఖం మీద చెంగు కప్పుకుని, గోడకి జేరగిల పడిపోయింది స్వరూప.

***

**అంతకు ముందు** రోజు ఉదయాన్నే పోయాడు చతుర్భుజం. రెండేళ్లనాడు స్టెంటు పడ్డ గుండె, ఆ తెల్లవారు ఝామున అకస్మాత్తుగా మొరాయించింది. సముదాయించే వ్యవధి కూడా ఇవ్వలేదు.

ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు, మనవడు, మనవరాలు అంతా ఇంట్లోనే ఉన్నారు. నిజానికి కొడుకులిద్దరూ అమెరికాలో ఉంటారు. కూతురు, అల్లుడు ఢిల్లీలో ఉంటారు.

'అలాంటిది, పోయే సమయానికి, అంతా కట్ట కట్టుకుని దగ్గరే ఉన్నారంటే, అది ఆయన చేసుకున్న అదృష్టం!' అన్నారంతా.

మరో రెండు వారాల్లో తండ్రినీ, తల్లినీ అమెరికా తీసుకు వెళ్ళే ఏర్పాట్లు చేసారు ముకుందరావూ, గోవిందరావూ. ముకుందరావు భార్య రెండవసారి నెల తప్పింది. గోవిందరావు భార్య తొలి చూలు, ఆరో నెల మనిషి. తల్లిదండ్రులని తమతో తీసుకు వెళ్ళి, చిన్న కోడలి పురుడూ, ఆ వెనకే అందుకునే పెద్ద కోడలి పురుడూ కూడా అయ్యాక, తిప్పి పంపాలన్నది వాళ్ళ ఆలోచన. చతుర్భుజం అంగీకారం తీసుకుని, ఆ ప్రయాణపు ఏర్పాట్లన్నీ చేసి, నెల రోజుల సెలవు మీద కొడుకులిద్దరూ సకుటుంబంగా వచ్చారు. నాలుగు

రోజులు తల్లిదండ్రులతో ఉండి, ప్రయాణానికి కావలసిన సామాను సర్దుకోవటంలో సలహాలు చెప్పి, అత్తమామల దగ్గరకు వెళ్తే, ప్రయాణానికి ఓ రోజు ముందు వచ్చి, వీళ్ళని తీసుకుని ఫ్లైట్ ఎక్కవచ్చు' అనుకున్నారు. అందరం కలిసి చాలా ఏళ్ళైందనీ, మళ్ళీ అన్నలిద్దరూ కలిసి రావటానికి ఎన్నేళ్లు పడుతుందో తెలియదనీ, రెండు రోజులు అందరం కలిసి గడుపుదామనీ భర్తని ఒప్పించి, ప్రణవ కూడా భర్తనీ, కూతురినీ తీసుకు వచ్చింది. తీరా ఆ నాలుగు రోజులూ గడిచేలోపే, ఈ విపత్తు వచ్చి పడింది.

అందరికీ మతులు చెడ్డాయి, బయటకు అకస్మాత్తుగా తండ్రి పోయిన బాధ. మనసులో, ఇందు మూలంగా తమ ప్లాన్స్ చెడతాయేమోనన్న చింత.

నిద్రిస్తున్న నెత్తిమీద ఉరమని పిడుగు పడి, తెల్లవారు ఝామునే, బతుకు తెల్లవారిపోయిన స్వరూపకి మనసంతా మొద్దుబారిపోయి, ఏమైనా ఆలోచించాలా, ఏమి ఆలోచించాలీ అని కూడా తెలియటం లేదు.

***

**మూడవ రోజు** కాగానే, అన్నదమ్ములు నిర్ణయించుకున్నారు, కర్మకాండలు తొమ్మిదవ రోజు నుంచి మొదలు పెట్టాలని. ఈలోగా ఖాళీయే. ఆలోచనలు, మంతనాలు మొదలయ్యాయి, గుంపులు గుంపులుగా... జంటలు జంటలుగా! వేటిలోనూ స్వరూపకి స్థానం లేదు. మొదట్లో ఆమెని భాగస్వామిని చేయబోతే, “నన్నేమీ మాట్లాడించకండి. నా బుర్ర పని చేయటం లేదు” అనేసింది. అదే మంచిదన్నట్టు ఊరుకున్నారు వాళ్ళు.

అనటమైతే అనేసింది గానీ, ఆరోజుకారోజు, వినిపించీ వినిపించకుండా చెవిన పడుతున్న మాటలు ఆమె తిమ్మిరెక్కిన బుర్రకి కూడా నొప్పి తెలిసేలా, మనసుని పదునైన గునపంతో త్రవ్వేస్తున్నాయి. భర్తతో పాటే, సొంత జీవితం మీద ఆమెకి హక్కు కూడా పోయిందని తెలియచెప్తున్నాయి.

ఆమె జీవితం ఇకపై ఎలా నడవాలో, వాళ్ళే చర్చించుకుంటున్నారు. పూటకో విధంగా అభిప్రాయాలు వెలిబుచ్చేసుకుంటున్నారు.

‘తరవాతి మాట ఎలా ఉన్నా, ముందు అమెరికా తీసుకుపోవటం తప్పదు.’ అంటున్నాడు ముకుందరావు. అందుకు అందమైన తోడుగు, ‘ఇంత విపత్తు వచ్చాక, నాన్నలేని ఇంట్లో ఒక్కర్తీ ఉండలేదు గనుక, అనుకున్న ప్రకారం తమతో తీసుకు వెళ్లటం అవసరం.’ అన్న సమర్థింపు.

“అవునవును. ఒక్కర్తినీ ఈ ఇంట్లో ఉంచలేము. ముందు అనుకున్నట్టు, మీతో తీసుకు వెళ్లటమే కరక్ట్.” అంటోంది ప్రణవ. అన్నలిద్దరూ వదిలేసి వెళ్తే, తను ఢిల్లీ తీసుకు వెళ్ళవలసి వస్తుందేమోనన్న భయం ఆమెది.

ఆరు నెలల పాటు ఇల్లు తాళం వేయవలసి వస్తుంది గనుక, సామానంతా మేడమీది గదిలో సర్దిపెట్టి, తాళం వేయటం మంచిదా, ఇంటికి కాపలాగా కింద గదుల్లో ఎవరినైనా ఉంచాలా, అవసరం లేదా? ఇత్యాది విషయాలు కూడా సీరియస్ గా చర్చించేస్తున్నారు.

‘ఒరేయ్, మీ అమ్మను, ఈ ఇంట్లో ఉండవలసినదాన్ని, ఇంకా బతికే ఉన్నానురా! ఈ ఇంటి యజమాని, మీ నాన్న ఆత్మ ఇంకా ఇక్కడే తిరుగుతోందిరా!’ అని గట్టిగా అరవాలనిపించింది స్వరూపకి. ‘అడవి గోడు’ అనిపించింది. ఊరుకుంది.

తొమ్మిదవ రోజు ఉదయానికి వియ్యంకులు, వియ్యపురాళ్ళు వచ్చారు. అల్లుడికి తండ్రి లేడు. తల్లి రాలేదు. ఎవరూ లోపలికి వచ్చి, స్వరూపని చూడలేదు.

“పదో రోజుగానీ, నీ స్నానం అయిన తరవాత గానీ చూడకూడదటగా!” అదేదో సామాన్యమైన విషయంలాగే చెప్పింది కూతురు.

వచ్చిన వాళ్ళు తమ తమ అల్లుళ్లతో రొటీన్ సానుభూతి వాక్యాలు మాట్లాడటం వినిపిస్తోంది స్వరూపకి. విరక్తిగా అనిపించింది.

మధ్యాహ్నానికి, వాసు వచ్చాడు. అతడు స్వరూపకి అన్న కొడుకు. అన్న పోయి, పాతికేళ్లు దాటింది. అప్పటి నుంచీ ఆ కుటుంబంతో స్వరూప కుటుంబానికి సన్నిహిత సంబంధాలేమీ లేవు.

బావమరిది పోవటంతో, వేరే అండ లేని ఆ కుటుంబం తమ మీద పడుతుందేమోనన్న భయంతో, చతుర్భుజం ఆ కుటుంబానికి ఏ భుజమూ తగలకుండా జాగ్రత్త పడ్డాడు. పిల్లల పెళ్ళిళ్ళకి శుభలేఖలు వేసి ఊరుకున్నారు తప్ప వేరే కమ్యూనికేషన్స్ ఎప్పుడూ లేవు. ఆ పెళ్ళిళ్ళకి, తల్లి మర్యాద నిలబెడుతూ, తోచిన కానుక తీసుకుని, వాసు అటెండయ్యేవాడు. వాసు పెళ్ళికి మొక్కుబడిగా స్వరూప ఒక్కతే వెళ్లింది. ఆ తరవాత వాసు కుటుంబానికి మేనత్తతో, కజిన్స్ తో కాంటాక్ట్స్ అంతంత మాత్రమే.

వాసు సరాసరి లోపలికి వచ్చి, కంట తడి పెట్టుకుని,‘ మొన్ననే పెద్ద బావ వాట్సాప్ మెసేజ్ పంపితే తెలిసింది అత్తయ్యా!’ అంటూ పలకరించగానే, ‘ఈవేళ వీళ్ళకి అకస్మాత్తుగా వాసు ఎలా గుర్తుకి వచ్చాడో?’ అనుకుంది స్వరూప.

ఎందుకు గుర్తుకు వచ్చాడో, అరగంట తరవాత తెలిసింది ఆమెకి, వసారాలో నడుస్తున్న మాటల్లో గొంతులు కాస్త పెరగటంతో.

“అర్థం చేసుకోవేం? పుట్టింటివారు తీసుకు వెళ్ళి, నిద్ర చేయించటం ఒక బాధ్యత. ఆ ఫార్మాలిటీ జరిగే దాకా మా అమ్మ ఏ యింటికీ వెళ్ళటం కుదరదు. ఇటు మా ప్రయాణం రెండు వారాల్లోకి వచ్చింది. ఆమె మాతో ఫారిన్ రావాలంటే, ఈ లోగా నువ్వు తీసుకు వెళ్లి, నిద్ర చేయించి పంపాలి.” అంటున్నాడు ముకుందరావు.

“నేనేం తీసుకువెళ్ళననటం లేదు కదా! ఇంత వెంటనే అంటే ఎలా కుదుర్తుంది? రేపు ధర్మోదకాలు కాగానే, నేను వెళ్లి, ఇంట్లో మాట్లాడి, మంచి రోజు చూసి, ఫోన్ చేస్తాను.” అన్నాడు వాసు.

“ ఆ మంచి రోజేదో, ఇప్పుడే చూసి, తేల్చుకోవచ్చుగా.”

సన్నాయి నొక్కు నొక్కింది ముకుందరావు అత్తగారు.

"ఏదో ఔదార్యం చూపిస్తున్నట్టు, 'తీసుకు వెళ్ళననటం లేదుగా' అంటావేమిటీ, పుట్టినింటికి రావటానికి మా అమ్మకి పర్మిషన్ కావాలా?" గట్టిగా అరిచాడు ముకుందరావు. అతడికి లౌక్యం తెలియదు.
"ఇప్పుడు మీ అవసరాన్ని బట్టి గుర్తుకు వచ్చిందా పుట్టిల్లు? ఇన్నేళ్లలో ఏనాడైనా మేం గుర్తుకి వచ్చామా? మీ పెళ్ళిళ్ళకి గానీ, మరే శుభకార్యాలకి గానీ మమ్మల్ని పిలిచారా? మా అమ్మాయి పెళ్ళికి శుభలేఖ వేస్తే, జవాబైనా ఇచ్చారా? ఈవేళ అవసరం మీది గనుక విషయం తెలిపారు, లేకపోతే మామయ్యగారు పోయిన విషయమైనా మాకు తెలియజేసేవాళ్ళో లేదో అనుమానమే!"
కోపంగా అంటూ, అక్కడి నుంచి లేచి బయటకు వెళ్లిపోయాడు వాసు. ముకుందరావు ధోరణి అతడికి చిర్రెత్తించింది. గోవిందరావు మామగారు కల్పించుకున్నాడు, "అతడిని అంత దెబిరించటం దేనికి అల్లుడుగారూ? అతడికి మేనత్త అన్న అభిమానం లేకపోతే, మనకి వేరే మార్గం లేదా? ఏ శివాలయంలో నిద్ర చేసినా దోషం పోతుంది. పుట్టిల్లు లేనివాళ్లు ఏం చేస్తారు?"
"మీరు కాస్త ఆగుతారా? ఆలోచనా, సాలోచనా లేని మాటలు! ఏ దేవుడి గుడి అయినా పుట్టినింటితో సమానమవుతుందా? ఏ గతీ, ప్రత్యామ్నాయం, లేని వాళ్ళకి తప్పదు. వదినగారికి ఆ ఖర్మ ఏమిటీ? అయినా, ఆవిడ వెళ్ళేది అక్కడ శుభమా అని మన పిల్లల పురుళ్లు పోయటానికి. అటువంటి కార్యానికి పంపుతూ, ఆ మనిషికి సరయిన శుద్ధి చేయకుండా పంపుతామా? అక్కడ రేపు ఎవరికి ఏ కాలు నొచ్చినా, వళ్ళు వెచ్చబడినా, ఏ దోషమో తెలియక చావాలి! ఆ అబ్బాయితో సవ్యంగా మాట్లాడి, విషయం చక్కబరచేదిపోయి పోయి, పెడసరం మాటలా! తెగేదాకా లాగుతారా ఏమిటీ?"
గోవిందరావు అత్తగారు, భర్త మీద విరుచుకుపడింది.
తల గోడకేసి కొట్టుకోవాలనిపించింది స్వరూపకి.
'నా ఆత్మాభిమానం కూడా ఆయనతోటే చచ్చిపోయిందనుకుంటున్నారా వీళ్ళు?'
బయటకి పోయిన వాసు అరగంట తరవాత తిరిగి వచ్చాడు.
"తెల్ల చీరె తెచ్చావుగా బాబూ!" అడిగింది గోవిందరావు అత్తగారు. తెల్లబోయాడు వాసు.
"తల చెడిన ఆడపడుచుకి, పుట్టింటి నుంచి తెల్ల చీరె తేవాలని కూడా తెలియక పోవటం ఏమిటబ్బాయ్? రేపు పొద్దున్నే, మీ అత్తయ్యకి ఏం కడతాం?" అదేదో అతడి తప్పే అన్నట్టు అంది ముకుందరావు అత్తగారు.
"నాకు తెలియదు. మీరు తెప్పించండి. డబ్బు ఇస్తాను." అన్నాడు వాసు.
"అది తప్పు నాయనా, భార్యలు గర్భవతులుగా ఉండగా వీళ్ళు తెల్ల చీరె కొనకూడదు. నువ్వే వెళ్ళి తీసుకురా. చీరె అంటే, చీరె కాదు, తరవాత ఎలాంటి చీరెలు కట్టుకున్నా, ఈ మూడు రోజులూ తెల్లబట్టే కట్టుకోవాలి. అంచు లేని సైను బట్ట, అయిదు గజాలు చింపించుకురా, చాలు. మళ్ళీ సూర్యాస్తమయమైతే కొనకూడదు." మెత్తగా చెప్పింది ఆవిడ. వాసు బజారుకి వెళ్లిపోయాడు. అన్ని మాటలూ స్వరూప చెవుల్లో పడుతూనే ఉన్నాయి.

'పొత్తిళ్లలో ఉన్నప్పుడూ, ఆ దూది పాదాలతో గుండెల్లో తన్నారు. అప్పుడు అమరమైన అనుభూతి కలిగేది. ఇప్పుడు ఇనప బూట్ల కాళ్లతో గుండెలని తొక్కేస్తున్నారు. ఈ తాపులకి నరకం చూస్తున్న అనుభూతి!! కళ్ళనీ, కళ్ళతో పాటు మనసునీ గట్టిగా మూసుకుంది స్వరూప.

ఆ రాత్రి పది దాటుతుండగా వచ్చింది నరసమ్మ.. ఆ యింట్లో పాతికేళ్లుగా పని చేస్తున్న చాకలి.

"పొద్దున్నే అయిదుగంటలకి వత్తానమ్మా. మీకు తానం చేయించాలిట." అని చెప్పింది.

నరసమ్మని చూస్తే, ఉగ్గబట్టుకున్న దుఃఖం పొంగుకువచ్చింది స్వరూపకి. ఆమెని పట్టుకుని, భోరున ఏడ్చేసింది. వరండాలో వియ్యపురాళ్ళు మూతులు తిప్పుకున్నారు. గుమ్మంలోకి వచ్చి, నిల్చున్న ప్రణవ కళ్ళు తుడుచుకుంది.

"ఊరుకోండమ్మా, ఎవురూ శాశ్వతం కాదు. అయ్య శానా సుకంగా పొయ్యారు. బతుకులో సుకం కాదమ్మా, పోవటంలో సుకం గొప్పది. మీకు నేను సెప్పాలా? మీరిక మనసు నెమ్మది సేసుకోవాలి. ఊరినిండా మేమంతా లేమూ, పోయినోరిని తెలేకపోయినా, మీకు తోడు మేము కాదా?"

ఆ మాటలు స్వరూపలో కొత్త ఊపిరి ఊదాయి.

మరో పది నిముషాల పాటు ఇలాటివే సానుభూతి కబుర్లు చెప్పి, కదపక కదపక పెదవి కదిపిన స్వరూప చెప్పిన రెండు మాటలు విని, వెళ్లిపోయింది నరసమ్మ.

***

**పొద్దున ఆరు** దాటినా నరసమ్మ జాడ లేక, వియ్యపురాళ్ళు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రణవ చేస్తున్న ఫోన్ కాల్స్ కి జవాబు రావటం లేదు. ఇంతలో...

భళ్ళున గది తలుపు తెరుచుకుని బయటకు వచ్చింది స్వరూప. తలారా స్నానం చేసి, నీళ్ళు కారుతున్న కురులు, వంటిపై ఎర్రటి చీరె, నుదుట కుంకుమ లేకపోయినా అగ్నిశిఖలా భయం కొలుపుతున్న ముఖంతో, విసవిసా నడుచుకుంటూ వరండాలోకి వచ్చింది.

"అయ్యో...అయ్యో...అదేమిటమ్మా, ఈ అఘాయిత్యం? తప్పూ, ఒప్పూ లేకుండా ఇలా బయటకు వచ్చేశావ్, మన సాంప్రదాయాలని ఎరగవా?"

ఎక్కడా ఆగకుండా, పెద్ద వియ్యపురాలి మాటలు పట్టించుకోకుండా, ముందుకు నడిచి, రెండు మెట్లు ఎక్కి, వెనక్కి తిరిగి, నిలబడింది. అక్కడే నిలబడి ఉన్న కొడుకులకేసి చూసింది.

"చూడండి, పెళ్లయి, కాపరానికి వచ్చినప్పటినుంచీ ఉన్న ఈ ఊరు నాది. మీ నాన్న కట్టించి ఇచ్చిన ఈ ఇల్లు నాది, నా పేరు మీదే ఉంది! నా ఇంటినీ, ఈ ఊరినీ వదిలి ఒక్క రోజుకూడా నేను ఎక్కడికీ కదలను. ఇక్కడ నేను ఎలా ఉంటానో, అది నా ఇష్టం. నా పద్ధతులు నచ్చినవాళ్లే ఈ ఇంట్లో ఉండవచ్చు. నేను అక్కరలేని వాళ్ళు, నన్నిలా చూడదలుచుకోని వాళ్ళు, నిరభ్యంతరంగా ఇప్పుడే వెళ్లిపోవచ్చు."

"ఏమిటమ్మా, ఏం మాట్లాడుతున్నావో తెలుస్తోందా? నాన్న పోయారని, మేమూ అక్కరలేదా? మా అందరితో ఉన్న బంధాన్ని కూడా చంపేసుకోదలిచావా?" అరిచాడు ముకుందరావు.

“నాకు బంధాలు గుర్తుచెయ్యకురా వెర్రి నాగన్నా! మీ నాన్న పోయిన రోజు నుంచీ, మీ ప్రవర్తనలోనూ, మీ పథకాలలోనూ స్పష్టంగా తెలిసింది మీ బంధాల్లోని సంపెంగ సౌరభం! ఆ సంపెంగ పొదల వెనుక నాగుల్లా దాగిన స్వార్ధం! అటువంటి బంధాలలో నేను బందీని కాదల్చుకోలేదు. మీ నాన్నతో పాటే, నా మనసు కాలిపోయిందనే కదూ నా జీవితం మీద దాడికి దిగారు మీరు? నా జీవితం మీది హక్కు నాదే. దాన్ని నడిపే అధికారం నేను మీకెవరికీ ఇవ్వటం లేదు. నేను మీరున్నన్నాళ్ళూ మేడ మీదికి మారిపోతున్నాను. మీరెవ్వరూ ఈ మెట్ల మీద కాలు పెట్టొద్దు. ఈ రోజునుంచి, ఏ కర్మ కాండలు ఎలా జరుపుకుంటారో, మానుకుంటారో, ఎన్నాళ్లు ఉంటారో, వెళ్లిపోతారో... అంతా మీ ఇష్టం. నాకేమీ సంబంధం లేదు. నేను ఏదీ పట్టించుకోను. అలాగే, నా జోలికీ ఎవరూ రావద్దు.”

నిశ్చేష్టులై చూస్తున్న వాళ్ళని పట్టించుకోకుండా, మేడ మీదకు వెళ్ళి, మెట్ల మీది కటకటాల తలుపు మూసేసుకుంది స్వరూప. తలుపులు వేసేసుకున్నాక, మేడమీది ఆ చిన్నగది ప్రపంచమంత విశాలంగా అనిపించింది స్వరూపకి.

***0***



కథామంజరి సెప్టెంబర్ 2020

సంచిక విశిష్ట అతిథి

# స్నే'హితుడు'

కథ

## ఇందూ రమణ



తెలుగు సాహితీ వనంలో మరో పత్రికను స్వయంకృషితో చిగురింపచేసి, "సాహో" అనిపించి.. నిత్యం కథల నడుమ సంచరించే స్నేహ సాహో కథకుడు శ్రీ ఇందూరమణ గారు. 'కథామంజరి' జన్మదిన సంచికకు ప్రత్యేకంగా అందించిన కథ "స్నే'హితుడు'"!



# స్నే 'హితుడు'

ఇందూ రమణ

అదే పనిగా సెల్ రింగవుతోంది. వెంకటేష్ ఫోన్.

ఇంత ఉదయాన్నే ఏమైంది వీడికి? ఉలిక్కిపడి లేచాను. బాప్రే! పాతిక పైచిలుకు మిస్డ్ కాల్స్. ఏదో అయింది. ఎప్పుడూ ఫోన్ చేసి పలకరించని బడుద్దాయ్! ఈరోజు....నా మీద వీడికి ఇంత ప్రేమ ఎందుకు కలిగిందో!'

అంతుచిక్కని ఆందోళనతో అలాగే మంచం మీద కూలబడ్డాను.

వెంకటేష్! నా బాల్య స్నేహితుడు. కుమార్, రాజారావు, రామకృష్ణ, నూకరాజు. వాడూ, నేనూ ఆరుగురం అన్నదమ్ముల్లా, ఆత్మబంధువుల్లా తిరిగేవాళ్ళం. చిన్నప్పట్నుండీ ఆడినా పాడినా మా ఆరుగురమే! వేరొకరు మాతో కలిసేవారు కాదు. మేమూ కలిసేవాళ్ళం కాదు. మా ఆరుగురిలో చిరుద్యోగి వెంకటేషే! చిన్నప్పుడే తల్లీ, తండ్రీ పోవడంతో స్థానికంగా ఉన్న 'సహకార సంఘం'లో గుమస్తాగా జాయిన్ అయ్యాడు. నేను గవర్నమెంటు ఉద్యోగం సంపాదిస్తే, కుమార్, నూకరాజులు దేవాలయంలో ఉద్యోగులుగా చేరారు. రామకృష్ణ వ్యాపారస్థుడై రెండు చేతులా సంపాదిస్తున్నాడు. ఇక రాజారావు ఒక్కడే మా ఊర్లోనే ఉన్న ఆయిల్ మిల్లులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. అయితే మా అందర్లోకి 'వెంకటేష్' ఆర్థికంగా బాగా నిలదొక్కుకున్నాడు. సొసైటీలో ఉద్యోగం చేస్తూనే కథలు, కవిత్వం రాస్తుండేవాడు. సాయంత్రమైతే పార్ట్ టైమ్ విలేఖరిగా ప్రముఖ దినపత్రికకి వార్తలు రాస్తూండేవాడు. ఇవేవీ చాలవన్నట్టు ఇన్స్యూరెన్స్ కంపెనీ, చిట్ కంపెనీల్లో ఏజెంటుగా పనిచేసి అహర్నిశలూ శ్రమ పడేవాడు. సంపాదించేవాడు. అలా అని సొసైటీ ఉద్యోగాన్ని నిర్లక్ష్యం చేసేవాడు కాదు. వాడికి పద్దెనిమిదేళ్ళప్పుడు డెబ్భై అయిదు రూపాయల జీతంతో సొసైటీ ఉద్యోగంలో చేరినవాడు.. ఇవాళ నెలకి ఏభై వేలు డ్రా చేస్తున్నాడంటే నమ్మశక్యం కాదు. కానీ అది నిజం. వాడు చేరినప్పుడు కేవలం రెండు లక్షల రూపాయలే టర్నోవర్ ఉన్న సహకార సంఘం, నేడు 'కో ఆపరేటివ్ బ్యాంకు'గా మారి వందకోట్ల రూపాయలు టర్నోవర్ సాధించి, జిల్లా అంతటా సేవలందిస్తోంది. ఇప్పుడా కో ఆపరేటివ్ బ్యాంకుకు ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేషే! ఈ రోజు.... ఇంత ఉన్నతి సాధించడానికి వాడు పడ్డ పాట్లు నాకు తెలుసు. ఇన్నేళ్ళ సర్వీసులో ఎన్నో ఆటుపోట్లను చవిచూసాడు. మా అందరికీ ఒకటి రెండేళ్ళు తేడాలో పెళ్ళిళ్ళయ్యాయి. అందరం సెలవు దొరికితే బజార్లో ఉన్న కేంటీన్ దగ్గర కలిసేవాళ్ళం. సినిమాకో, షికారుకో ప్లాన్ చేసుకుని పారిపోయేవాళ్ళం. ఒకోసారి అందరం కూర్చొని పార్టీ

చేసుకుంటున్నప్పుడు మాలో ఒకరిద్దరు 'వెంకటేష్' మీద జాలి పడేవారు. కనీసం ఇంటర్ కూడా చదవని వెంకటేష్, డిగ్రీ అయినా చేస్తే వేరే ఉద్యోగం వచ్చేదనేవారు.

"నిజమేరా! నాది చిన్న ఉద్యోగమే కాని, ఎదుగుదల లేనిది కాదు. ఇవాళ కాకపోతే రేపైనా సొసైటీ అభివృద్ధి చెందుతుంది. మేమూ ఎదుగుతాము. 'రాజారావు' కోసమే ఆలోచించండిరా! కోమటెంకమ్మ కొలువు ఎన్నాళ్ళు చేసినా, ఎన్నేళ్ళు చేసినా వీడి వయసు ఆవిరైపోవాలే తప్ప 'ఆర్థికం'గా పుంజుకోలేడు. నా సంగతి వదిలెయ్యండి. వాడికో దారి చూడండి" అనేవాడు వెంకటేష్.

'అవునురా! వెంకటేష్‌గాడన్నది నిజమే'" అంటూ తన ఆవేదన తెలియజేసేవాడు రాజారావు.

అప్పటికే వెంకటేష్ విలేఖరిగా పనిచేస్తున్నాడు. మా ఊర్లో అందరి దగ్గర గౌరవ మర్యాదలు సంపాదించాడు. అటు ఏజెంటుగా కూడా కష్టపడుతున్నాడు. అప్పుడప్పుడే నెమ్మదినెమ్మదిగా ఎదుగుతున్నాడు.

"అదేదో నువ్వే ఆలోచించరా! విలేఖరిగా, 'ఏజెంటు'గా ఆరితేరావు కదా! వీడిని కూడా నీలా తయారుచెయ్యి" అన్నాడు నూకరాజు.

"వాడిలా నేను ఏజెంటుగా చెయ్యన్రా బాబూ! అందరి కాళ్ళు పట్టుకోవాలి. అవతలివాడు కాదు కూడదంటే సిగ్గుతో చావాలి!" టక్కున అన్నాడు రాజారావు.

ఆ మాటకి వెంకటేష్ మనసు చివుక్కుమంది. బాధని బయటకు తెలీకుండా "అవున్రా! నేను సిగ్గూ ఎగ్గూ లేని వాడ్నే! ఎదగాలన్నప్పుడు రాళ్ళు ఉంటాయి, రప్పలూ ఉంటాయి. అవసరం మనదైనప్పుడు తప్పదు మరి. సరే! విలేఖరిగా చేస్తావా? ఏదో కొంతవరకూ ఊరట కలుగుతుంది. ఇదేదో ఉందని అన్నం పెడుతున్న ఆయిల్ మిల్లులో మానేసేవు జాగ్రత్త. అది చేస్తూనే ఇందులో చెయ్యి" అన్నాడు వెంకటేష్.

"ఓ! అదైతే నేను రెడీ! గౌరవానికి గౌరవం ఉంటుంది. రాబడికి రాబడి ఉంటుంది" ఆనందంగా అన్నాడు రాజారావు.

"మా పత్రికలోనే ప్రక్క ఊరు డేట్‌లైన్ ఖాళీ అయింది. నేను మా బ్యూరో చీఫ్ గారితో మాట్లాడి జాయిన్ చేస్తాను. నేను మన ఊళ్ళోను, నువ్వు ప్రక్క ఊర్లో అయితే ఒకరికొకరం సహాయంగా వార్తలు రాసుకోవచ్చు" అన్నాడు వెంకటేష్.

అలా అనడమేమిటి.. ఆ వారంలోనే రాజారావుని విలేఖరిని చేసాడు. కొన్నాళ్ళు 'వార్తలు' రాయడం కూడా నేర్పించి నేనున్నానంటూ 'రాజారావు'కి ఆత్మస్థైర్యాన్ని పెంచాడు వెంకటేష్. ఆ రెండో నెల్లోనే పిడుగులాంటి వార్త మోసుకొచ్చాడు రాజారావు. వాళ్ళ రెండో అమ్మాయికి చాలా ప్రమాదంగా ఉందని, వైజాగ్ పెద్దాసుపత్రిలో జాయిన్ చేసానని చెప్పాడు. ఆ రోజు మా అందరికీ మతుల్లేవు. రాజారావు కూతురు ప్రమాదంలో ఉంది. ఆపరేషన్ చెయ్యాలన్నారట. కనీసం ఇరవైవేలన్నా అవసరమని చెప్పాడు. రాజారావు పని చేస్తున్న ఆయిల్‌మిల్లు యజమాని అయిదువేల రూపాయల వరకూ సర్దుతానని మాట ఇచ్చాడట. ఆరుగురం కేంటీన్‌లో కూర్చున్నాం. రాజారావంటే మా అందరికీ అభిమానం. ఎప్పుడు కేంటీన్‌లో టీ త్రాగినా, టిఫిన్ చేసినా రాజారావే బిల్లు కట్టేవాడు. మీ అందరిలోకి పెద్దోడ్ని కదా! పైసాదేముందిరా! పరమాత్ముడు

చల్లగా చూస్తే అనేవాడు. రాజారావు దాదాపు ఏడుస్తున్నట్టే కూర్చున్నాడు. అందరూ ఎవరి ధ్యాసలో వాళ్ళు ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉన్నారు.

"ఒరేయ్ వెంకటేష్! మీ 'సొసైటీలో' నా పేర ఓ పదిహేనువేలు అప్పు ఇప్పించరా!" ఉన్నట్టుండి వెంకటేష్‌ని అడిగాడు రాజారావు.

"అప్పా! పదిహేనువేలే! మా సొసైటీ రూల్స్ ప్రకారం గవర్నమెంటు ఉద్యోగులకి ఇరవై వేల రూపాయల వరకూ ఇస్తాంరా! మిగతా వాళ్ళకి రెండు వేలకు మించి ఇవ్వం. అయినా నువ్వు అప్పు తీసుకుంటే ఎలా తీర్చగలవురా! వద్దు" ఖరాఖండీగా చెప్పాడు వెంకటేష్.

ఆ మాటకి రాజారావు ఖిన్నుడైపోయాడు. మరి మాట్లాడలేదు. వెంకటేష్ అన్న మాటకి నేనూ ఆశ్చర్యపోయాను.

"నువ్వే ఇలా అంటే ఎలారా?" వెంకటేష్‌తో కుమార్ అన్నాడు.

"వద్దురా. హాయిగా వున్నవాడ్ని అప్పులపాలు చెయ్యడమెందుకు. ఇదిగో! నాకు నిన్ననే చిట్ కమీషన్ అందింది. ఈ అయిదువేలు నా తరఫున ఇస్తున్నాను. మీరూ తలో కొంత ఇస్తే వాడి సమస్య తీరిపోతుంది కదా!" అంటూనే జేబులో ఉన్న అయిదువేలు తీసి టేబుల్ మీద పెట్టాడు వెంకటేష్.

"భేష్‌రా! అలా చేద్దాం! నేనూ మూడువేలు ఇస్తాను" అంటూనే నేనూ మిగతా ముగ్గురం మిగిలిన పదివేలు కూడగట్టాము.

"మీరందరూ నన్ను బిచ్చగాడ్ని చేస్తున్నార్రా!" కోపంగా అంటూ దిగ్గున లేచాడు రాజారావు.

"అదేంట్రా! స్నేహితులన్నాక సహాయం చేయకూడదా! ఎందుకలా అపార్థం చేసుకుంటావ్!" రాజారావుకి నచ్చచెప్తూ అన్నాడు కుమార్.

"వెంకటేష్ గాడేదో ఆడి సొమ్ము ఇచ్చేసినట్టూ, సొసైటీ ఏదో వాడి సొంతమైనట్టూ మాట్లాడుతున్నాడు. అప్పు తీర్చలేని దద్దమ్మలా కనిపిస్తున్నానా?" రోషంగా అన్నాడు రాజారావు.

"ఒరేయ్ రాజారావు! నేను చెప్పింది నీకర్థం కావటంలేదు. నువు అప్పుల ఊబిలో కూరుకుపోకూడదని చెప్పాను" సంజాయిషీ ఇస్తూ అన్నాడు వెంకటేష్.

"మీ దయాదాక్షిణ్యాలు నాకక్కరలేదు. మీ 'సొసైటీ'లో నాకు 'అప్పు' ఎలా ఇవ్వరో చూస్తాను" అంటూ అక్కడ నుండి విసవిసా నడిచి వెళ్ళిపోయాడు రాజారావు.

ఆ మర్నాడే విలేఖరి హోదాలో 'సొసైటీ' పాలకవర్గం నెత్తి మీద కూర్చుని నిబంధనలను కాలరాసి 'ఇరవై వేల రూపాయల రుణం' సాధించాడు రాజారావు. అప్పటికే సొసైటీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి ఉన్నాడు వెంకటేష్. బోర్డు మీటింగ్‌లో డైరెక్టర్లంతా ఏకమై 'విలేఖరి రాజారావు'కు 'ఇరవై వేలు రుణం' శాంక్షన్ చేస్తే వెంకటేష్ ఏం చేయగలడు! ఆ ఆదివారం అందరం కలుసుకున్నా రాజారావు ముభావంగానే గడిపాడు. వెంకటేష్ మాత్రం నవ్వుతూ 'రాజారావు' ప్రతిభని అభినందించాడు. ఎప్పుడూ రూల్స్ రూల్స్ అనే మా ప్రెసిడెంట్ కూడా 'రాజారావు' మాటకి ఎదురు చెప్పలేకపోయాడ్రా!" అంటూ నవ్వి అందరికీ విషయం

వివరించాడు వెంకటేష్. మా అందరికీ ఆశ్చర్యం కలిగింది. అప్పు అయిన వాళ్ళకే గాని అవసరమైనవాళ్ళకి ఇవ్వరని నా కప్పుడర్థమైంది.  రాజారావు మాత్రం గర్వంగా తలూపుతూ గడిపేసాడు.  ఆ నెల తిరక్కుండానే నేను బదిలీ మీద విజయనగరం వెళ్ళిపోయాను. నేను వెళ్ళాక మిగతా మిత్రులు కూడా తరచూ కలవడం లేదని కుమార్ ఫోన్‌లో చెప్పాడు.

రెండేళ్ళు కాలగర్భంలో కలిసిపోయాయి. ఈ మధ్యకాలంలో నేను కూడా ఎవరితోనూ మాట్లాడలేదు. వాళ్ళు కూడా నాతో కాంట్రాక్టులో లేరు. ఎవరి వ్యాపారం, ఉద్యోగ బాధ్యతల్లో వాళ్ళు బిజీగా ఉన్నారని అనుకున్నాను.

ఓరోజు హఠాత్తుగా విజయనగరంలో కలిసాడు కుమార్. నాకు పట్టరాని ఆనందం కలిగింది. ఊరు విశేషాలు, మిత్రుల క్షేమ సమాచారాలు అడిగాను. అమ్మా, నాన్న నాతోనే ఉండడం వలన మా వూరికి వెళ్ళే అవసరం ఎప్పుడూ కలగలేదు నాకు.

“అందరూ బాగున్నార్రా! ఎవరి వ్యవహారాల్లో వాళ్ళు మునిగిపోయి ఉన్నారు!” అన్నాడు కుమార్.

“వెంకటేష్ ‘రచనా’ సంపాదన ఉద్యోగం ఎలా నడుస్తున్నాయిరా?” అడిగాను.

“వాడికేంరా! ‘సొసైటీ’ ని బాగా అభివృద్ధి చేసాడు. “ఏజెంటు’గా రెండుచేతులా సంపాదిస్తున్నాడు. ఇల్లు కట్టాడు. కారు కొన్నాడు” నవ్వుతూ చెప్పాడు కుమార్.

“రాజారావు, వెంకటేష్ ఇద్దరూ ఇప్పటికీ విలేఖర్లుగానే చేస్తున్నారా!” ఉత్సాహంగా అడిగాను.

“రాజారావు ఆయిల్‌మిల్లులో ఉద్యోగం మానేసి మన ఊరి విలేఖరిగా చేస్తున్నాడు. వెంకటేష్ ఇప్పుడు విలేఖరిగా చేయటంలేదు” చెప్పాడు కుమార్.

“అదేరా!?” ఆశ్చర్యంగా అన్నాను.

“సొసైటీ పాలకవర్గం వాళ్ళు ‘విలేఖరి’గా మానకపోతే ఉద్యోగం తీసేస్తామని బెదిరించి మాన్పించారు” చెప్పాడు కుమార్.

“అదేంటిరా! పాలకవర్గం అంతా ‘వెంకటేష్’ గాడి మనుషులేగా!” నవ్వుతూ అన్నాను.

“మన రాజారావుగాడే రాజకీయం చేసి ‘వెంకటేష్’ మీద ఒత్తిడి తెప్పించాడని అందరూ అంటారు. మిగతా విలేఖర్లని కూడగట్టి వెంకటేష్ మీద కత్తిగట్టి మాన్పించేసి, తను మన ఊరి విలేఖరిగా జాయిన్ అయ్యాడు. అప్పట్నుండీ వెంకటేష్  మీద లేనిపోని గాలివార్తలు రాస్తూ అల్లరి చేస్తున్నాడు!” బాధగా చెప్పాడు కుమార్.

“అయ్యో! అన్యాయంరా!” అన్నాను.

ఆ వెంటనే కుమార్ దగ్గర వెంకటేష్ ఫోన్ నెంబర్ తీసుకుని ఫోన్ చేసాను.  “హలో!” అంటూ అవతలనుండి వెంకటేష్.

“ఎలా ఉన్నావురా?” అడిగాను.‘

‘ఎవరూ?  మీరెవరో చెప్పకుండా” అవతలినుండి వెంకటేష్ గొంతు.

“నేనురా! రామూని!” అన్నాను ఆనందంగా.

"ఒరేయ్ నువ్వా! నా నెంబర్ నీకెలా దొరికిందిరా!" ఆనందంగా అడిగాడు వెంకటేష్.

"కుమార్ నన్ను వెతుక్కుంటూ వచ్చాడ్రా! వాడే ఇచ్చాడు" అన్నాను.

"నువ్వెలా ఉన్నావురా?" ఆనందంగా అడిగాడు వెంకటేష్.

"నేను బాగానే ఉన్నాను. నిన్ను 'రాజారావు' అల్లరి పెడుతున్నాడట నిజమేనా?" అప్రయత్నంగా అడిగాను.

"ఛ! ఛ! వాడు నన్ను ఎందుకు అల్లరి పెడతాడ్రా? విలేఖరి కదా! వాడి రాతలు వాడివి. ఏదో నోది వార్తలు రాయాలి కదరా!" అన్నాడు నవ్వుతూ.

"అదేంటిరా! వాడు నిన్ను టార్గెట్ చేసుకుని రాస్తున్నాడట కదరా" కోపంగా అడిగాను.

"వదిలెయ్యరా. విలేఖరి అన్నాక సవాలక్ష సమీకరణాలుంటాయి. వాడు రాసినంత మాత్రాన నేను చెడ్డవాడిని అయిపోను కదా! లీవిట్" తేలిగ్గా అనేసాడు వెంకటేష్.

"ఒకేరా! వీలు చూసుకుని ఓసారి మన ఊరు వస్తాను. అందరం కలిసి మాట్లాడుకుందాం" అన్నాను. కుమార్ కూడా "అలాగే రారా బాబూ! అందరం కలిసి చాన్నాళ్ళయింది" అన్నాడు సంతోషంగా.

రెండు నెలలు పోయాక, నాలుగు రోజులు సెలవు పెట్టి మా ఊరు వెళ్ళాను. నేరుగా కుమార్ ఇంట్లో దిగాను. నేను వచ్చానని తెలిసి నూకరాజు, వెంకటేష్ కుమార్ ఇంటికి వచ్చారు. రాజారావు, రామకృష్ణ రాలేదు. మా నలుగురం కుమార్ ఇంటి మేడ మీద కూర్చున్నాం.

"నీకో విషయం తెలుసా?" ఉన్నట్టుండి కుమార్ అన్నాడు.

"ఇప్పుడా విషయం ఎందుకురా! వాడేదో సరదాగా గడపడానికి వస్తే!" కుమార్ మాటకు అడ్డు తగుల్తూ అన్నాడు వెంకటేష్.

"ఏమైందిరా! ఏమిటా విషయం?" అడిగాను.

"వెంకటేష్‌ని ఉద్యోగం నుండి సస్పెండ్ చేసారు" బాధగా అన్నాడు కుమార్.

ఒక్కసారి అదిరిపడ్డాను. "అదేంటిరా. ఏమైంది?" బాధగా వెంకటేష్‌కేసి చూస్తూ అడిగాను.

"మామూలేరా! రాజకీయాలు" అంటూ వెంకటేష్ కొట్టి పడేసాడు.

"నాకు అంతా తెలుసురా! రాజారావు సొసైటీలో లోన్ తీసుకున్నాడు తెలుసుకదా! అది కట్టమని అందరితో పాటు వాడికీ నోటీసు పంపాడు. 'రాజారావు' విలేఖరి కదా! అగ్గిమీద గుగ్గిలంలా ఎగిరిపడ్డాడు. పాలకవర్గం మీద విరుచుకుపడ్డాడు. 'వన్‌టైమ్ సెటిల్‌మెంటు' కింద వడ్డీ గిడ్డీ లేకుండా 'రాజారావు'లోను క్లోజ్ చేయమని ఒత్తిడి తెచ్చాడు. అలాంటి 'స్కీమ్' లేదని వీడన్నా వినకుండా లేనిపోనివి కల్పించి చెప్పి పాలకవర్గాన్ని రెచ్చగొట్టాడు. వారు పాలకవర్గాన్ని ఎదిరించాడని చెప్పి సస్పెండ్ చేసారు!" కోపంగా అన్నాడు నూకరాజు.

"చాలా అన్యాయంరా! మిత్రుడై ఉండీ వాడలా చేసాడా?" ఆశ్చర్యంగా అన్నాను.

"లేదురా! ఇదంతా వీళ్ళ ఆపోహ! పాలకవర్గాన్ని ఎదిరించానని వాళ్ళే ప్రెస్టీజికి పోయి నన్ను సస్పెండ్ చేసారు. వాళ్ళు చెప్పినట్టు ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ అమలు చేయలేదని కోపంతో చేసారు. ఇందులో రాజారావు ప్రమేయంలేదు" స్థిరంగా అన్నాడు వెంకటేష్.

"వీడలాగే అంటాడ్రా! వాడెన్ని రకాలుగా వీడ్ని దెబ్బ తీస్తున్నా ఇంకా 'ఫ్రెండ్' అంటూ వాడితో మాట్లాడుతూనే ఉంటాడు. మాకే చిరాకేసి వాడితో కలవడం మానేసాం" కోపంగా అన్నాడు కుమార్.

ఆ ఆదివారం అందరూ వచ్చినా 'రాజారావు' ఒక్కడూ పనుందంటూ రాలేదు. నేనున్న రెండు రోజులూ వాడు నాకు కనిపించలేదు. ఫోన్‌లో విషయం తెలుసుకుందామని ఫోన్ చేసినా "బిజీ'గా ఉన్నారా! తర్వాత మాట్లాడతా"నంటూ ఫోన్ కట్ చేసాడు.

ఆ తర్వాత మళ్ళా కాలగర్భంలో రెండేళ్ళు గడిచిపోయాయి. వెంకటేష్ కోర్టు ఆర్డర్ మీద 'సొసైటీ'లో జాయిన్ అయ్యాడని విన్నాను. సహకార సంఘాన్ని కో ఆపరేటివ్ బ్యాంకుగా మార్చిన ఘనత వెంకటేష్‌దేనని వాళ్ళు వీళ్ళు చెప్పగా విన్నాను. నేను విజయనగరంలో పాతుకుపోయినా, నా మిత్రుల జాడలు వారి ద్వారా, వీరి ద్వారా తెలుస్తూనే ఉన్నాయి.

ఇన్నాళ్ళకు వెంకటేష్ ఫోన్ చేయడం చూసి ఆశ్చర్యపోయాను. ఒకటి రెండు కాల్స్ కాదు. ఏకంగా పాతిక పైచిలుకు మిస్డ్‌కాల్స్. ఎప్పుడూ ఏదో వ్యాపకంతో బిజీగా ఉండే వెంకటేష్ ఇంత తీరిగ్గా నాకోసం ఇన్ని 'ఫోన్‌కాల్స్' చేయడం విచిత్రమే కదా! మంచంమీద పడుకున్నానే కాని ఆలోచనలతో సతమతమవుతూనే సెల్ తీసి వెంకటేష్‌కి కాల్ చేసాను. ఈసారి లైన్ కలిసింది. ఆతృతగా వాడి మాటకోసం చెవులు రిక్కించాను.

"ఏరా! వెంకటేష్ ఏమైంది?" ఆతృతగా అడిగాను.

"ఒరేయ్ రాము! నువ్వు అర్జెంట్‌గా వైజాగ్ పెద్దాసుపత్రికి రావాలిరా! ప్లీజ్! అర్జెంటు" అంటూ ఫోన్ కట్ చేసాడు వెంకటేష్.

నాకు కాళ్ళు చేతులు ఆడటంలేదు. వెంకటేష్‌కి ఏమైంది? వైజాగ్ పెద్దాసుపత్రికి రమ్మంటున్నాడు. ఏం జరిగింది? అనుకుంటూనే గబాలున కుమార్‌కి ఫోన్ చేసాను. కాల్ కలవలేదు. నూకరాజు, రామకృష్ణ, రాజారావు. ఎవరి ఫోన్లు అందుబాటులోకి రాలేదు. రాజారావుని అడిగినా విషయం చెప్పడు. కుమారో, నూకరాజో, రామకృష్ణో ఈ ముగ్గురిలో ఎవరో ఒకరు కలిస్తే బాగుండును అనుకుంటూ 'సెల్‌ఫోన్' తో ముగ్గురికి రింగ్‌లు ఇస్తూనే ఉన్నాను. ముగ్గురూ 'నో రెస్పాన్స్'! 'ఏమైంది ఈ ముగ్గురికి? భగవంతుడా ఎవరికీ ఏమీ కాకూడదు? అందరూ ఆనందంగా ఉండాలి' మనసులోనే సాయిబాబాని వేడుకున్నాను. ఫోన్ కేసి చూస్తూ కూర్చుంటే కాలం కరిగిపోతుంది. గబగబా తయారయి కాంప్లెక్స్ కు వచ్చి, వైజాగ్ వెళ్లే నాన్‌స్టాప్ బస్సు ఎక్కాను. బస్సులో కూర్చున్నానన్న మాటే గాని నా మనసంతా ఆందోళనతో నిండిపోయింది. ఎవరూ అందుబాటులోకి రాలేదు. ఆతృత అధికమైపోతోంది. గుండె దడ ఆగటంలేదు. గంటలో వైజాగ్ చేరుకున్నాను. అక్కడనుండి ఆటోలో పెద్దాసుపత్రి దగ్గరకు చేరాను. ఇంతలో మళ్ళీ వెంకటేష్ ఫోన్. ఛటుక్కున ఫోన్ ఎత్తాను.

"వచ్చావా! ఎమర్జెన్సీ వార్డుకి వచ్చెయ్! నేను అక్కడే ఉన్నాను" ఆందోళనగా అన్నాడు వెంకటేష్. విషయం చెప్పడు. కనీసం నా మాట కూడా వినకుండా పెట్టేసాడు. మళ్ళీ రింగ్ చేస్తే ఎంగేజ్! ఇంకెవరితో

మాట్లాడుతున్నాడో? ఏమో? వెంకటేష్ చెప్పినట్టు ఎమర్జెన్సీ వార్డు దగ్గరకు పరిగెట్టాను. వార్డు బయట రాజారావు భార్య., పిల్లలు ఏడుస్తూ కూర్చున్నారు. వాళ్ళని చూస్తూనే కొంత విషయం అర్థమైంది. ఇంతలో వెంకటేష్ ఎక్కడినుండో ఆతృతగా వచ్చాడు. వాడి మొహంలో చెప్పలేని ఆందోళన. క్షణం ఒక దగ్గర నిలబడలేనంత ఆందోళనలో ఉన్నాడు.

“అరేయ్ వెంకటేష్! ఏమైందిరా! రాజారావు భార్య, పిల్లలు అలా ఏడుస్తున్నారేరా?” వెంకటేష్ చెయ్యి పట్టి అడిగాను.

“రా! రా!” అంటూ నన్ను ఎమర్జెన్సీ వార్డు దగ్గరకు లాక్కెళ్ళి అద్దంలో నుండి లోపల బెడ్ వైపు చెయ్యి పెట్టి చూపించాడు.

రాజారావు! అపస్మారక స్థితిలో ఆక్సిజన్ మాస్క్ తగిలించుకుని మంచం మీద పడి ఉన్నాడు. “ఏమైందిరా?” ఆందోళనగా అడిగాను.

“రాత్రి ఫ్రెన్ నుండి వస్తూ డివైడర్‌ని గుద్దేసాడటరా! తలకి గట్టి దెబ్బ తగిలింది. మెదడులో రక్తం గూడు కట్టుకుందని అంటున్నారు. అర్జెంటుగా ఆపరేషన్ చెయ్యాలట. ఇక్కడ కుదరదట. ప్రైవేటు హాస్పటల్‌కి తీసుకుపొమ్మన్నారు” బాధగా దాదాపు ఏడుస్తున్నట్టే చెప్పాడు వెంకటేష్. “వెంకటేష్! రాజారావుకి కావలసినవాళ్ళు ఎవరూ లేరా?” అయోమయంగా అడిగాను. “ఎవరున్నార్రా! పాపం! చిన్న పిల్లలురా! మంచైనా చెడైనా చిన్నప్పట్నుండి మనతోనే కదరా ఉన్నాడు. వాడికి ఇంకెవరున్నార్రా” కళ్ళల్లో నీళ్ళు జలజల కారుతుంటే కనిపించకుండా చేత్తో తుడిచేసుకుంటూ అన్నాడు వెంకటేష్.

“నిజమే! మరిప్పుడు మనమేం చేయగలం?” అన్నాను మీమాంసతో

“అయిదు లక్షలు ఆపరేషన్‌కి కావాలన్నారు. నా కారు అమ్మేసాను. మరో అయిదు నిమిషాల్లో ఆ డబ్బు చేతికి వస్తుంది. వెంటనే మనం ఇక్కడనుండి ప్రైవేటు ఆసుపత్రికి రాజారావుని పట్టుకుపోవాలి. అంబులెన్స్ కోసం ఎదురు చూస్తున్నాను” గబగబా గాబరాగా చెప్పాడు వెంకటేష్. “మన మిత్రులు మిగతా వాళ్ళేర్రా?” అడిగాను.

“వాళ్ళు ముగ్గురూ ఢిల్లీ, ఆగ్రా, టూర్ వెళ్లార్రా! వాళ్ళకి ఫోన్ చేసి వాళ్ళ ఆనందాన్ని పాడు చేయడం ఎందుకు! విషయం తెలిసినా వాళ్ళు రాలేరు. ఆనందంగా ఉండలేరు. అందుకే వాళ్ళకి నేను ట్రై చెయ్యలేదు!” అంటూ ఎవరో రావడం చూసి గబాలున అటు పరుగెట్టాడు వెంకటేష్. అతనెవరో బ్యాగ్‌తో తెచ్చి ఇచ్చిన ‘డబ్బు’ నేరుగా వచ్చి నా చేతికిచ్చాడు వెంకటేష్. ఇంతలో అంబులెన్స్ వచ్చింది. వచ్చీరావడంతోనే స్ట్రెచర్ మీద రాజారావుని పడుకోబెట్టి అంబులెన్స్ లోకి ఎక్కించారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రక్కనే అన్నీ ప్రైవేటు ఆసుపత్రులే.

రాజారావుకి ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ టైమ్‌లో రక్తం అవసరమని డాక్టర్లు చెప్పేసరికి నేనూ, వెంకటేష్ వెళ్ళాం. మా ఇద్దరి దగ్గర రక్తం తీసుకుని దానికి సరిపడా ‘రాజారావు’ గ్రూప్ రక్తం హాస్పిటల్ వాళ్ళే ఏర్పాటు

చేసారు.
మూడోరోజు రాజారావుకి తెలివి వచ్చింది. పేషెంట్‌కి ఇక భయం లేదని చెప్పారు డాక్టర్లు. రాజారావు భార్య, పిల్లలు ఏడుస్తూ వెంకటేష్ దగ్గరకు వచ్చారు. వెంకటేష్ కాళ్ళమీద పడి ఏడ్చేసింది రాజారావు భార్య. పిల్లలు అంకుల్ అంటూ వెంకటేష్‌ని పట్టేసుకున్నారు. నేను వెంకటేష్ కేసి చూసి ఆశ్చర్యపోయాను.
స్నేహితుడని ఆలోచించకుండా ఇన్నాళ్ళూ 'వెంకటేష్' పతనం కోసం పోరాడిన రాజారావు పట్ల, కించిత్ కూడా కోపం, 'ద్వేషం' కలగని వెంకటేష్ మొహంలో నిశ్చింత చూసాను. మిత్రుడు ప్రాణాపాయం నుండి బయటపడ్డాడన్న ఆనందం చూసి ఆశ్చర్యపోయాను. రాజారావుకి తెలివి వచ్చిందని తెలిసి అతని భార్య, పిల్లలు లోపలకెళ్ళారు. వెంకటేష్, నేను బయట బల్ల మీద కూర్చున్నాం.
"ఏరా! రాజారావు నీకెంతో అపకారం చేసాడని తెలిసి కూడా వాడికోసం నువ్వెందుకురా ఇంతలా ఆందోళనపడ్డావు" వెంకటేష్ భుజంమీద ఆప్యాయంగా చెయ్యేసి అడిగాను.
"నాకు అపకారం చెయ్యలేదురా! ఉపకారమే చేసాడు. రెండేళ్ళు రోడ్డుమీద ఎంతో కసిగా తిరిగి 'ఏజెంటు'గా లక్షలు సంపాదించాంరా! అయినా వాడు మన స్నేహితుడురా! వాడేదో తెలీక తప్పు చేసాడు. ఎంతైనా వాడు మన బాల్య మిత్రుడే కదరా! చూస్తూ చూస్తూ వాడ్ని చంపుకుంటామా? వాడు మనందరికీ కడుపు నింపేవాడ్రా! అదెలా మర్చిపోగలంరా!" బాధగా నా భుజం మీద వాలిపోతూ అన్నాడు వెంకటేష్.
వెంకటేష్ ఔదార్యానికి నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.
"వస్తారా" అంటూ లేచాడు వెంకటేష్.
"అదేరా! వాడ్ని కలిసి చూసి పరామర్శించి వెళ్దాం, ఉండు!" అంటూ వెంకటేష్ చెయ్యి పట్టుకున్నాను.
"వద్దురా! వాడు నన్ను చూస్తే ఆందోళన పడతాడు. బి.పి. పెరిగిపోతుంది. ఈ సమయంలో వాడి ఆరోగ్యానికి అది అంత మంచిది కాదు. ప్లీజ్! నువ్వు కూడా వాడి దగ్గర ఎట్టి పరిస్థితుల్లోనూ నా పేరెత్తకు. రాజారావు భార్యకు కూడా చెప్పాను. వాడు పూర్తి ఆరోగ్యవంతుడై ఇంటికొచ్చాక అందరం కలుద్దాం. నువ్వు వాడ్ని కలిసిరా! వస్తా" అంటూ మరిక నా సమాధానం కోసం ఎదురు చూడకుండా వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు వెంకటేష్.
స్నేహితుడంటే పగబట్టే పాములాంటివాడు కాదని ప్రాణమిచ్చే స్నే'హితుడ' ని నిరూపించాడు వెంకటేష్!!

***0***





కథామంజరి అక్టోబర్ 2020

సంచిక విశిష్ట అతిథి

# భయం - అభయం

## విహారి

కథ



ఎనిమిది దశాబ్దాల వయసులో.. ఆ తరం ఈ తరం కథలకీ, కథకులకూ మధ్య వారధిలా నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన కథాయువకులు శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి గారు. అస్వస్థతను కథ రాయాలనే తలంపుతో జయించి, కథామంజరి జన్మదిన సంచిక కోసం వారి కలం ఝులిపించిన కథారత్నం "భయం - అభయం'



# భయం – అభయం

## విహారి

కీర్తి ఇంటితాళం తీస్తుంటే ఇవ్వాళకూడా నవ్వింది ఇందిర. వారం రోజుల్నుంచీ ఇట్టాగే నవ్వుతోంది. పెదవుల కదలికతో అదోరకంగా వంకరనవ్వు! ఇప్పుడెందుకో గుండెల్లో సూదితో గుచ్చినట్లయింది కీర్తికి. ఆమె నవ్వులో ఏదో హేళన, వ్యంగ్యం ధ్వనిస్తున్నై. కళ్లు చెమర్చినై. రాబోయే కన్నీటిని ఆపుకుంది.

తాళం తీసి మళ్లీ చూపు అటే మరల్చితే.. ఇందిర భుజాలపై నుంచి చూస్తూ.. తాను కూడా అదే రకపు నవ్వుని విసురుతోంది శారద ఆంటీ. ఆమె ఇందిర తల్లి.

ఇల్లు వాళ్లదే. ఆరేళ్ల నుంచి తామే అద్దెకుంటున్నారు. లోపలికొచ్చి బ్యాగ్ పక్కన పడేసి కూచుంది.

ఇందిరతో తనకు మంచి స్నేహమే ఉంది. తన కంటే పెద్దది. మానసక్క క్లాస్ మేట్. ఇప్పుడు బికాం రెండో సంవత్సరం. 'చదువులో 'దౌడు' లేదు మా మొద్దుకి' అంటూ వుంటుంది శారద ఆంటీ. మానసక్క చాలా తెలివి కలది. టెన్త్ లో స్టేట్ ర్యాంక్. ఇంటర్ లోనూ టాపర్. ఎంట్రన్స్ రాసి అందులోనూ మంచి స్థానంతో విజయవాడ కాలేజీలోనే ఆర్కిటెక్చర్ చదువుతోంది. హాస్టల్ లోనే ఉంటుంది. వారం వారం పెద్దక్క శ్రుతీ, తనూ గుంటూరు నుంచి వెళ్లి చూసివస్తూ ఉంటారు. పర్మిషన్ పెట్టి తానూ వస్తూ ఉంటుంది.. అప్పుడప్పుడూ. ఇప్పుడా కోర్స్ రెండో సంవత్సరం జరుగుతోంది. ఆలోచనతో పక్కకి చూసింది. టేబుల్ మీద ఫొటో! అమ్మానాన్నా!

నాన్నకి చిన్న స్టేషనరీ షాపు ఉండేది. అమ్మ పబ్లిక్ సెక్టార్ కంపెనీలో చిన్న గుమాస్తా. శ్రుతి అక్క, మానస, తానూ.. వాళ్లకంటి వెలుగులుగానే పెరిగారు. పెద్దక్కంటే అమ్మానాన్నలకి అమిత ప్రేమ, వాత్సల్యం. మానస కంటే ఎనిమిదేళ్లు పెద్దది. 'అమ్మ పోలిక. అమిత ఆత్మస్టైర్యం' అని మెచ్చుకుంటూ ఉండేవాడు నాన్న. అంతా సాఫీగా సాగుతుంటే జీవితమే కాదు అంటారు. తమ విషయంలోనూ అది నిజమైంది.

ఒకే ప్రమాదంలో అమ్మా నాన్నా ఇద్దరూ మరణించారు.

నాన్న మాటని నిజం చేస్తూ ఆత్మస్థైర్యంతో నిలబడింది పెద్దక్క. నాన్న స్నేహితుడు రాజారావ్.. అమ్మ ఆఫీసు చుట్టూ తిరిగి చాలా శ్రమపడి, శ్రుతికి కారుణ్య నియామకం వచ్చేట్టు చేశాడు. అమ్మ ఉద్యోగం పెద్దక్కకి వచ్చింది. షాపు అమ్మేసి వచ్చిన డబ్బుతో, మానసక్కని కోర్సులో చేర్పించింది. తాను ఇంటర్ లో జాయినైంది.

ఫోన్ రింగయింది. చూసింది. పెద్దక్క! "ఇంటికొచ్చావా కీర్తీ?" రోజు ఈ సమయంలో ఇదే 'కాల్'!

"ఆ ... ఇప్పుడే" అని సమాధానం ఇచ్చి లేచింది. బాత్ రూమ్ కి పోయి ఫ్రెష్ అయి వచ్చి, డబ్బాలో ఏం వుందో చూస్తే, బూంది కనపడింది. ప్లేట్ లో పెట్టుకుని తిందామనుకొన్నది. కానీ తినలేకపోయింది. ఇందిర నవ్వే వెంటాడుతోంది. దీని సంగతేమిటో తేల్చుకుంటేనే మంచిది.. అనిపించింది. ఠక్కున ఫోన్ చేసింది.

ఇందిరే 'హలో' అని వాళ్లమ్మకిచ్చినట్టుంది, ఆమె మాట్లాడటం మొదలెట్టింది. "చెప్పు కీర్తీ"

ఎట్లా చెప్పాలి, ఎలా అడగాలి? క్షణం సేపు ఆలోచించి అనేసింది కీర్తి, "ఎందుకో మీ ఇద్దరూ అదోలా నవుతున్నారు ఆంటీ. నాకు బాధగా ఉంది!"

"మేం నవ్వినందుక్కాదు బాధపడాల్సింది!" అని "ఇరుగు పొరుగంతా నవ్వుతోంది. లోకం కళ్లు మూయలేముగా"

"అంటే?"

"అంటే వివరంగా చెబుతా విను. ఇవ్వాళ కాకపోతే రేపయినా, నువ్వో మీ అక్కో అడుగుతారని నాకు తెలుసు. మీ అక్క ఆ రాజారావ్ తో తిరుగుతోంది!" అన్నది. ముక్కుమీద గుద్దినట్లైంది కీర్తికి. మాట రాలేదు.

శారదే చెప్పుకుపోతోంది. "ఆయన మీకు సహాయం చేసి వుండొచ్చు. మీ నాన్నకి స్నేహితుడు అయితే అయ్యుండొచ్చు. కానీ పెద్దవాడు. మీ అక్కకిదేమన్నా బాగుందా. మొన్న మా పనిమనిషి వెంకమ్మ అడిగింది, "అమ్మా.. వాళ్ళని ఇల్లు మారమంటే బాగుంటుంది!" అని. అంటే వాళ్లకీ తెలిసిందనేగా. పైగా నువ్ లేనప్పుడు ఆయనా అదీ వచ్చి ఇంట్లో, గంటలు గంటలు గడుపుతారు.. తెలుసా నీకు?" అని గద్దించింది.

కీర్తికి మనసంతా కలచినట్లైంది. శరీరం మీద కర్రువాతలు పెడుతున్నట్టయింది. అందునా అక్కని 'అది' అన్నది.

"ఎటూ ఇవ్వాళో రేపో మీ అక్కకి చెబుదామనే అనుకుంటున్నాను ఇల్లు ఖాళీ చెయ్యమని!" అని క్షణం ఆగింది.

కీర్తి ఇంకా తెప్పరిల్లలేదు. ఉప్పెనలో కొట్టుకుపోతున్నది ఆమె మనసు.

"నేనూ ఒంటరి ఆడదాన్నే. పదేళ్ల నుంచీ ముగ్గురు పిల్లల్ని సాకుతూ పరువూ మర్యాదగా బతకటంలా?" అని ఫోన్ కట్ చేసింది.

కీర్తికి పెదవులు వణికి, ఉద్వేగంతో కళ్ల వెంట నీళ్ళొచ్చినై. తలనిండా అక్క గురించీ, రాజారావ్ గురించీ గజిబిజి ఆలోచనలు. ఏదో అవమానపు హోరు!

ఏం చెయ్యాలో తోచని అయోమయం. లేచి అస్తిమితంగా కలయ తిరగసాగింది.

నిముషాలు గడుస్తున్నై.

మానసక్క ఫోన్! మామూలు బోల్డు కబుర్లు. హాస్టల్ బతుకులో గతుకులూ, ముళ్లూ, రాళ్లూ!

"నువ్ మాట్లాడవేమే మూగదానిలా?" అని గద్దించింది మానస.

ఉలిక్కిపడ్డట్టయి, నెమ్మదిగా మొదలెట్టి, జరిగిందంతా చెప్పేసింది! పెద్ద బరువు దించుకున్నట్లైంది!

* * *

ఆ రాత్రి -

అప్పటిదాకా ఒంటరిగా తన హృదయంతో చేసిన సంభాషణనంతా, పెద్దక్క ముందు వెళ్లబోసింది కీర్తి. చెల్లెలు కళ్లల్లో యిదివరకెప్పుడూ చూడనన్ని కన్నీళ్లని చూసింది శ్రుతి. వ్యాకులమైన మనస్సుతో జరిగిన ఘటనల్ని విశ్లేషించుకుంటుంటే, ఒకదానికొకటి విరుద్ధమైన తర్కాలు ఎదురు నిలిచాయి. అసలు విషయం ఇంకా జటిలం కాకూడదని ఒక నిశ్చయానికొచ్చింది. వచ్చే శనివారం పర్మిషన్ తీసుకుని గుంటూరు రమ్మని మానసకి ఫోన్చేసింది.

తండ్రి మాట గుర్తుకొచ్చింది, "శ్రుతిది వాళ్లమ్మ పోలిక. ఆత్మస్థైర్యం ఎక్కువ"

"అవును. సమస్య నాది, పరిష్కారమూ నాదే కావాలి కదా!" అనుకున్నది. అనుకోలేదు, పైకే అన్నది. "నువ్వు హాయిగా ప్రశాంతంగా పడుకోవే కీర్తీ. అన్నీ నే చూసుకుంటాగా" అని "నేనూ ప్రశాంతంగానే నిద్రపోతా, తెలుసా" అని నవ్వేసింది.

అక్కవైపు అమాయకంగా చూసి, అటు తిరిగి పక్క మీదికి చేరింది కీర్తి. ట్యూబ్ లైట్ ఆపి తానూ పక్కమీద నడుం వాల్చింది శ్రుతి!

***

శనివారం-

కను చీకటి పడేవేళకి మానస ఇల్లు చేరింది.

రాత్రి భోజనాలైనాయి. ముగ్గురూ మధ్య గదిలో కూచున్నారు.

ఉన్నట్టుండి ఎటో చూస్తున్నట్టు తల తిప్పుతూ అన్నది మానస "కీర్తి చెప్పిందాన్ని బట్టి చూస్తే.. జనఘోష ఎక్కువగానే వుందనిపిస్తోంది. నాకు చాలా బాధగా ఉంది"

శ్రుతి ఓరగా చెల్లెలి వైపు చూసింది. "అవును ఇదొక 'న్యూసెన్స్' గానే కనపడుతోంది" అన్నది కీర్తి.

శ్రుతికి లోలోపల కొంత చికాకుగా ఉన్నది. పైకి మాత్రం చెల్లెళ్ల భావాల్ని వినదలచుకుని మౌనం వహించింది.

"ఇల్లు ఖాళీ చేస్తే దరిద్రం వదులుతుంది!" కీర్తి కోపమూ, అసహనమూ!

"మాసిన గుడ్డల్ని ఉతుక్కుంటాం కానీ, చింపి బయట పారేసుకుంటావుటే?" అన్నది మానస.

'ఎట్టాగైనా మానస తెలివిగల పిల్ల!' అనిపించింది శ్రుతికి. మనసు ముచ్చటపడింది. అంతలోనే, 'దానికి నా సర్టిఫికెట్టేమీ అక్కర్లేదు. చాలా కితాబులున్నై' అని అనిపించి నవ్వుకుంది.

“నువ్ చెప్పక్కా!” అన్నది కీర్తి.

క్షణం తర్వాత మాటలు కూడదీసుకుని మొదలెట్టింది శ్రుతి. “అమ్మా నాన్నా పోయిన తర్వాత అసలు మనం ఎట్టా బతకాలా.. అన్న ప్రశ్నతోనే సతమతమైపోయాం. పెద్దదాన్ని కనుక, నాకా బాధ్యత తప్పలేదు. మీకూ తెలుసు.. మంచి మనసున్న మనిషిగా, నాన్న స్నేహితుడుగా, రాజారావుగారు మనకు చేయందించాడు. నిజానికి దాని వలన ఆయనా చాలా ఇబ్బందులు పడ్డాడు. నాకు ఉద్యోగం రావటానికి కేవలం ఆయన పూనికా, ప్రయత్నమే కారణం కదా. అటు అధికారుల దగ్గరా, ఇటు యూనియన్ లోనూ ఆయన మాటకున్న విలువా, గౌరవం వలన ఫలితం దక్కింది!” చెల్లెళ్ల వైపు చూసింది.

మానస, కీర్తి ఉత్కంఠతోనే వింటున్నారు. మళ్లీ చెప్పసాగింది శ్రుతి. "పచ్చగా ఉన్న కొమ్మల్ని చూస్తే, ఎండు కొమ్మలకి ఈర్ష్యగానే ఉంటుంది. ఈ లోకం, లోకం అనుకుంటామే, అదీ అంతే. అదసలు రూపంలేని జీవి. సంతృప్తితో కళకళలాడే మనుషుల్ని చూస్తే వాళ్ల మీద జులుం చలాయించాలని ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఎందువల్లనో తెలుసా?”

చెప్పమన్నట్టు చూశారు ఇద్దరూ.

“ఎందువల్లనంట .. ఈ పచ్చగా, సంతృప్తితో కళకళలాడే మనుషులకి భయం ఎక్కువ. సృష్టిలో అసలైన శాసనకర్త ఈ భయమే. ఈ భయస్థుల్నీ, పిరికివాళ్లనీ చూసి, వాళ్లు ఒదిగి ఉంటున్న కొద్దీ 'లోకం' అనే ఆకారంలేని భూతం నెత్తిన మొత్తుతూనే ఉంటుంది”

“ఈ పాఠం చాల్లే గానీ, ఏం చేద్దామంటావ్?” కీర్తికి అసహనం జాస్తి!

పెద్దగా నవ్వింది శ్రుతి. “చూశావా నువ్వా భూతం కల్పిస్తున్న 'భయం'తో సతమతమౌతున్నావ్. అందుకే తొందరా, ఏదో ఒకటి చేసి దానిమీద కసి తీర్చుకోవాలనే కోపం”

“అవును. బాగా చెప్పావ్” అన్నది మానస.

"కీర్తీ! నువ్వాభూతాన్ని శారద ఆంటీ, ఇందిర, వెంకమ్మ.. ఇలా ఇద్దరు ముగ్గురు మనుషులుగా భావిస్తున్నావ్, అలా చూస్తున్నావ్. అదే అసలు మర్మం. ఆ 'లోకం', ఒకరిద్దరు నోరుగలవాళ్ల రూపంలో- భయస్తుల్ని ఇంకా ఇంకా భయ పెడుతుంది. మాటల సూదులు గుచ్చుతూ వెంటపడుతుంది. వీళ్లేమో ఆ భయాన్ని గుప్పిట పెట్టుకుని ఛస్తూ బతుకుతూ ఉంటారు”

“అవును. ఆ పరిస్థితి ఖచ్చితంగా ఇంతే. ఇలాగే జరుగుతుంది” మానస.

“సరే కీర్తి! మన విషయానికొస్తాను!” అని చెల్లెలి భుజం తట్టి చెప్పింది శ్రుతి. “శారద ఆంటీ అండ్ కంపెనీ, నేనూ రాజారావ్ గారూ సన్నిహితంగా కలిసి మెలిసి తిరగటం చూసి ఏకంగా రంకులు కట్టి మానసికంగా సంతోషిస్తున్నారు. ఒక్క క్షణం మీరిద్దరూ ఆలోచించి చెప్పండి. అమ్మా నాన్నా ఉన్నప్పుడు, మనలో ఎవరో ఒక్కరమే ఇంట్లో ఉన్నప్పుడు, ఆయన ఎన్నోసార్లు మనింటికొచ్చి కూచోలేదూ?”

తలలు ఊగినై.

“ఇప్పుడూ అలాగే మేం మాట్లాడుకోదలచిన విషయాలు చాలా ఉన్నప్పుడు ఇద్దరమూ కలిసి ఇంటికొస్తాం. అట్టాగే నేనూ వాళ్లింటికి సవాలక్ష సార్లు వెళ్తున్నాను!” అని “నాకూ ముప్పై ఏళ్ళొచ్చినై ఒంటి మీదికి. ఆయనకి ముప్పై ఎనిమిది. నేనాయన్ని పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను. సమయం వచ్చినప్పుడు చెబుదామనుకున్నా. ఆ సమయాన్ని ముందుకు లాక్కొచ్చింది సోకాల్డ్' లోకం!” అని నవ్వేసింది శ్రుతి.

మానస, కీర్తి ఒకరి మొహాలొకరు చూసుకుంటుంటే అడిగింది శ్రుతి “అదేంవిటే... అట్లా స్టన్నయ్యారు. నాకు కంగ్రాట్స్ చెప్పరా?” అని.

త్రుళ్లిపడి, ఆశ్చర్యం నుంచి తేరుకుని "కంగ్రాట్స్ అక్కా” అన్నారిద్దరూ.

శ్రుతి కళ్లు మెరిశాయి. ‘అయినా వీళ్ల మనసుల్లో ఇంకా చాలా సందేహాలూ, అనుమానాలూ మిగిలే ఉంటాయ్’ అనిపించింది.

“మానసా, కీర్తీ! మనం ముగ్గురమూ ఒక యూనిట్. ఈ యూనిట్ ఇలాగే పచ్చగా ఉండాలంటే, చాలా దోహద క్రియలు కావాలి. దక్షత ఉన్న మనిషి అండ కావాలి. దక్షత అంటే మంచితనం, సహకారం, ఉపకారం మాత్రమే కాదు, డబ్బు కూడా. మీరిద్దరూ ఒక స్థాయిలో స్థిరపడాలంటే మనకు ఆర్థిక సహకారమూ కావాలి. ఏ షరతులూ లేకుండా వీటన్నిటినీ అందించే మంచి మనసున్న మనిషి రాజారావుగారు. ఇక ప్రేమ గురించి చెప్పేదేముంది?” క్షణం ఆగి,

“అందుకని నాకు మా పెళ్లి సబబుగానే తోచింది” అని “నా పెళ్లి మీ ఇద్దరి లక్ష్య సాధనకీ తోడుదీపమైతే అంతకంటే కావలసినదేముంది? అలాగే, నా పెళ్లి, మీ పెళ్లిళ్లకి అడ్డురాకుంట.. నేను బతుకు పోరులో గెలిచినట్టే కదూ? ఏమంటారు?”

ఇద్దరూ ఉలికిపాటుతో అక్కని చూశారు.

ఏమనాలో తేల్చుకోలేక 'అవునవును' అన్నారు, నేల చూపులతో. మాట స్ఫుటంగా లేదు. నీళ్లు నములుతున్నట్టు ఉంది. నవ్వుకుంది శ్రుతి. 'వీళ్లిద్దరి మనసుల్నీ వేధిస్తున్న అసలు ప్రశ్న వేరే ఉంది. నాకు తెలుసు' అనుకుని స్తిమితంగానే చెప్పింది.

“ఈ 'లోకం' లాగానే మీకూ మనసులో ఒక అనుమానం పీకుతోంది!” అని క్షణం ఆగి, “రాజారావు గారికి పెళ్లయిన మాట వాస్తవం. ఆయనకు పెళ్లయిన మర్నాడే దురదృష్టవశాత్తూ భార్య పాము కాటుకు గురయి మరణించింది. అంటే, ఆయన పెళ్లయిన బ్రహ్మచారి. కుటుంబం ఉన్నది.. అమ్మా, నాన్నా!” అన్నది.


మానసా, కీర్తి అక్కని ఆరాధనా భావంతో చూస్తూ ఉండిపోయారు.

“ఇద్దరికిద్దరే పిచ్చిపిల్లలు. అక్కంటే నమ్మకమూ, లోకమంటే భయం!” అని నవ్వుతూ, లేచి ఇద్దరినీ దగ్గరికి పొదవుకుంది శ్రుతి.

ముగ్గురి కళ్లల్లోనూ నీటి ముత్యాలు!

***0***

కథామంజరి నవంబర్ 2020
సంచిక విశిష్ట అతిథి



# తప్పు తాళం కప్పదే

## ఆదూరి వెంకట సీతారామ మూర్తి


కథ



చిన్న కథైనా, పెద్ద నవలైనా బాగా మనసుని, మస్తిష్కాన్ని కదిలించిన తర్వాతే దానికి అక్షర రూపాన్నిచ్చి, హత్తుకునే కథలను అందించిన కథాఋషి శ్రీ ఆదూరి గారు. ఉత్తరాంధ్ర మాండలికంలో పరకాయ ప్రవేశం చేసి, ఒక్కసారి గుండెని గుభేలుమనిపించినా, ఆ గుండెలోనే గూడుకట్టుకుని నిలిచిపోయే కథ "తప్పు తాళం కప్పదే!". రచన మాసపత్రిక నుంచి పునర్ముద్రణ కథామంజరి జన్మసంచిక కోసం!!

# తప్పు తాళం కప్పదే

ఆదూరి వెంకట సీతారామ మూర్తి



అసలీ తగువంతా ఆ బాబుగోరు కేంపు కెళ్లడం వొల్లే వొచ్చిందండి. నా మానాన నేను ఆ ఎపార్టుమెంటులో నైటు వోచ్ మెన్ పన్జేసుకుంటూ యిటు రోజవారీ పన్లోకి పోతూంటే, ఓ దినం ఆ బాబు పిలిసి అడిగినారండీ. అదిగో అలా మొదలైంది.

అసలికి మాది విజీనారం సైడ్ల వున్న పల్లెటూరండి. అక్కడ పండిచ్చుకోడాన్కి పంటల్లేక, పనుల్దొరక్క యిలా పట్నాలంబడి పనులకొచ్చేసినామండి. నాసేనేటండి... నా నాగ శానామందే... వొంట్లో కాస్తంత కండున్న పెతివోడూ పట్నాలకెగబడి పనుల కోసం వొచ్చేసినారండి.

ఎవడదుష్టం వాడిది... ఎవడి కండబలం వాడిది. కదండీ? నాను మొదట్లో ఒంటిపిల్లి రాకాసినాగ ఒక్కడ్నే వుండిపోన్ను. నమ్మరుగానండీ నాకైతే వొచ్చిన వోరం రోజులవరకూ పస్తులేనండి. తిండానికి సేదు. తొంగోడానికి సోట్నేదు - ఒకపూట పనిదొరికితే నాల్రోజులు దొరకదు - ఆయాల టయాంకి పందోడిపాలెం నాయ్డు నాకు బస్టాండ్లో అవుపడకపోతే నాసెనక్కి మావూరు ఎలిపోదునండి వుత్తి చేతులూపుకుంటూ. కానైతే నాయ్డు నాకా మాట సాయం జేసి పెట్టినాడండి. నాసెందుకొచ్చేనో కనిపెట్టి ఎనక్కెలిపోడం పురుసలచ్చనం కాదన్చెప్పి, ఆయనగోర్కి తెల్సిన ఓ కంటాట్రు బాబుకి వొప్పజెప్పేడండి.

అంతే. పనేటని అడగనేదు - ఏటిస్తారనీ అడగనేదు. ఆయనగారు చెప్పిందే పని. యిచ్చిందే బత్తెం. తెల్లార్లెగిసిన కాడ్నించి సీకటొడే వొరకూ పనేనండి. అయితేనేటండి...వారం తిరిగేసరికి సేతుల్లో డబ్బులు కళ్ళ జేసేనండి. మొదటోరం అయిదొందలు యిచ్చినాడండి. రూపాయలే. నాసెక్కువే పన్జేసేనో... తక్కువ డబ్బే ముట్టిందో సూడ్లేదండీ. ఎంతో కొంత పనంటూ దొరికింది గదండీ. అది సాలనుకున్నాను - ఈ కరువు రోజుల్లో వొర్నాదారమైన పంటల్నీ మా నాయకుడి మాటల్నీ నమ్ముకుని అక్కడే కూకుంటే అదీరాదు గదండీ. రెండు నెల్లు.. ఏటి తిన్నానో ఎలా వున్నానో తెలీకుండా గడిసిపోయిందండి. నా కర్సులు పోను సేతిలో కొంత డబ్బు మిగిలిందండి. అంతే. మా యింటి కాడున్న ముసిలోళ్లకీ, మా యాడదానికి బట్టలు కొన్నానండి. రొండ్రోజుల్లో తిరిగొచ్చేస్తానని బాబుగోరికి చెప్పేనండి. బాబుగోరు ఏ పన్జెబితే ఆ పని నమ్మకంగా చేసి పెడతాను గదండీ. అంచేత ఆయనకు నా మీద గురి ఏర్పడిపోనాదండి. ఓ సెనం ఆలోచన చేసి "సరే ఎళ్ళి రారా"అన్నారండి.

అంతేనండి. నా యీపెనకాల రెక్కలొచ్చినట్టు ఎర్రబస్సులో ఎగిరెల్లి పోనానండి. వొర్సాల్లేకా, ఎవసాయ పన్లు దొరక్క దొరికినకాడికి అప్పుజేసి బిక్కు బిక్కుమని నా కోసరం చూస్తన్నారేమో మా అయ్యకీ అమ్మకీ నన్ను జూసి పేనం లెగిసొచ్చినట్టుండాలి గదండీ. కానీ పరిస్థి అలా నేదండి. నన్ను సూడ్డంతోనే ఒక్కమారు యింట్లోంచి పీనుగెళ్ళిపోయినట్టు ఏడుపందుకున్నారండి. మా యాడదాని సంగతి సెప్పక్కర్లేదండి. ఎక్కెక్కి ఏడుపే. అజ్జూసి నాను నోట మాట రాక గడ్డ కట్టుకుపోనానండి. సెట్టంత మనిసిని. ఎదరగా అవుపడుతుంటే ఆ యేడుపులేటో అర్థం గాలేదండి. ఇంట్లో ఎవురేనా పోయినారేమో అనుకుంటే – అందరూ అంతో యింతో కొనూపిరితో వున్నారే గాని, శాల్తీలు గల్లంతైన దాకలాలు అవుపళ్లేదండి. ఆ ఏడుపులికి సుట్టుపక్కలోళ్లు వొచ్చేసినారండి.

నాను నోరిప్పి "ఏటైందర్రా " అన్నానండి. కాసేపయ్యాక మా అయ్య నోరు తెరిసేడండి. ముసిలోడు సెప్పిన మాటిన్నాక ఆ తర్వాత సంగత్తెల్సి నీరుగారిపోనానండి. నాకు పనిప్పించింది పందోండి పాలెం నాయ్డు అని సెప్పినానుగదండీ. ఆయనదోరా నేను పంపిన వోర్త యీళ్లకందలేదండి. ఆ బాబుకు ఎయ్యి పన్లు. లచ్చ యేపకాలు. కోటిన్నర రాజకీయాలు. మర్సేపోండో మరేటయిందో గాని నా గురించి సెప్పడమే కుదర్లేదాయనకి. నానెళ్ళిన కాడ్నుంచీ నా ఉనికే తెలీక బెంగెట్టేసుకున్నారీళ్ళు. నన్ను జూస్సర్కి సచ్చినోడు బతికొచ్చినట్టనిపించి దీళ్ళకు.

ఆ రాతిరి మా యాడది ఒకటే ఏడుపండి.

"ఏటే పిచ్చి మొగమా అలగైపోతావ్. నాకక్కడ పని దొరికింది నేయే" అన్నాను.

"ఏం పనీ? నానూ నీతోనే ఒచ్చేత్తా" నందది.

"ఒద్దులేయే. మరో నెల కాయి. ఈలోగా మా కాంట్రాక్టరుబాబు గోరు కడతన్న బిల్డింగు పూర్తవుద్ది. సిమ్మాద్రప్పన్న దయుంటే, నా మీదాయునికి గురి కుదిర్తే గనక వోచ్మేను పనే వస్తాది. అప్పుడు మనకాపరం పట్నంల ఆ బిల్డింగ్ కాడే!" అన్నాను -

ఆ మాటకి దాని కళ్ళల్లో దీపాలే ఎలిగేయి.

నాననుకున్నట్టే బిల్డింగ్ పూర్తయినాక నన్ను నైటోచ్ మెన్ చేసేసేరు బాబుగోరు "నీ పెళ్ళాన్ని తెచ్చేసుకుని ఎనకనున్న వోచ్ మెన్ షెడ్ లో వుండరా!" అన్నారండి.

అంతే! సంకురాత్తిరెళ్లేక మా యాడదాన్ని తీసుకొచ్చేసినాను.

కష్టపడ్డం సేతనైనోడికీ, నిజాయితీగా వున్నోడికీ రోజులింకా వున్నాయనిపించింది. రేపు కొత్తామాశకి నానొచ్చి ఏడాదైపోతంది. నైటోచ్ మెన్ పని చేసుకుంటూ పని దొరికిన్నాడు పగటిపూట రోజుకూలికి పోతాను. ఆ సులువు ఆ బాబుగారే సెప్పేరు. మా యాడది అపార్ట్మెంట్లో పాచిపన్లు చేసి ఎంతో కొంత సంపాదిస్తాది. అలా బగమంతుడి దయ వల్ల హాయిగా వున్నాంరా అనుకుంటూంటే యిప్పుడీ సమస్యొకటి తెచ్చి పీకల మీద కత్తిలా వుంచేడు సిలకన్న. అసలు ఏ పనైనా మనం సేయగలమంటేనే దైర్యంగ ఒప్పుకోవాల. లేదా ఒగ్గేయాల. అటూ యిటూ కాకుండా మద్దెన పడకూడదని నాకు తెలుసును. అయినా మద్దెన పడ్డాను.

ఇంతకీ ఏటైనాదంటే...

ఆ దినం నాను పన్లోకెళ్ళి ఒచ్చీసర్కి రాజబాబుగోరు నన్ను రమ్మన్నారని మా యాడది సెప్పిందండి. రాజబాబుగోరు మా బిల్డింగ్ కి నాలుగిళ్లవతల వుంటారు. ఆరింట్లోనూ మాయాడదే పన్జేస్తాది లెండి! నానక్కడ పన్లో కుదురుకున్న కాడ్నించీ తెల్సు నాయన్ను. కష్టం, సుకం తెల్సిన మనిషి. మంచితనం, మాటసాయం ఉందాయనకాడ. అంచేత తానం చేసిన ఎంటనే ఎళ్లేనండి. నానెళ్లేసర్కి ఆ బాబు వీజీ సేర్లో కూకోని సిగరెట్ కాలుస్తా గాల్లోకి మేగాలు వొదుల్తున్నారండి.

నన్ను జూసి, కూసోమని జెప్పి 'నీతో ఓ పని పడిందిరా' అన్నారండి.

నాను కూసోని, 'ఏవండీ' అన్నానండి.

ఆ బాబు కుటుమంతో సహా కేంపెళ్లే పని పడిందంటండీ. ఇంటికి తాళాలేసుకుమరీ ఎల్లాలంట. రాత్రుళ్లు యింటి గుమ్మంలో పడుకుందుకు మనిసి గావాలంటండీ.

“నాను బిల్డింగ్ కాడ వుండక తప్పదు బాబు.. నైటోచ్ మెన్ ని గదా" అన్నానండి.

“అందుకే ఇంకెవర్నయినా సూడమంటున్నా" అన్నారండి.

“అలాగే లెండి. ఎవురేనా వుంటే కనుక్కు జెబుతా” అన్నాన్నేను.

“అలాగే అనేసి ఎవుడ్నో తలకి మాసినోడ్ని పట్టుకొచ్చావు గనక... ఆడూ మంచోడూ... నమ్మకస్తుడు అయ్యుండాలి నీలాగ!" అన్నారండి.

“మీకెందుకూ మంచోడ్నే వొట్టుకొస్తా లెండి” అన్నాను.

సరిగా అప్పుడే నాకు సిగడాం నించొచ్చిన ముసిలోడు సిలకన్న నా మనసులో కదిలేడండి. అయితే ఆడ్ని వాకబు చేసినాకే బాబుగోరితో చెబుదారనుకొని పల్లక వొల్లకుండిపోయి వచ్చీసినా నండి.

నా నింటికొచ్చీసరికి సరిగ్గా గేటు కాడే ఎదురైనాడండీ ఆ ముసిలోడు. నెల్లాళ్ళకితం సిగడాం నుండి పారొచ్చినాడని సెప్పేను గదండీ. అందంబట బతుకు తెరువు కోసం సెయ్యిడానికి పనుల్లేవండి. తిని తొంగోడానికి కుదర్లేదండి. దానికి తోడు ముసిలోడికి రెండలవాట్లండి. సీకటడితే కడుపులో సుక్క పడాల. నోటికి సుట్ట కావాల. అంచేత కొడుకు తగిలేస్తే కూతురికాడికి పారొచ్చినాడు. అయితే కూతురేటైనా లచ్చనంగా కాపురం జేసుకుంటోందా యీడు తిని లంకాకు చుట్ట దట్టించనానికి? దాని మొగాడికి స్థిరం లేదు. పైసా సేతులడితే తాగేస్తాడు. అంచేత యీ ముసిలోడు నా వెనక పడ్డాడు, పనో పనో అని.

“ఏట్రాముసిలోడా ఏటి సంగతి" అన్నానండి ముసిలోడ్ని చూసి.

“ఏటి సెప్పమంటావ్. యియ్యాల అల్లుడొచ్చాడు" అన్నాడండి.

అల్లుడొస్తే డబ్బు డబ్బు అంటాడు. ఈడి దగ్గర దాచుకున్న పైసా, పిప్పీ ఒట్టుకెళ్లిపోతాడు. పనేదైనా దొరికితేనే యీడికాడ డబ్బుండేది. ఈడ్ని తీసుకెళ్లి ఆ రాజబాబు గారికి అప్పజెప్తేనో... అన్పించింది. ముసిలోడు మంచోడిలాగే అవుపిస్తాడు. కానీ పనిగండముంది. రోజుకూలీ కెళ్తే నడుం సాలొస్తోందని ఆ సెట్టు

నీడన యీ సెట్టు నీడన గడిపేస్తాడంట. అయితే యిక్కడ పనేటీ వుండదు. తిని తొంగోడమే. అయినా బేగి ఏ నిర్నయం తీస్కోకూడదు. ఇది పెద్దాళ్ల కాడ పని. అంచేత, అప్పటి కొల్ల కుండిపోయి,

“రేపోమారు కన్పించరా ముసిలోడా" అన్జెప్పి లోపలి కెళ్ళిపోయాను.

ఆ రాతిరి నిమ్మళంగా ఆలోసించేను. పర్లేదు. ముసిలోడు మంచోడే అన్పించింది. ఈ మాయదారి రోజుల్లో ఎవుర్నెవురూ నమ్మడానికి లేదు. అయినా మనిసిని మనిషి నమ్మకపోతెలా? లేనోడిని లేనోడే ఆదుకోక పోతే ఎలా?

మరుసటి రోజు నానింటికి రాబోసరికి గుమ్మంలో కూకొని వున్నాడు ముసిలోడు. ఏట్టైతే అయింది పీక పిసికేద్దారన్నంత కోప్మొచ్చింది. పనో పనో అంటూ ఆడిగోలే ఆడిదిగాని యివతలోళ్ళకి ఏరే పన్లుండవా అన్పిచ్చింది. సర్లే. ముసిలోడు. సంపేస్తే సస్తాడు.. ఎందుకులే అనుకొని నానే తగ్గి, సేద దీరేక..

“ఏట్రా ఏటి సంగతి?" అన్నాను ఏటెరగని వోడిలా.

“ఇయ్యాల రమ్మన్నావ్ గదా!" అన్నాడు వాడు.

“నాటకంలో లచ్చెత్రకుడిలా ఉన్నావురా నాయనా!" అని పైకే అన్నాను.

ముసిలోడు పాపం నవ్వి వూరుకున్నాడు.

ఆడికి యిసయం జెప్పి, పెద్దవాళ్ళతో పనిసుమా. జాగర్త గుండాలి!” అన్నాను.

“నైటోచ్ మెన్ పనా” అన్నాడండి అంతా విని -

“నువ్వేటి... బేట్రీనైటూ, కర్రా ఒట్టుకుని రేతిరంతా నైటు జవాన్లా తిరగక్కర్లేదురా బాబూ. ఆళ్ల గుమ్మంలో తొంగుంటే సాలు!” అన్నానండి.

ఆడు సరేనని ఒప్పుకున్నాకే ఆ బాబు గోరి దగ్గరికి తీసుకెళ్ళినాను.

నా నీడిని సూపెట్టి సెప్పగానే, “నీ పేరేట్రా" అనడిగేరండి బాబుగోరు యీణ్ణి.

“సిలకన్నండీ" అన్నాడండి ముసిలోడు.

“అదేం పేరు. సిలకల యాపారంగాని సేస్తావేటి. మావూళ్ళో చిలకపేటని ఓ పేటే ఉండేదిలే!" అని చిర్నవ్వు నవ్వేరండి.

ముసిలోడూ తలొంచుకుని నవ్వి వూరుకున్నాడండి.

“అప్పల్నాయుడు నీకు సంగతంతా చెప్పేడు గదా!" అని అడిగేరండి బాబుగోరు ఆడ్ని.

“దేని గురిచ్చి?" అన్నాడండి ముసిలోడు ఏటెరగని వోడిలా.

ఆ బాబుగోరు నా ముకం కేసి చూసేరండి. నేనాడికేసి సూసేనంతే. ముసిలోడు మాతరం నాకేసి సూడకుండా ఎటో సూస్తున్నాడండి.

“బాబుగోరు కేంపెల్తారనీ. నువ్వు రేతిర్లు యిక్కడ పడుకోవాలనీ సెప్పేనుగదరా” అన్నానండి ఆడితో.

“సెప్పేవులే" అన్నాడండి ఆడు. నా కోపం నసాళాని కంటేసిందండి.

“మరి వుంటావో వుండవో బాబుగారితో సెప్పు!” అన్నానండి.

"ఉంటాననేగదా ఒచ్చినాను!" అన్నాడండి తలెత్తకుండానే.

"మరా సంగతి బాబుగోరు అడుగుతున్నారు!" అన్నాను.

"ఎంతిత్తారో ఏటో బాబుగోరు సెప్పాలి గదా!" అన్నాడండి.

ముసిలోడు అంచనా కందని మనిసని నా కప్పుడుగాని తెలీలేదండి. అమాయకంగా అవుపిస్తాడు గానండీ పనికాడ ఎంత దొంగో.. డబ్బు కాడ అంత గెట్టోడు అన్పించింది.

"చూడు చిలకన్నా అప్పల్నాయుడు నీకేం చెప్పేడోగాని, నేనిప్పుడు నీకు బోధపడేలా చెబుతా విను. మేం వారం రోజులు కేంపు కెళ్తున్నాం. రాత్రులు వరండాలో దీపం వెలిగించి నువ్వు పడుకుంటే చాలు. ప్రహారీ గేటు తాళాలు నీకిస్తాను. పొద్దున్నే తాళం వేసుకుని నువ్వు నీ పన్లోకి వెళ్ళిపోవచ్చు. ఈ పనికి నీకేం కావాలో అడుగు!" అన్నారు బాబుగోరు.

"నానేటడుగుతానండి. పెద్దాళ్ళు మీకు తెల్టేటి. మీరే ఏదోటి సెప్పండి!" అన్నాడు ముసిలోడు.

"సరే అయితే నేనే చెబుతాను. మా కేంపు వారంగాని పది రోజులుగాని ఉంటుంది. అంతకు మించి వుండదు. సాయంకాలం దీపాల వేళ వచ్చి వీధిలో లైటు వెలిగించి ఆ తర్వాతెప్పుడో నీ భోజనం అయ్యాక వచ్చి పడుకుంటే చాలు. రాత్రులు గేటు లోపలికి తాళం వేసి, నువ్వు ఉదయం బయటకెళ్ళేప్పుడు బైట వేసి తాళం చెవులు నీదగ్గరుంచుకో. అయిదొందలిస్తాను" అన్నారండి బాబుగారు -

ముసిలోడు ఓ పెద్ద నవ్వు నవ్వి నాకేసి సూసేడండి. ఆ తర్వాత యిలా అన్నాడండి.

"మాట సెప్పాలంటే... మా అల్లుడు ఊళ్ళో లేడండి. మా పాపకాడ తోడు నేనున్నా. సంటి బిడ్డ తల్లది. దాన్ని ఒంటరిగా ఒగ్గేసి రావాల. అదీ కాకపోయినా రోజు రెండు సుట్లు రావాల. దీపాలెలిగించడానికి ఓ సుట్టూ, తొంగోడానికి ఓ సుట్టూ. మాపాప పాక అసలే దూరమండి. పెద్దోణ్ణి. తిండి తినీగానే నడిసి రావాలంటే కష్టమే.. అయినా ఎలాగో వస్తానండి. ఒప్పుకున్నాక తప్పదు గదండీ!"

ముసిలోడు యిసయాన్ని డొంక దారట్టించేసత్తన్నాడని అర్థమైందండి. అల్లుడోడు తరిమేస్తే వారం రోజులుగా యీడు ఏరే చోట వొండుకు తింటున్నాడు. ఆ సంగతి కప్పెట్టి యిలా సెప్తున్నాడు.

"అయితే ఏటంటావురా? రాకుండా యింటికి కావలాగా ఎలాతొంగుందామనుకున్నావ్. బాబుగారిస్తానన్న దానికి నువ్వేటంటావో అది సెప్పు!" అన్నానండి.

"అయిదొందలైతే కిట్టదు!" అన్నాడండి. అని, నాలుగడుగులు వీధి గేటు వేపు వేసి నిలబడ్డాడండి.

"ఎంతిస్తే నీకు కిడుతుందో చెప్పు?" అన్నారండి బాబుగారు.

"బజార్ల ధరలెలా పెరిగిపోయ్యాయో మీకు తెల్టేటి బాబూ... బియ్యం, నూని, కిర్సనూని దర్లు మాకేటి అందుబాట్లో వున్నాయా, మీరిచ్చే దానికేటొస్తాది? పిల్లలతో వున్నోళ్ళం మామూతినాలా" అన్నాడండి ముసిలోడు తెలివిగా,

"చూడూ నీకోసం, నీ లాంటి వారి కోసం దరలు తగ్గించేయడం నా సేతుల్లోలేదు. నేనిచ్చిందాంతోనే నువ్వు బతికేయాలన్నా కష్టమే. నువ్వు నాకు చేసే పనికి నేను యిస్తానన్నదది. నీకెంత కావాలో చెప్పు. రాత్రి

నువ్వు తిండి తిని నీ గుడిసెలో నువ్వు పడుకుంటే, యీ డబ్బు కూడా నీకెవరూ యివ్వరు గదా. అదీ ఆలోచించు!" అన్నారండి బాబుగోరు.

దానికి ముసిలోడు వెంటనే ఏం మాటాడనేదండి. ఒక్కడుగు గూడ ఎనక్కేయనేదు. అంచేత మళ్ళీ నానే కలగజేసుకున్నానండి.

"అయితే ఏటంటావురా. నువ్వేటి కష్టపడిపోవాలో చెప్మీ. నీ గుడిసె కాడ పడుకునేదే యిక్కడ పడుకుంటావ్. అంతే గదా!" అన్నానండి.

ముసిలోడు నా మాటకి జవాబియ్యకుండా బాబుగోరి ఒంకే తిరిగి అన్నాడు.

"సూడండి బాబూ! నేను నా గుడిసెలో తొంగున్నట్లు యిక్కడెలా తొంగుంటానండీ. రేతిర్లు పురుగొస్తది. పుట్రొస్తది. కుక్కొస్తది. దొంగొస్తడు. కాయాలి గదండి మరి. నానూ మనిసినే. దొంగాడంటే మరి నాకూ బయమే గదండీ. మరంచేత మీరూ సూడాల!" అన్నాడండి.

"అలగన్నావ్. బాగుంది. నీకు బయమైతే ఒద్దు. మరొకడ్ని చూసుకుంటా" అన్నారండి బాబుగోరు.

ఆ దెబ్బతో ఆడు కాస్త దిగొచ్చినాడండి.

"అవుసరమొచ్చినప్పుడు కాయకపోతే ఎలాగౌతాదండీ. ఎలాగో నానే తొంగుంటాను. మరి నాను రోజు కూలికిపోతే మూడొందలు యిస్తారు. ఏటి సేసినా సెయ్యకపోయినా యింత పెద్దిల్లు సూడాలి గదండీ. అంచేత ఆ కూలి డబ్బుల్లో సగమిచ్చేయండి!" అన్నాడండి.

ముసిలోడి మాటలకి నాకు మతి పోయిందండి. నిజం సెప్పాలంటే యీడిలాంటి ముసిలోడిని రోజు కూలికి ఎవుడూ తీస్కోడండి. గంట పన్దేస్తే, అరగంట కూకుంటానంటాడండి. పని దొరక్క నా సుట్టూ తిరుగుతూ వుంటే పోనీ కష్టపడక్కర్లేని పనే గదాని సెబితే, యీడి తంతు సూసేరు గదా!

"సర్లే నువ్వెళ్ళు. నీ కష్టానికది కిట్టనప్పుడు ఒద్దులే. నేను మరో మనిసిని చూసుకుంటాను!" అనేసేరండి బాబుగోరు.

ఆశపోతు ముసిలోడికి అంతే కావాలనిపించినా ఆడ్ని చూస్తే మళ్ళీ నాకే జాలేసింది. అల్లుడోడికి జడిసి అందంబట యిందంబట ఉంటన్నాడేమో తింటానికి లేక ఉండటానికి లేక పూట గడవక సస్తన్నాడు. నాలుగు డబ్బులు కళ్ళ జూసే మార్గం సూపిస్తే టెక్కు నీల్గుతున్నాడు.

"ఆ బాబుగారికేటి మనిసి దొరక్క నిన్ను నేను పిలిసేననుకున్నావేట్రా. మారుమాటాడకుండా ఒప్పుకో. కాకపోతే కష్టం సాలింది కాదు బాబు అంటే ఆయును గోరే, మొత్తం మీద మరో యాబై ఏసి ఇస్తారు వచ్చినంక!" అన్నాన్నేను, బాబుగోరు నా మాట కాదనరనే ఉద్దేశంతో.

"యాబై కాదు గానీ వందిచ్చి బాబూ, మీలాంటోళ్ళు కాకపోతే మాకెవురిస్తారూ!" అంటూ నాలుగడుగులు వేసి దగ్గరగా వచ్చేడు ముసిలోడు.

ఆడొప్పుకుంటాడని నాకు తెలుసు.

"ఏటి బాబూ, డబ్బే కన్పిస్తంది గాని... వొంద కాగితానికి బజార్ల ఏటొస్తాది సెప్పండి. రేసను కారుడ్డు కూడ లేక బైట కరీదులకి కొనుక్కోలేక సస్తన్నం!" అంటూ చతికిలబడ్డాడు ముసిలోడు.

"రేసను కార్డు ఎందుకులేదూ? అందరికీ యిస్తున్నరు గదా. దాని మీదే మీలాంటి వాళ్ళకు చవక బియ్యం, నూని, గేసూ, యిళ్ళూ... అన్నీ యిస్తున్నారు గదా... ఇంతకీ నీకు ఓటుందా?" అడిగేరు బాబుగోరు.

"ఉంది బాబూ.. మా వూళ్ళో!" అంటూ నవ్వుతూ నా వంక చూసేడు ముసిలోడు.

"మరి వోయిన్సారి ఓటెవరికేశావ్?" అడిగేరు బాబుగోరు.

ముసిలోడు నవ్వేసి, "మా కులపోళ్ళంతా ఎవరికేయమంటే ఆరికే ఏస్తాం బాబూ, ఎప్పుడూ అదే జరుగుద్ది!" అన్నాడు.

"కదా. అంచేత, నీ రేసను కార్డు గురించీ, గుడిసె గురించీ, గేస్ స్టవ్ గురించీ, వాళ్ళనే అడుగు. ఆ ఓటేయించుకుని గెల్చిన బాబు కన్పిస్తే కాలరట్టుకుని మరీ అడుగు. నాతో చెబితే నేనేం చేస్తాను!" అన్నారండి బాబుగోరు.

"రెండు సారా సీసాలకీ, వంద రూపాయలకీ ఓటమ్మీసుకున్నోళ్లు ఏటడుగుతారండి బాబూ. దాని కది సెల్లు... ఈడిలాగే మిగులు!" అన్నానండి నేను.

ముసిలోడు తల దించేసుకున్నాడండి.

"ఎలక్షన్ల ఎవరు గెల్పేరో తెల్దుగానీ బాబూ, యీడికి మందు మాత్రం బాగా అలవాటై పోయిందండి. సెప్పేను గదండీ.. పొద్దుగూకితే సుక్క పడాల!" అన్నాన్నేను నవ్వుతూ.

బాబుగారేం మాట్లాడలేదు.

"సరే. నువ్వడిగిందే యిస్తాను. అయితే అప్పుజెప్పిన పన్లో తేడా పాడా వచ్చిందా వూర్కోను. అందుకు అప్పల్నాయుడే సాక్ష్యం. ఇల్లంతా జాగ్రత్తగా చూసుకో. చీకటి పడేవేళ వచ్చి గుమ్మంలో లైటు వెయ్యాలి. ఏ రోజు లైటు వెలగలేదని తెల్సినా వూర్కోను. గేటుకి తాళం నేను చెప్పినట్టు వెయ్యాలి. కొత్త వాళ్ళ నెవర్నీ లోపలికి నీతో తీసుకుని రాకూడదు. మన పన్లో తేడా వొస్తే ఏంచేస్తానో నాకే తెలీదు!" అన్నారండి బాబుగారు.

"ఇంటన్నావుర ముసిలోడా, అందుకు నీకు సమ్మతమేనా?" అన్నానండి.

సమ్మతమే అన్నట్లు తలూపి, "ఒప్పుకున్నాక సూడనేటి!" అన్నాడండి.

అలా ఒప్పందం కుదిరిపోయిందండి. ఆ రోజే వంద రూపాయలు అడ్మాన్సు కూడా తీసుకున్నాడండి ముసిలోడు.

రెండ్రోజుల తర్వాత బాబుగోరు వూరెళ్లే నాడు నన్ను పిల్సి, పది రోజుల్లో వొచ్చేస్తామనీ, కాస్త యీ ముసిలోడిని ఓ కంట చూస్తుండమనీ జాగ్రత్తలు చెప్పేరండీ. బాబుగోరు మంచారని చెప్పేను గదండీ. గతంలో రెండుమార్లు మాట సాయం కూడా జేసేరు. అంచేత "మీరెళ్లి రండి బాబూ. నేనున్నాగా" అంటూ బరోసా యిచ్చిసేను. అయితే అదే నన్నిపుడు ఇరకాటంలో పెట్టేసినాదండీ.

తెల్లారితే ఆదోరం. రాజబాబుగోరు వుదయాన్నే వూర్నించి వస్తారనగా, ముందురోజు రాతిరి టయాం పదిన్నర దాటుతుందేమోనండి. ఆమాశ రాత్రి సీకటి సిక్కగా వున్న ఆ రాత్రేళ యీ ముసిలోడు నా కాడికి లగెత్తుకొచ్చి, నిద్దట్లో వున్న నన్ను లేపీసి నాడండి. అప్పుడాడి ఓటం చూస్తే దొంగతనం చేస్సి దొంగ సొమ్ముతో సహా దొరికిపోయిన వాళ్లా వున్నాడండి. అసలే కలరు కారునలుపేమో నాల్రోజుల కాణ్ణించీ తిండిలేని కాకిలా నీర్సంగా వున్నాడండి. వచ్చీ రాడంతో నా రొండు చేతులూ పట్టేసుకొని కళ్ళ నీళ్ళు ఎట్టేసుకున్నాడండి. నోట మాట రాక మనిసి వొణికి పోతున్నాడండి.

"ఏట్రా. ముసిలోడా ఏటైందిరా?" అన్నానండి.

అంతే, ఆడు వొణికే గొంతుతో సెప్పడం మొదలెట్టేడండి. ఆడు సెప్పింది యిన్నాక నాకూ ఏటి సెయ్యాలో తోసలేదండి.

అసలు సంగతేటంటేనండీ.. రోజు నాగే యీడు తొమ్మిదవకుండానే తిండి తినొచ్చి, గేటు తాళం లోపల ఏస్సి నైటు తీస్సి వొరండాలో తొంగున్నాడటండీ. రాతిరి రోడ్డంట తిరిగే సెకురిటీవోడు ఈలేసుకుంటూ, ఆడు ఆడి డూటీకి దిగేడండి. అడూ యిలా యీది సివరకెల్లేడో లేదో, యీ ముసిలోడికి ఎందుకు పుట్టిందో గాని బుద్ధి... ఆ బాబుగారెటూ రేపు తెల్లారే వస్తారు గదా, యిల్లంతా సుట్టూ ఓమారు సెకింగ్ సేద్దారని, యింటి సుట్టూ ఓమారు పెదచ్చినం చేసొచ్చి బాగుందో లేదోనని ముందల గుమ్మానికేసున్న తాళం కప్పనినాగి సూసేడండి. అంతే.. లటుక్కున ఆ తాళం కప్ప యీడి సేతికి వూడొచ్చీసినాదండి. ముసలోడికి ముచ్చెవట్లు పోస్సినాయండి. ఆడికే నేటండి ఆ టయాంకి అక్కడ నానున్నా ఎవురున్నా ఆళ్ళకి సెఁవట్లు తప్పవండి.

నానిప్పుడు ముసిలోడు ఏటి సెప్పేడో... ఏటి జరిగిందని సెప్పేడో అదే సెప్తున్నానండి. ఆడు సెప్పింది యిన్నాక నాకూ కాళ్లు సేతులాడలేదండి. ఆ బాబుగోరు కేంపెళ్ళడమేటీ...... నానీ ముసిలోణ్ణి... పేదోడు గదాని నాలుగు డబ్బుల కోసం యీణ్ని ఒప్పజెప్పి మద్దెనపడ్డమేటీ... యీడీ కప్ప తాళం నాగి సూడ్డమేటీ... అది యీడి సేతికి వూడిరాడవేటి.. అంతానా కర్మ కొచ్చిందనుకున్నానండి. అయితే మాత్తరం ఏటి సేత్తామండి. ఏదో ఓటి సెయ్యాలిగదండీ. ఎవరికి సెప్పాలన్నా.. నలుగురికీ తెలిసీసి మరింత పెమాదమై పోద్దని బయపడిపోనామండి. అంచేత నాకాడ సెపరేటుగ వున్న మరో తాళం కప్ప తీస్కెళ్ళి, ఆ తలుపుకేసి, ముసిలోడ్ని ఆ తలుపు కడ్డంగా తొంగోమన్నానండి. నిజం సెప్తున్నానండీ.. ముసిలోడు బెంగెట్టేసుకున్నాడండి. ఆ బాబొచ్చి ఏ పోలీసు రుపోర్టో యిత్తే, నా గతేం కానూ అని ఏడ్చీసి నాడండి. నానే ఎలాగో సముదాయించి వూర్కో పెట్టినానండి.

తెల్లారి రాజబాబుగోరు యింటి ముందు కారు దిగేసర్కి నానూ అక్కడి కొచ్చినానండీ. గేటు తీసి లోపలికి అడుగు పెట్టారో లేదో ముసిలాడు సేసిన నిర్వాకం నింపాదిగా సెప్పినానండి. నేనామాట సెప్తున్నప్పటికి ముసిలోడు కార్లో వున్న సామాను దించి గుమ్మంలో పెట్టి, సపోటా సెట్టు సాటు కెళ్లి తలొంచుకు నిలబడ్డాడండి.

బాబుగారోమారు ముసిలోడి కేసి చూసి రమ్మని సేత్తో పిలిసి, ఆడొచ్చి కాసంత దూరంలో నిడబడినాక అడిగేరండి.. "లోపల ఏటేటి సూసినావురా ముసిలాడా?" అని.

"ఆ భగవంతుడి మీద సత్తె పెమాణం బాబూ! నాను అడుగు లోపలికెయ్యలేదయ్యా" అంటూ కళ్ల నీళ్లెట్టుకున్నాడండి.

"సరే, నువ్వెళ్లు తర్వాతొచ్చి నీకు రావల్సిన డబ్బులు పట్టుకెళ్లు!" అన్నారండి.

"నన్ను నమ్మండి బాబయ్యా. నాను గుమ్మం దాటి అడుగు లోనికెయ్యలేదు. మీకు నమ్మకం కుదరకపోతే, ఆ డబ్బు నాకొద్దు!" అన్నాడండి ముసిలాడు.

ఆడిగొంతులో వొణుకుంది. ఆడి మనసులో ఆందోలనుంది, దుక్కముంది.

"సరే, చెప్పేవుగా, నువ్వెళ్లిరా!" అని ఆ బాబుగోరు సెప్పినా ఆడు కదల్లేదండి.

నేను నా తాళం చెవితో కప్పతాళం వూడదీసేసి, "ఎల్రా ముసిలోడా. బాబుగోరెల్లమంటన్నారుగా. తప్పు సెయ్యనోడివి నీకేటి బయం ఎల్లు!" అన్నానండి ముసిలోడికేసి చూసి.

ఆడు నెమ్మదిగా కదిలెల్లేక బాబుగోరితో అన్నానండి.

"ముసిలోడికి కాస్త డబ్బాశ ఎక్కువే గానీండి.. మంచోడండి. నమ్మకమైన వోడు. ఆడి కర్మకాలి అలా జరిగినాది గాని, అడికాడ దొంగబుద్ధి లేదండి!" అన్నానండి.

"తెల్సు నాయుడూ. అందుకే అతన్ని వెళ్లమన్నాను. నిజానికి ఆ తాళంకప్ప పనిచెయ్యదు, నొక్కితే వుంటుంది. లాగేస్తే వూడొస్తుంది. అందుకే పైన తలుపుకి గాడ్రెజ్ తాళం వేయించాను. ఇది వూరికినే మా చిన్నబ్బాయి వేశాడు!" అంటూ జేబులోంచి పెద్దగాడ్రేజ్ తాళం చెవి తీసి తలుపు తెరిచారాయన.

అప్పటికే ముసిలోడు రోడ్డు దాటేసేడు.

***0***

("రచన" మాస పత్రిక ప్రచురణ: పునఃప్రచురణ)

కథామంజరి జనవరి 2021

సంచిక విశిష్ట అతిథి



# వంటకం

## మెడికో శ్యామ్

కథ



డాక్టరుగా ఒకే కలంతో అటు వైద్యం, ఇటు కథను అందిస్తూ.. రెండిటి లక్ష్యం మనిషి మనుగడే కదా అని తలచి, తెలుగు సాహితీవనంలో ఎన్నో "శ్యామ్ యాన"లు నిర్మించిన కథకుడు, తెలుగు కథలకు నిఘంటువు శ్రీ చిత్రావూరి శ్యామ్ గారు. కలాన్ని పక్కన పెట్టి పదేళ్ళయినా.. కథామంజరి జన్మదిన సంచిక కోసం షడ్రుచులతో అందించిన కొత్త కథావంటకం "వంటకం!"



# వంటకం

## మెడికో శ్యామ్

"కథ కొత్తగా రాసి పంపండి" అన్నాడు ఒక సంపాదక మహాశయుడు శాయి. "వచ్చే సంచికలో వేసేద్దాం. రాబోయే కథా సంపుటిలో కలిపేద్దాం!" అన్నాడు. "టచ్ పోయింది. రాయలేను.. అలాంటివేమీ అనొద్దు" అని కూడా అన్నాడు

చిన్నాయన ఇచ్చిన సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం చేతకాక "రాస్తే మీకు ఇస్తాను!" అన్నాను. మళ్లీ ఇన్నాళ్ళకి, ఇన్నేళ్లకి మళ్లీ "కథ పంపు. జులై సంచికలో వేస్తాను!" అన్నాడు మరో మహాశయ సంపాదకుడు శర్మ. ఈ మారిన రోజుల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తూ "జులైలో నీ కథ వస్తుంది. రాయడం నీదే ఆలస్యం!" అన్నాడు.

"సరే" అని కుదురుకున్నాను. కుదురుగానే రాద్దామనుకున్నాను. కుదురుగా కాదు, ఏ విధంగానూ కుదరకపోయినా, 'కుర్చీల్లేవని కూర్చోవడం మానలేం' అన్నట్టు రాయడానికి ఉపక్రమించాను.

***

నా చిన్నతనంలో మా అమ్మ వంట చేస్తుంటే చూస్తూ ఉండేవాడ్ని. ముఖ్యంగా చలికాలంలో పొయ్యికి దగ్గరగా కూర్చుని, చేస్తున్న వంటని శ్రద్ధగా గమనించడం ఇష్టంగా వుండేది. ఆ రోజుల్లో గ్యాసు పొయ్యిలు, ఎలక్ట్రిక్ స్టవ్వులు లేవు. కనీసం మా ఇంట్లో ఉండేవి కావు. కిరోసిన్ స్టవ్వులు, బొగ్గుల కుంపట్లూ ఉండేవి. గిన్నెల్లో వంట ద్రవ్యాలు ఉంచి వాటిని ఈ బొగ్గుల కుంపటిపై పెట్టి ఉడికించేవారు. ఆ కుతకుత ఉడకడాలు, ఆ వంటకాల నుంచి వెలువడే సువాసనలు నేను ఉత్సాహంగా చూస్తూ, ఆస్వాదిస్తూ ఉండేవాణ్ణి. ఆ ఉత్సాహంలో ముందు ముందుకి జరిగి, పొయ్యికి మరీ దగ్గరగా చేరుతుంటే.. మా అమ్మ బిగ్గరగా అరుస్తూ ఉండేది.. 'కాస్త దూరంగా జరగమని.'

ఆవిడేం వండిన నాకు చూడ్డానికి బాగానే ఉండేది కానీ, కూరలు వండుతూ ఉంటే క్యూరియస్ గా ఉండేది. ముఖ్యంగా కాలీఫ్లవర్ కూర. ఈ కూరలో కాలీఫ్లవర్, బంగాళదుంపలు, టమోటాలు వాడతారు. కావలిస్తే కొంచెం ఉల్లిపాయలు, కొన్ని ఆకుపచ్చ బఠాణీలు వేసుకోవచ్చు. ముందర ఆ కాలీఫ్లవర్ని చిన్న చిన్న ముక్కలుగా తరిగేది. జాగ్రత్తగా చూడాలి. మధ్యలో బద్ధకంగా బజ్జున్న పురుగులు ఉండొచ్చు. ఆ తరిగిన, బాగా కడిగిన చిన్న చిన్న ముక్కల్ని.. క్రింద దిట్టంగా ఉన్న మూకుడ్లోనో, గిన్నెలోనో వేసుకోవాలి.

తర్వాత ఒకటో ఒకటిన్నరో బంగాళాదుంపల్ని ఎంచుకుని, వాటి తొక్కల్ని తీసి, తోచిన సైజులో ముక్కలుగా తరగాలి. మరీ చిన్నగా ఉండకూడదీ ముక్కలు. మరీ పెద్దగా ఉంటే సరిగా ఉడకకపోవచ్చు. ఆపై ఓ రెండు టమోటాలు చిన్న చిన్నవిగా తరగాలి. ఈ టమోటా ముక్కల్ని ఆ తరిగిన కాలీఫ్లవర్ బంగాళదుంపలతో కలిపేయాలి. కొద్దిగా నూనె, ఓ పిసరు పసుపు, తగినంత ఉప్పు, ఒకట్రెండు పచ్చి మిరపకాయ ముక్కలు, ఓ రెబ్బ కొత్తిమీర వేసి, పొయ్యి మీద పెట్టి, ఆ మూకుడు మీద, మూతకి బదులు మా అమ్మ మరో గిన్నె పెట్టేది. ఆ గిన్నెలో కొంచెం నీరు పోసేది. ఆ రోజుల్లో మా ఇంట్లో ప్రెషర్ కుక్కర్లు లేవు. సన్నని సెగ మీద ఉంచిన గిన్నెలోని కూరలు మెల్ల మెల్లగా ఉడుకుతూ ఉంటే, పైన ఉంచిన గిన్నెలో నీళ్లు కూడా వేడెక్కి... బహుశా ఆ కూరల్ని రెండు వైపుల నుంచి వండేవేమో. కూరల్లో ఉన్న నీరూ, కొద్దిగా వేసిన నూనె కలిసిన ఎమాల్గమ్... సాంప్రదాయతా, ఆధునికతా కలిసినట్టుగా కొత్త పాతల మేలుకలయికగా పనిచేసేదేమో!

కొత్తిమీర వేస్తున్నప్పుడల్లా.. లేక వేస్తుంటే చూస్తున్నప్పుడల్లా నాకొక విషయం గుర్తొస్తుంది.

మా ఫ్రెండ్ వాళ్ళావిడొకావిడ ఈ కూర చేస్తున్నప్పుడు (నిజానికి మా వాడే ఆవిడ చేత చేయించాడు) 'కొత్తిమీరెందుకు? నేను కర్వేపాకువేస్తానందిట!'

'కరివేపాకు కాదు దీంట్లో కొత్తిమీరే వేస్తారన్నా'డుట' మా వాడు.

'ఎందుకు?' అని ఆవిడ రెట్టిస్తే 'మా అమ్మ అలానే వేసేది!' అన్నాట్ట మావాడు.

'మీ అమ్మగారు కొత్తిమీర వేస్తే, నేనూ వెయ్యాలా? నేను కరివేపాకే వేస్తాన'న్నదిట ఆవిడ.

ఎందుకు కొత్తిమీర వెయ్యాలో, ఎందుకు కరివేపాకు ఈ కూరలో వేయకూడదో మావాడు చెప్పలేకపోయాట్ట. కన్వెన్షన్స్ లూ, సాంప్రదాయాలు, అలవాట్లు వాటి వెనకనున్న అసలు కారణాలు తెలిసి, తెలిపే పాండిత్యం అందరికీ ఉండదు కదా!?

ఆపై మూతగా పెట్టిన గిన్నెలో నీరు మెల్ల మెల్లగా వేడెక్కుతూ, బుడగలు పైకి వచ్చి పగిలిపోవడం చూడ్డం నాకు సరదాగా ఉండేది.

***

చిన్ననాటి చిత్రాలు కళ్ళ ముందు కనబడుతున్నాయి. ఆ ఉడుకుతున్న నీళ్లల్లో నానా రకాల బొమ్మలు కనబడసాగేయి. నే పెరిగిన తిరిగిన ఊర్లూ, ప్లేసులు వాటి ఊసులు తిరగసాగాయి. నా మనసు ఫ్రీజర్లో ఇన్నాళ్లు ఫ్రీజయిపోయిన నానా జీవిత దృశ్యాలు కథా సందర్భాలు కదలాడసాగేయి.

అవి నేను చదివిన కాలేజీలేనా?

అవి నే పనిచేసిన ప్రదేశాలేనా?

మనుషులు టపటపా రాలిపోతూ భయంతో ఎక్కడికి పోవాలో తెలియకుండా తడబడుతున్న వీళ్లు, నా వాళ్లేనా నేనెరిగిన వాళ్ళేనా?

భయం. విస్మయం. విభ్రాంతి. విహ్వలిత. మృత్యుఘోష. చావుకేక, చావునీడ.. నలుదిశలా. చావులోనూ దక్కని గౌరవం. ఇవ్వలేని అసహాయత! అదిగో ఆ మూల పంజాబీ బిర్జేష్ శర్మ బెంగాల్ నుంచి హిందీలో అరుస్తున్నాడు.

ఇవ్వు.. మాకివ్వు ఆక్సిజన్! బతకనివ్వు. తీసుకోనీ మమ్మల్ని ఊపిరి. ఎక్కడున్నాయి నీ మంచి రోజులు?

వద్దు.. నీవు ఇస్తున్నాయి మాకొద్దు!

మమ్ము మననివ్వు. మాట్లాడనివ్వు. ఇవ్వు మాకివ్వు ఆక్సిజన్!

ఇంకా అరుస్తున్నాడు. అదుగో ఆ పక్కనే దుష్యంత్ కుమార్. హిందీలో గజల్ కవి.

'బాధ పర్వతాల్ని మించిపోయింది. ఇక కరగాలి. ఈ హిమాలయం కరిగి గంగలా ప్రవహించాలి. నా గుండెలో కాకపోతే నీ గుండెలోనైనా మంటలు మండాలి!' అంటున్నాడు.

'ప్రతి వీధిలో ప్రతి ఊర్లో ప్రతి శవం కూడా చేతులు ఆడిస్తూ, గొంతుతో చెప్పాలి, చేతులు కాదు ఎత్తడం!' అతని కవితలు వినబడని ఉద్యమాలు ఉన్నాయా?

అదిగో 'సాకి' గానాలో సిద్ధహస్తుడు. మహా గాయకుడు ఆకాశమంత గొంతులో ఏమంటున్నాడు

"ప్యార్ కా దుష్ మన్ హోష్ మే ఆవో జాయేగయ బర్ బాద్"

అదుగో ఆ మూల ఓ మూలగా ఉన్నారు ఒక కన్న తల్లీ ..

అన్ని వైపులా అస్తవ్యస్తంగా భయంతో, భీతితో బితుకుతో అడ్డదిడ్డంగా పరుగులెడుతున్న జనవాహినిలో ఓదార్పు, ఊరడింపు కలిగించే, నమ్మకం పెంచే మాటలే, వ్యక్తులే, వ్యవస్థలే లేవా? లేరా?

ఇవి నా ఊహలా? భ్రమలా? నిజమా? కాదా?

***

సెల్ మోగింది.

చూసాను. కొత్త కథకుడు.

మాట్లాడాలనిపించలేదు. తియ్యలేదు. మోగనిచ్చాను.

ఏం మాట్లాడుతాడు?

"మీకో విషయం చెప్పాలి" అని మొదలు పెడతాడు. గాసిప్పు. ఒక్క సిప్పు కూడా చేసే ఓపిక లేదు. ఇక కప్పులకి కప్పులు ఏం తాగుతాడు?

ఇంతకీ అతనికి కొత్త కథకుడని పేరు ఎలా వచ్చింది?

ఎవరో అతని కొత్త కథకుడన్నారుట.

'నేను ఇరవై ఏళ్ల బట్టీ రాస్తున్నాను సార్. నన్ను కొత్త కథకుడంటారా?' అని కోపించాడు నా దగ్గర. 'దాందేముంది. మనం తీసుకోవడాన్ని బట్టి, అనుకోవడాన్ని బట్టీ వుంటుంది. నేను మీ కంటే ముందు

నుంచి రాస్తున్నాను. అయినా నన్ను కొత్త కథకుడంటే సంతోషిస్తాను. నిజానికి నన్ను నేనే అనుకుంటాను!' అన్నాను.

"కొత్త కథకుడు అంటే ఎప్పుడూ కొత్తగా రాసే వాడిని నా నిర్వచనం" అన్నాను.

అతనికి నచ్చినట్టు లేదు.

మొన్నటి మా సంభాషణ గుర్తొచ్చింది.

మొన్న ఫోన్ చేస్తూనే అతనే 'మీకొక విషయం చెప్పాలి కాకుండా, మిమ్మల్ని అడగాలి!' అన్నాడు.

"ఏమిటి? అడగండి" అన్నాను.

"రేపు కథ మీద ఒక డిస్కషన్ ఉంది.. జూమ్ లో. మీరు ఏవైనా చెప్పండి ఓ రెండు విషయాలు మంచివి. అవి రేపటి డిస్కషన్లో ఉపయోగిస్తాను!" అన్నాడు.

అతడెలాగూ నే చెప్పినవేవీ ఉపయోగించడని నాకు తెలుసు. అంచేత, "ఆ మధ్య ఇక్కడ జరిగిన ఒక సభలో నేను చెప్పేనుగా. మీరూ ఉన్నారు" అన్నాను.

"అవుననుకోండి. మళ్ళీ చెప్పండి" అన్నాడు.

సరే. ఇదే అదను. వచించెదను. కథలు సొదలున్న, అనుకుని.. "ఎక్కువ చదివి తక్కువ రాయాలని తెలీక, తక్కువ చదివి ఎక్కువ రాసేనన్నారు శర్మగారు.. పురాణం వారు!" అన్నాను.

"కథలు రాయడం ఉప్మా చేయడం వంటిదే. అంతా తిప్పడంలో వుంటుంది!"

"ఎడం చేత్తో రవ్వంత జీవితం మెల్లగా పోస్తూ, కుడిచేత్తో తిప్పడం చెయ్యాలి. సరిగ్గా తిప్పితే సరిగ్గా కుదుర్తుంది. తిప్పడం రావాలి. వస్తే మీరు చెయ్యి తిరిగిన రచయిత. వస్తువెప్పుడు జీవితం. మీ జీవితమో, నాదో మరొకరిదో లేక ప్రజా జీవితమో!"

"ఉప్మా ఉదాహరణే చెప్పాలా?" అన్నాడు.

"అక్కర్లేదు. ఏదయినా చెప్పొచ్చు అని పేదరాసి పెద్దమ్మ చెయ్యడానికేమీ లేక, ఒక రోజు ఆకుపచ్చ గడ్డితో పచ్చడి చేసి, రాజు గారికి అన్నంతో పెట్టిందట. ఆ రుచికి ఆయన చాలా ఆశ్చర్యపోయి .."

ఈలోపున కొత్త కథకుడు కొంటెగా అనుకుని "మీరెప్పుడైనా గడ్డి.. అదే గడ్డి పచ్చడి తిన్నారా?" అన్నాడు.

"లేదు. రచయితల బుద్ధి తరచుగా గడ్డి తింటుంది. కొన్నిసార్లు నా బుద్ధి కూడా. కానీ నేను మాత్రం గట్టి తినలేదు!" అన్నాను.

"కానీ కొత్తిమీరలో కాస్త చింతపండూ, పసుపు, ఉప్పు, మిర్చీ కలిపి నూరి చక్కటి రుచికరమైన పచ్చడి చేసేది మా అమ్మ. ఇక్కడ సరిగ్గా నూరడం రావాలి. ఆ కొత్తిమీర పచ్చడి మాత్రం తిన్నాను!" అన్నాను.

ఇక అతనేమీ అనకుండా.. నే చెప్పిందంతా వినసాగాడు.

"నిజానికి నిజంగా జరిగిందానికైనా కొంత కల్పన జోడించి, తడియ బెట్టి, దానిని తాళింపో, పోపో, తిరగమోతో వేసి, లేక ఏ పంజాబ్ తడకానో తగిలిస్తే చాలు!" అన్నాను.

"కథకీ, కథకుడికీ ఒక లక్ష్యం కావాలి.  అది గొప్ప లక్ష్యమయితే, అది గొప్ప కథ.  అతను గొప్ప కథకుడూ అవుతారు.  గొప్ప లక్ష్యం చాలా ప్రధానమని కారా మాస్టారి అభిప్రాయం. కారా కిళ్ళీ నమిలినంత నెమ్మదిగా, ఆయన మృదువుగా ఇదే పదే చెబుతారు. నోకులక్కరలేదని కూడా చెబుతారు!" అన్నాను.

"మరి శిల్పమో?" అన్నాడు కొ.క. (కొత్త కథకుడు)

"శిల్పానికేమిటి? ప్రతీ దానికీ ఏదో ఒక శిల్పముంటుంది.  ఆ కాళ్ళు తుడుచుకునే గుడ్డకి కూడా శిల్పముంటుంది!" అన్నారట కారా మాస్టారు.

'శిల్పమంటే కుటుంబరావుగారు అన్నది కూడా గుర్తుకొస్తోంది' అన్నాను.

"ఎందరు కథకులో అన్ని శిల్పాలు" అన్నారాయన.

"ఆ మధ్య ఒక ఉప 'పేతన శర్మ' ఆయన గురించి అన్నది కూడా గుర్తొస్తోంది."

"ఏమన్నాడు?" కొ. క.

"అనరానివీ, తిరిగి నేను అనలేని మాటలన్నాడు. తన సాహిత్యమూ, తన రచనలూ ఎవరికీ గుర్తుండక్కర లేదనీ, ఆ పరిస్థితులు మారి తననీ, తన రచనలనీ అందరూ మర్చిపోయినా ఫర్వాలేదనీ మహోన్నత అభిప్రాయం ఆయన వ్యక్తం చేసేడు.  ఆయన గొప్పవాడు కాబట్టి గొప్ప అభిప్రాయం. ఈయన గొప్పవాడు కాబట్టి ఈయనది గొప్ప లక్ష్యం" అన్నాను కొ. కు., కారా ల గురించి.

"మీ గురించి మీరేమంటారు?" అన్నాడు కొ. క.

"నా గురించి చెప్పే ముందర తనో కథ్కాననుకునే ఓ కుర్ర రచయిత అభిప్రాయం చెబుతాను" అన్నాను.

"అతగాడు దృష్టిలో కథారచన ఒక కంకాక్షను.  ఒక కాక్ టెయిల్.  అంతవరకూ నాకేమీ అభ్యంతరం లేదు. కానీ దాన్లోని దినుసుల్లోనే ఒక ఇబ్బంది ఉంది"

"ఏమిటది?" అన్నాడు కొ. క.

"భయమూ,  ఉద్వేగమూ, మోహామయమూనట."

"అంటే ఏమిటి?" అన్నాడు.

"అదే నాకూ తెలీదు.  పైగా అలవోకగా, అనాయాసంగా, సునాయాసంగా రాస్తే గొప్ప రచన రాదట.  ఎంతో అతలంతంగా, విపరీతంగా రచయిత కష్టపడి పోవాలట.  అప్పుడే ఒక గొప్ప కథ ఉద్భవిస్తుందట"

"అన్ని సంస్థలూ, వ్యవస్థల్లానే పత్రికల, సంపాదకుల స్థాయి కూడా విపరీతంగా పడిపోయింది. ఈ మేధావి రచయితలే సంపాదక వర్గాల్లో చేరడం వలన.  వీళ్ళకి ఎంత సేపూ పాఠకుడిగారికి ఏదీ అర్థం కాదనే ఉద్దేశ్యంతో కథల స్థాయిని దిగజారుస్తూ,  ఏమాత్రం విడిగా, విశిష్టంగా, విభిన్నంగా ఉన్నా తీసి పారేస్తారు. ఇతర భాషలలో కథలు మన వాటి కంటే మెరుగ్గా  ఉన్నాయంటే గింజుకుంటారు.  పళ్లు కొరుక్కుంటారు."

చెలంగారన్నట్లు.. ఒక రచయితను మరో రచయిత రచనలెప్పుడూ సరిగ్గా విశ్లేషించడమో, విమర్శించడమో చెయ్యనేలేడు.  ఆయన చాలా మర్యాదస్తుడు కాబట్టి అలాంటి పనికి తాను అనర్హుడననీ, పూనుకోకూడదనీ అన్నాడు.

చెలంగారీవాళ వుంటే సెక్స్ లో ఎక్ష్ కర్థం తీస్తూ కలం పట్టేవాడే కాదు. చెలం కలం విశృంఖలం కనక శృంఖలాలన్నీ తన కత్తిలాంటి కలంతో ఖండిస్తూ, సరియైన స్వేచ్ఛ కోసం ప్రయత్నిస్తున్న యువకులనీ, యువతులనీ భుజం తడుతూ వాళ్లతో నడిచేవాడు.
అతి భావుకతలనీ, ఫాంటసీలనీ పెంపొందించే కథలూ, సొదలూ రాయడం, ప్రేయసి మెల్లకన్ను మీద పద్యాలు రాయడం కన్నా హేయమైనదిగా భావించేవాడేమో! కనీసం నేను అలా అనుకుంటున్నాను.
"ఇంతకీ మీరు అసలు విషయం దాటిస్తున్నారు!" అన్నాడు కొ. క.
"లేదు వస్తున్నాను. 'నా నివాసమ్ము తొలుత గంధర్వలోక మధుర సుషుమా సుధాగాన మందవాటి' అన్నారు కృష్ణశాస్త్రి గారు. నేను మరీ అంత కాకపోయినా, ఆశయాల్లో ఆకాశం వైపే ఉన్నాను. చిన్న మెత్తు రాయడం కూడ రాయలేక రాయలేక రాస్తున్నాను. ఆ లక్ష్య దిశ, ఈ కష్ట దశ కలిపి నా గురించి మీరే అభిప్రాయాన్ని వెలిబుచ్చండి!" అన్నాను.
అతడేం మాట్లాడలేదు.

***

ఆ పై మూతగా పెట్టిన గిన్నెలో నీళ్ళు కుతకుతా ఉడుకుతూ ..
అలా ఆవిడ (మా అమ్మ)వండిన కూర అమృతంలాగా ఉండేది. నేనైతే అలాగే ఆ కూరంతా వొట్టినే తినేయగలను. కని రొట్టెతో గాని, అన్నంలో కలుపుకొని గాని తింటారు.
ఆ చిన్ననాటి జ్ఞాపకాలింకా చెరిగిపోలేదు. చెదిరిపోలేదు. స్పష్టంగా కళ్ళ ముందు కదుల్తూనే వున్నాయి.
ఆ మధ్య ఒకసారి ఈ అమెరికాలో ఆ కూర వండుదాం అనుకున్నాను.
ముందు అన్నం అత్తెసరు పెట్టేద్దామనుకున్నాను.
అరధర హాసం మెరిసినట్టుంది.
ఎలెక్ట్రిక్ కుక్కర్లో బియ్యంపై బొటాబొటిగా నీళ్ళు పోసి పెట్టాను.
కూర వండడం అంత సులభం కాలేదు. అనుకోని అవాంతరాలొచ్చాయి. ఏవేవి ఎలా కలాపాలో తెలియేలేదు. ఇక్కడి కూరల సైజులు కొంత కన్ఫ్యూజన్ను కలిగించాయి. ఇక్కడి టోమెటోలు చూడ్డానికి ఎర్రగా, బుర్రగా వున్నా కావలసిన పుల్లదనం వాట్లో లేదు. మా అమ్మ ఉప్పు, పసుపూ ఉజ్జాయింపుగా వేసినా సరిగానే కుదిరేది మరి. ఇప్పుడేది ఎంత వేయాలో తెలీలేదు. ఈ ఎలక్ట్రిక్ స్టవ్వులు వడివడిగా మాడ్చేస్తున్నాయి గాని, నిప్పు సెగలా.. నెమ్మదిగా కూరలని సరిగా వుడికించేవిగా నాకన్పించలేదు.
ఒక్కసారి మెరుపు మెరిసింది. తట్టింది ఒక సౌలభ్యం. ఒక సౌకర్యం.
ఇక్కడ ఈ దేశంలో అన్ని కూరలూ ముక్కలుగా కోసి డీప్ బాగుల్లో వేసి అమ్ముతారు. (ఇప్పుడన్ని చోట్ల అంతేనేమో. నాకు తెలీదు). కాలీప్లవరూ, టమోటాలూ, ఉల్లిపాయలూ ముక్కలు దొరికాయి. ఆకుపచ్చని బఠానీలకి సమస్యే లేదు. పుల్లదనం కోసం కొంత టొమాటో పేస్ట్ కలిపేను. బంగాళా దుంపలు మాత్రం సొంతంగా తొక్క తీసి కోసేను.

కొంత ప్రయత్నం మీద సరియైన నిష్పత్తినీ, ఉష్ణాన్నీ సాధించేను.

కష్టపడి సంపాదించిన కొత్తిమీర రెబ్బలు వేసేను నవ్వుకుంటూ.

గతకాలపు అలవాటు కొద్దీ, పై మూతకి బదులు గిన్నె, గిన్నెలో నీళ్ళూ ఉంచాను.

నీళ్ళలో నాకీసారి ఏ ఇమేజెస్ కనబడలేదు. ఏ గోలా వినబడలేదు.

మొత్తానికి వంటకాన్ని పూర్తి చేసేను.

మా అమ్మ చేసినంత బాగానూ వచ్చింది. అంత రుచికరంగానూ అన్పించింది నాకు.

అద్భుతంగా వుంది. టెంపోరావ్ భాషలో అఖండంగా వుంది.

మరి ఎలా కుదిరింది పాపం?

ఆ పైమూత గిన్నెలోని మనసుని కల్లోల పెట్టే దృశ్యాలూ శబ్దాలూ ఎటు పోయాయి? ఎలా పోయాయి?

అదృశ్య ధారలలో అమృతం కురిసిందా?

తల్లి ఒడిలో తప్ప వేరెక్కడా దొరకని అనునయం, బుజ్జగింపు, వెచ్చదనం ఎలా దక్కేయి?

***

రచన పచన

వచన రచన

కైత రాతలేవైనా ..

కలిగించగలగాలి

కసింత ఊరడింపు ఒకింత నమ్మకం

చిలికించాలి

చిటికెడు కరుణ

గుప్పెడు ఆదరణ

విహరింప చేయాలి

కొన్ని క్షణాలైనా ఉన్నత ఉదాత్త వీధులలో

***

"రుచీ పచీ ఎలా వుందో తెలీదు గాని, శుచిగానే వండి వార్చాను!" అన్నాను.

"సరే. వడ్డించేస్తాను!" అన్నాడు మహాశయ సంపాదకుడు శర్మ.

***0***




కథామంజరి ఫిబ్రవరి 2021 సంచిక

విశిష్ట అతిథి


# మారాజులొచ్చారు

## వసుంధర

కథ



ఆరు దశాబ్దాల కథా ప్రవాహాలు, అపార జ్ఞాన సంపద.. వీటికి మించి, మంచి స్నేహ సంపద, ఉన్నత భావాలతో తెలుగు సాహితీవనంలో చెట్టాపట్టాలు వేసుకుని నిత్యం సాహిత్య సౌరభాలతో విహరించే జంటపుష్పాలు శ్రీ శ్రీమతులు జొన్నలగడ్డ రాజగోపాలరావు, రామలక్ష్మి దంపతులు. కథామంజరి జన్మదిన సంచికలో అభిమానం జోడించి ప్రత్యేకంగా రచించి అందించిన కథ "మారాజులొచ్చారు...!"



# మారాజులొచ్చారు

## వసుంధర

"తిరుపతి వెంకన్న దర్శనం చేసుకో. అనుకున్నది జరుగుతుంది!" అన్నాడు వెంకన్నబాబా.

స్వార్థమున్న మనిషికి ప్రశాంతత కరువవడం సహజం. ఆ మనిషికి ప్రశాంతతనిచ్చేది కనిపించని దేవుళ్లు కాదు, కనిపించే బాబాలు. వాళ్లని నమ్మడానికి చదువు, విజ్ఞానం, సిద్ధాంతాలతో నిమిత్తం లేదు.

వెంకన్నబాబా తిరుపతి వెంకన్న భక్తుడు. వేదాంతి. భక్తిపరుడు. మంచిచెడ్డలు సూటిగా కాక సూచనప్రాయంగా చెబుతాడు. రాజకీయాలకు దూరం. విశేషమేమంటే ఆయన్ను నాస్తికులు కూడా గౌరవిస్తారు. నాకాయన దేవుళ్లాంటి గురువు. కష్టసుఖాలు ఆయన ఆశ్రమానికెళ్లి చెప్పుకుంటాను. ఆయన మాట నాకు శిరోధార్యం. అలా పదవిలో ఉన్న మూడేళ్లలో ఏటా ఓసారి ఏడుకొండలవాణ్ణి దర్శించుకొచ్చాను!

అప్పుడు రాష్ట్ర గ్రామాభివృద్ధి సలహా కమిటీ అధ్యక్షుణ్ణి. సామాన్యుణ్ణి. ఉన్నట్లుండి మారాజునైపోయాను. ప్రజాసంక్షేమానికి కోటానుకోట్ల నిధులు క్షణాల్లో మంజూరు చేసే అధికారం నాది. చుట్టూ అంగరక్షకులు. కదిలితే కార్లు, విమానాలు. అట్టహాసంగా సన్మానాలు. కనుసన్నల్లో మసిలే అయ్యేయస్, ఐపీయస్ అధికార్లు. తిరుపతిలో ఆ వెంకన్నే నాకోసం ఎదురుచూస్తున్నాడా అనిపించేలా, కనుగలిగినట్లు దర్శనం. అందుకేనేమో, అవినీతికి ఆమడ దూరంలో ఉండాలన్న ఆశయాన్ని అక్షరాలా పాటిస్తున్న నా మనసు- పదవి ఇచ్చే నిషా కోసం వెంపర్లాడుతుంది. కానీ ఏడాది క్రితం మంత్రివర్గంలో మార్పులొచ్చి, నా పదవి మరొకరికి వెళ్లింది. ఇప్పుడు పరిస్థితులు మారి, మళ్లీ నా పదవి నాకు దక్కేలా ఉంది. అది దక్కడానికి వెంకన్నని దర్శించమంటున్నాడు బాబా. కానీ ఇప్పుడైతే, దర్శనానికి గంటలకొద్దీ క్యూలో పడిగాపులు.

"అనుకున్నది జరగ్గానే తప్పక స్వామి దర్శనం చేసుకుంటాను బాబా!" అన్నాను వినయంగా.

బాబా తల అడ్డంగా ఊపి, "అనుకున్నది జరగడానికేగా స్వామి దర్శనం!" అని నొక్కించాడు.

ఇక బయటపడక తప్పలేదు, "పదవి వస్తే ఏటా ఓసారి వెళ్లి దర్శనం చేసుకుంటానని స్వామికి మ్రొక్కాను. అలాగే చేశాను. ఐనా కాలపరిమితి లేని పదవి మూడేళ్లకే ఊడింది. అలాంటిది ఇప్పుడు పదవికోసమే స్వామి దర్శనానికెడితే, నా కోరిక తీరుతుందా బాబా?" అనడిగాను.

బాబా నవ్వి, "నీ ప్రశ్నకి నీ గురువే సమాధానం ఇవ్వగలడేమో!" అని ఊరుకున్నాడు.

బాబా ఉద్దేశ్యం నాకర్థమైంది. ఆయనది భక్తి, వేదాంతం! పదవి అంటే సాంఘికం, రాజకీయం! ఆ విషయంలో నా గురువు మా ఊరి పంతులుగారు. ఆయన్ను కలవమని బాబా సలహా.

పంతులుగారు పాతికెకరాల భూస్వామి. ఆదర్శవాది. ఇంజనీరై చదువులో సత్తా చూపించాడు. గ్రామాలకి విద్యావంతులవసరమని, ఊళ్లోనే స్థిరపడ్డాడు. ఈ లిటిగేషన్ శకంలో, చదివింది చాలదని, ప్రైవేటుగా లా చదివి అందులో నిష్ణాతుడయ్యాడు. సలహా సంప్రదింపుల్లో గ్రామస్థులకి తలలో నాలుక అయ్యాడు.

ఆయనకు స్వార్థం లేదు. పౌరులకు సాంఘిక, రాజకీయ సమస్యలు, హక్కు, బాధ్యతల పట్ల అవగాహన కలిగించి, నేతల్లో , సేవాస్ఫూర్తిని ప్రబోధిస్తాడు. విద్యార్థులకు తీరికప్పుడు చదువు చెబుతాడు.

ఆయన సర్పంచి కావాలని ఊరంతా కోరుకుంది. కాదన్నాడు. పోనీ ఎవరు సర్పంచి కావాలో ఆయన్నే చెప్పమంటే.. 'ఇది ప్రజాస్వామ్యం. ఇక్కడ వ్యక్తుల ప్రమేయం ఉండకూడదు. ప్రజల నిర్ణయమే ప్రధానం' అంటూ ఎన్నికల్ని ప్రోత్సహించాడు. ఎన్నికలంటే పార్టీలు తప్పవు కదా, మా ఊళ్లోనూ రెండు పార్టీలున్నాయి. చిత్రమేమిటంటే పంతులు రెండు పార్టీలకీ ఆప్తుడే.

'ఎన్నికలప్పుడు జనస్వామ్యం ధనస్వామ్యం కానప్పుడే, అది ఘనస్వామ్యమౌతుంది' అన్న ఆయన మాటలు జనాలకు బాగా తలకెక్కాయి. మా ఊరి ఎన్నికల ప్రచారంలో డబ్బు పాత్ర లేదు. ప్రత్యర్థులు ఎవరికివారు తాము చెయ్యదల్చుకున్నది మాత్రమే చెబుతారు తప్ప, ఎదుటివారి అసమర్థతనీ, లోపాల్నీ ప్రస్తావించరు. ఎన్నికైనవారు అవినీతికి పాల్పడరు. ప్రభుత్వనిధుల్ని సక్రమంగా వినియోగించే అతికొద్ది గ్రామాల్లో మాదొకటి. ఊరిబాగుకి అడ్డొచ్చే పరిస్థితి ఏర్పడితే, ఊళ్లో రెండు పార్టీలూ ఒక్కటైపోతాయి.

మా ఊరికి ఎవరొచ్చినా ముందు కలిసేది పంతులు గారినే!

చిన్నప్పుడే ఆయన ఆదర్శాలపట్ల ఆకర్షితుణ్ణై, మానసికంగా ఆయన శిష్యుణ్ణయ్యాను. చదువయ్యేక నేనూ ఊళ్లో స్థిరపడతానంటే, ఆయన ఒప్పుకోలేదు. "దేశానికిప్పుడు నీలాంటి యువకులు కావాలి. నువ్వు లా చదువు. సాంఘికచైతన్యం కలిగే కార్యక్రమాలు చేపట్టి యువతకి స్ఫూర్తినివ్వు. మీ నాన్న నాకంటే బాగా ఆస్తిపరుడు కాబట్టి నీకిది సాధ్యమే!" అన్నాడు.

అలాగే చేశాను. అటు రైతూ కాక, ఇటు ఉద్యోగీ కాకపోవడాన్ని నా అప్రయోజకత్వంగా భావించిన గ్రామస్థులు కాస్త నామీదా, ఎక్కువగా మా నాన్నమీదా కొంచెం బాధ, కొంచెం జాలి పడ్డారు. ఆవిషయమై నాన్నకి కాస్త ఇబ్బంది ఉండేదేమో కానీ, నేను ఏమాత్రం పట్టించుకోలేదు.

'నిజాయితీని నమ్ముకో, అవినీతికి పాల్పడకు. ప్రలోభాలకు లోబడకు' అన్న పంతులుగారి దిశానిర్దేశం నాకెంతో మేలు చేసింది. అలా జనంలో, మీడియాలో నాకేర్పడిన గుర్తింపు మామూలుది కాదు. అది అంచెలంచెలుగా నా హోదాని పెంచి, చివరికి రాష్ట్ర గ్రామాభివృద్ధి సలహా కమిటీ అధ్యక్షుణ్ణి చేసింది.

మానవమాత్రుణ్ణి కదా, నేనేమిటో మా ఊరివాళ్లకి తెలియడానికి ఘోష యాత్ర చెయ్యాలనిపించింది. పంతులుగారికి ఫోన్ చేసి, "మీవల్ల నేను తప్పుదారికి మళ్లానని మనూళ్లో తప్పుడు అభిప్రాయముంది. అది

పోగొడితే, మీకు మరెందరో శిష్యులేర్పడి దేశానికి ఉపయోగపడతారు. కాబట్టి నేను మందీ మార్బలంతో అట్టహాసంగా మనూరొచ్చి నా వైభవాన్ని ప్రదర్శిస్తాను!" అని చెప్పాను.

పంతులుగారు ఒప్పుకోలేదు, "రాష్ట్ర గ్రామాభివృద్ధి సలహా కమిటీ అధ్యక్షుడు స్వయంగా వచ్చి చూడాల్సిన అవసరం ఏ ఊరికుందో, అక్కడికి అలాగే వెళ్లు. మనూరికా అవసరం లేదు. నీకిక్కడికి రావాలనుంటే, మారాజులా కాదు, మనూరివాడిలా రావాలి. పదవి లేనప్పుడు ఎలా వచ్చేవాడివో అలాగే రా!" అన్నాడు.

నిరుత్సాహపడ్డాను. ఆర్భాటం లేకపోతే, మా ఊరెళ్లడమెందుకూ అనిపించింది కానీ, ఓసారి పంతులుగారి దగ్గర ఫోను జారేక, బాగుండదనిపించి, బస్సులోనే మా ఊరెళ్లాను. దాంతో నా హోదా ఏమిటో ఊళ్లో చాలామందికి అర్థం కాలేదు. కనబడ్డవాళ్లు ముక్తసరిగా పలకరించి ఊరుకున్నారు.

సాయంత్రం పంతులుగారింటికెళ్లాను. ఏవో మామూలు కబుర్లు చెప్పుకుంటామని అనుకున్నా కానీ, పంతులుగారు అక్కడ పెద్ద ఏర్పాటే చేశాడు. నేనెళ్లిన కాసేపటికి ఊరి ప్రముఖులు చాలామంది వచ్చారు. ఆయన వాళ్లకి అంతవరకూ నేను సాధించినవన్నీ వివరించాడు. ఇప్పుడు నేనున్న పదవి ఘనతని వాళ్లకి ఎంతలా కళ్లకి కట్టించారంటే, వాల్మీకి రామాయణాన్ని చాగంటివారి నోట విన్నట్లుంది. "ఏ రాజకీయ పక్షానికీ చెందని మనవాడికి, ఇంత గొప్ప పదవి రావడం మామూలు విషయం కాదు. దీన్నిబట్టి మన రాజకీయాలు కుళ్లిపోలేదని స్పష్టమౌతోంది. నీతి, నిజాయితీల్ని నమ్మిన సమర్థుల కోసం దేశం ఎదురుచూస్తోంది. అలాంటివాళ్లు మనలోంచే రావాలి. అందుకు మనం కృషి చెయ్యాలి. ఐతే, రవంతైనా త్యాగం లేందే ఆ కృషి ఫలించదని కూడా మనం గ్రహించాలి!" అన్నాడు పంతులుగారు.

ఊరి ప్రముఖులు నన్ను అభినందించారు. అంతకంటే పెద్ద విశేషం... నా గ్రామ సందర్శనం మీడియాలో కలిగించిన సంచలనం. తన ఊరికి ఆ ఊరివాడుగా మాత్రమే వెళ్లాలనుకున్న నా సింప్లిసిటీకి, పెద్ద ఎత్తున పబ్లిసిటీ లభించింది. తర్వాత కొన్ని చానెల్లు నన్ను ఇంటర్వ్యూ చేసి ప్రశంసల వర్షం కురిపించాయి.

నేనా ఘనతంతా పంతులుగారికి ఆపాదించాను. ఎటొచ్చీ వేరే ఊళ్లకి నేను ఆర్భాటంగానే వెళ్లాను. మీడియాలో ఆ విశేషాలు చూసిన మా ఊరివాళ్లకి నేనేంటో స్పష్టంగా తెలిసింది. కనీసం పాతికమందైనా అభినందిస్తూ నాకుత్తరాలు రాశారు.

ముచ్చటగా మూడేళ్లు పూర్తవలేదు. ఆ పదవి పోయింది. కారణం కుళ్లు రాజకీయాలేనని స్పష్టమౌతూనే ఉంది. పంతులుగారు ఒప్పుకుంటాడా?

పంతులుగార్ని కలుసుకోమన్న బాబా సలహా పాటించాలనుకున్నాను కానీ, ఇప్పుడున్న స్థితిలో మా ఊరు వెళ్లడం చిన్నతనంగా అనిపించింది.

అప్పుడు సామాన్యంగా వెళ్లినా నవాబుని. ఇప్పుడు సామాన్యంగా వెడితే గరీబుని.

కాబట్టి వెంటనే ఆయనకి ఫోన్ చేసి విషయం చెప్పాను. దానికాయన, "మంచి సమయానికే ఫోన్ చేశావ్. నువ్విక్కడికి రానక్కర్లేదు. మనం తిరుపతిలోనే కలుసుకుని మాట్లాడుకుందాం!" అన్నాడు.

ఆశ్చర్యపోయాను. పంతులుగారు నాస్తికుడు కాదు కానీ, దేవుళ్లకి మ్రొక్కే టైపు కాదు. స్వశక్తిమీద నమ్మకమున్న మనిషికి, దేవుడు అడక్కుండానే సాయం చేస్తాడని పలుమార్లు చెప్పేడాయన నాకు.

"మీరు తిరుపతికి వెళ్లడమా? ఏదైనా మీటింగుందా?" అన్నాను. "మీటింగుకి కాదు. స్వామి దర్శనానికి" అన్నాడాయన.

"ఏమిటి విశేషం? మేడంకి ఏదైనా మ్రొక్కుందా?" అడిగాను అప్రయత్నంగా. శ్రీశ్రీ వంటి ఘట్టు నాస్తికవాది కూడా, తన భార్య సరోజ పాటించే భక్తి సంప్రదాయాన్ని గౌరవించాడు. పంతులుగారు నాస్తికవాది కాడు.

ఫోన్లో పంతులుగారి నవ్వు, "తిరుపతికి మేడం రాదు. నేనొక్కణ్ణే వస్తున్నాను. ఇది నా మ్రొక్కు"

"మీరు నాకు షాకుమీద షాకులిస్తున్నారు. మీరు మ్రొక్కుకోవడం దేనికి?" అన్నాను.

"నాకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయ సలహాదారు పదవి వస్తే బాగుణ్ణనుకున్నాను. అది స్వశక్తిపై నమ్మకంవల్ల జరిగే పని కాదని తెలుసు. అందుకే ఏడుకొండలవాడికి మ్రొక్కుకున్నాను. ఆయన తలచుకుంటే పదవులకు కొదవా? అసాధ్యమనుకున్నది సుసాధ్యమైంది!" అన్నాడు పంతులుగారు.

ఇది నాకు అసలు సిసలు షాక్. పంతులుగారు పదవి కోరుకోవడమా? అందుకు దేవుడికి మ్రొక్కడమా?

అప్పుడాయన నాకు ఫోన్లో చెప్పిన వివరాలివి:

ఇటీవల కేంద్రంతో సహా దేశంలో పలు ప్రాంతాల్లో ప్రభుత్వాలకి న్యాయస్థానాలతో చెప్పుకోతగ్గ చిక్కులు ఎదురౌతున్నాయి. అందుకని అన్ని పార్టీల నేతలూ రహస్యంగా సమావేశమై, ప్రతి ప్రభుత్వానికీ ఓ ప్రత్యేక న్యాయసలహాదారుని నియమించాలని నిర్ణయించారు. ఎంపికకు న్యాయనిపుణులు, రాజకీయ పండితులు, సమాజసేవకులతో కూడిన ఓ కమిటీని వేశారు. ఆ కమిటీ ఎంపిక చేసినవారు.. నేరచరిత్ర లేని, వివాదాస్పదం కాని, ఏ రాజకీయ పక్షానికీ చెందని వ్యక్తి అయుండాలి.

"నీ కారణంగా నా పేరు మీడియాలో హోరెత్తింది. నేను, మనూరు సమాజ ప్రముఖుల దృష్టిలో పడ్డాం. నా వివరాలు కోరుతూ నాకా కమిటీ నుంచి లేఖ రాగానే, నాకా పదవిమీద ఆశ పుట్టింది. ఆ పదవి చేపడితే, దేశానికి ఉడతాభక్తిగానైనా ఎంతోకొంత ఉపయోగపడగలననిపించింది. దేవుడికి మ్రొక్కుకున్నాను. పదవి వచ్చింది. మ్రొక్కు తీర్చాలి. అదీ సంగతి!" అన్నాడు పంతులుగారు.

నాకు అర్థమైంది. పంతులుగారూ మానవమాత్రుడే. శిష్యుడిగా నేననుభవించిన వైభవం గురువుగా తనకీ దక్కాలనిపించడం సహజమైనా, రాష్ట్ర న్యాయసలహాదారు పదవికాయన ఎంపికవడం నాకు సంతోషాన్నే కలిగించింది, "అప్పట్లో ఓసారి, 'మన రాజకీయాలు కుళ్లిపోలేదని స్పష్టమౌతోంది. నీతి, నిజాయితీల్ని నమ్మిన సమర్థులకోసం దేశం ఎదురుచూస్తోంది' అని మనూళ్లో నన్ను గర్వంగా పరిచయం చేశారు. ఇప్పుడు మీ గురించీ నాకలాగే అనిపిస్తోంది' అని, "మరి తిరుపతి ప్రయాణం ఎప్పుడు?" అన్నాను.

మనసునిండా ఉత్సాహం. వెంకన్నబాబా సామాన్యుడు కాదు. ఆయనకు అత్యున్నతస్థాయిలో జరిగిన రహస్య సమావేశం, రహస్యనియామకం విశేషాలు తెలిసిపోయాయి. పంతులుగారి తిరుపతి ప్రయాణం గురించీ తెలుసు. అందుకే తిరుపతి వెళ్లేముందు పంతులుగార్ని కలుసుకోమని నన్ను నిర్దేశించాడు.

"గురువారం రాత్రికి తిరుపతిలో ఉంటాను. అప్పటికి నువ్వూ అక్కడికి చేరి ఫోన్ చెయ్యి. శుక్రవారం మనిద్దరం స్వామి దర్శనం చేసుకుందాం!" అన్నాడు పంతులుగారు.

"శుక్రవారమెందుకూ.. మర్నాడు శనివారమైతే స్వామికి ప్రీతికరం కదా!" అన్నాను.

"ఔననుకో. శనివారమైతే రద్దీ ఎక్కువ. క్యూలో చాలాసేపుండాలి"

"క్యూ ఏమిటి? ప్రభుత్వానికి ప్రత్యేక న్యాయసలహాదారు. ప్రత్యేక దర్శనం కదా!" అన్నాను ఆశ్చర్యంగా.

"చట్టంముందు పౌరులందరి సమానత్వం కాపాడే న్యాయసలహాదారు పదవిలో ఉండి, దేవుడిముందు అసమానతని ప్రోత్సహించడమా? ఏమంటున్నావ్ నువ్వు!" అన్నాడు పంతులుగారు మందలింపుగా.

ఛెళ్లుమంది నాకు. నేను దైవదర్శనానికి వెళ్లినప్పుడు, నా ఒక్కడికోసం వేలాది భక్తులు క్యూలలో మరింతసేపు ఎదురుచూడాల్సి వచ్చేది. అప్పుడు గర్వంగా ఫీలయ్యేను.

"అనక ఏంచేస్తాను? ఆ అసమానత మనం కావాలని సృష్టించింది కాదు. మామూలుగా వెళ్లి దర్శనం చేసుకుందుకు దేవస్థానం వారే ఒప్పుకోరు!" అన్నాను నన్ను నేను సమర్థించుకునే ప్రయత్నంలో.

"నువ్వన్నది నిజమే. అందుకే నేను పదవిలో జాయినవడానికి ముందే తిరుపతి ప్రయాణం పెట్టుకున్నాను. జాయినయ్యేక, పదవీకాలంలో దైవదర్శనానికి వెళ్లను. వెళ్లినా, అధికారి హోదాలో కాక, ఒక మామూలు భక్తుడిలా వెడతాను!" అన్నాడు.

'నీకు మనూరు రావాలనుంటే, మారాజులా కాదు, మనూరివాడిలా రావాలి. పదవి లేనప్పుడు ఎలా వచ్చేవాడివో అలాగే రా' అని పంతులుగారు అప్పట్లో నాకు చెప్పారు. ఇప్పుడు దేవుడు అదే విషయం ఆయన ద్వారా నాకు చెప్పించాడు.

దేవుణ్ణి మామూలుగా కాక మారాజులా దర్శించుకున్న నా ఉద్యోగం ఎందుకు ఊడిందో అప్పుడు నేను గ్రహించగలిగాను. అంతేకాదు, స్వామి దర్శనానికి ముందు పంతులుగార్ని కలుసుకోమని వెంకన్నబాబా నాకెందుకు చెప్పాడో కూడా అప్పటికి అర్థమయింది.

న్యాయ సలహాదారు పదవి పంతులుగారికి లభించడంవల్ల, దేశానికి మేలు జరగడమే కాదు, బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలా.. నాతో సహా మరెందరికో ఆదర్శమూ, మార్గదర్శకమూ కాగలదని నాకప్పుడు అనిపించింది.

***0***



కథామంజరి మార్చి 2021 సంచిక

విశిష్ట అతిథి

# స్నే'హితుడు'

కథ

సమ్మెట ఉమాదేవి



సృజనాత్మక, సాహిత్య ప్రక్రియలలో కథారచన క్లిష్టమైనదైనా .. స్పందించి రాయగల సత్తా ఉంటే .. 'కథకేం భాగ్యం, కావ్యాలనే సృష్టించగలం' అంటూ మహోన్నతమైన కథలను బాధ్యతతో అందించిన 'రేలపూలు' సృష్టికర్త శ్రీమతి సమ్మెట ఉమాదేవి. ఈ ప్రత్యేక సంచిక కోసం వారి కలంనుంచి జాలువారిన మరో కథా పుష్పం .. "స్నే'హితుడు'"



# స్నే'హితుడు'

## సమ్మెట ఉమాదేవి

హేమంత ఋతువు అంటేనే.. ఆశల కాలం. వర్ష ఋతువులో నాటిన శ్రమకు ఫలాలనిస్తున్న కాలం. చలి బద్దకాలు కర్షకులకు అంటనే అంటవు. ఏ కాలమైన చేస్తున్న కష్టాన్ని, కష్టం అనుకోకుండా అవి నిత్య క్రతువుల్లా పనుల్లో నిమగ్నం అయిపోతుంటారు వాళ్ళు. కాలధర్మం ప్రకారం తొందరగా సందె ముసురుకున్నది. దీప్లా కూలీలకు పైసలిచ్చేసి.. పచ్చిమిరపకాయలు, దోసకాయలు ఉన్న గోనె సంచీని బండిమీద పెట్టుకుని ఇంటికి బయల్దేరాడు.

ఒక మూడు మైళ్ళు అలా ముందుకు సాగగానే అతని దృష్టి పక్కనే వున్న పొలంలోని నీలి రంగు సమాధి మీద పడింది. అప్పుడే ఎవరో పువ్వులు చల్లి వెళ్ళినట్లు.. గన్నేరు, మందారాల నడుమ పున్నాగ పూలగుత్తి కూడా కనపడింది.

అటు చూస్తుంటే.. "దీప్లా బేటా!" అని గౌరీబాయి దాది పిలుస్తున్నట్లే అనిపిస్తుంటుంది. తన వంక సూటిగా చూస్తూ ఏదో హెచ్చరిస్తున్నట్లే అనిపిస్తుంటుంది. అసలు చచ్చిపోయిన తమ వాళ్ళను, తమ పొలంలోనే సమాధి చేసుకోవడం ఏమి పద్ధతో కానీ, ప్రతీ రోజూ తన పొలం పనులకు వెళ్తుంటే.. వస్తుంటే.. గౌరీబాయి దాది వాళ్ళ పొలం దగ్గరకు వచ్చేసరికి వద్దనుకున్నా దీప్లా దృష్టి ఆ సమాధి మీద పడుతుంటుంది. ఎవరో ఆపినట్లే బండి వేగం తగ్గిపోతుంటుంది. ఎవరో పక్కనే నిలబడి ఏదో చెప్తున్నట్లే ఉలిక్కిపడుతుంటాడు దీప్లా.. ఎవరో ఏమిటి? ఆ గౌరీబాయి దాదినే పిలుస్తున్నట్లుగా, మాట్లాడుతున్నట్లుగా ఉంటుంది. ఏదో హెచ్చరిస్తున్నట్లే ఉంటుంది. తల విదుల్చుకుని ముందుకు సాగిపోతుంటాడు.

ఎవరికీ చెప్పుకోలేని బాధ చీకటిలా గుండె నిండా కమ్ముకున్నదేమో బండిని మెల్లగా పోనివ్వసాగాడు. చేలల్లో పనులు ముగించుకుని కూలీలు కొందరు నడచి వెళ్తున్నారు. కొందరు ఆటోలో వెళ్తున్నారు. దారంతా నడచి వెళ్తున్న వాళ్ళ ముచ్చట్లు సవ్వడి చేస్తుంటే.. అల్లంత దూరం నుంచే అక్కడక్కడా పూసిన పున్నాగలు సువాసనలు వెదజల్లుతున్నాయి. వాటి ఆస్వాదనలో దిగులు ముసురుకున్న దీప్లా మనో ఫలకంపై తెరలు తెరలుగా బాల్యపు చిత్రాలు మెరవసాగాయి.

***

బడికెళ్ళే దారిలో ఆడపిల్లలంతా పున్నాగ చెట్ల క్రింద గుంపులుగా చేరి పువ్వులు ఏరుకుంటుంటే .. తాను కూడా దోస్తులతో కలిసి వెళ్ళి ఆడపిల్లలకు సాయం చేసేవాడు. బడికి చేరాక అందరూ చెట్ల క్రింద తరగతిలో కూర్చుని నోట్స్ లు రాసుకుంటుంటే.. సార్ వచ్చేవరకూ అమ్మాయిలు బ్యాగ్ లో పెట్టుకున్న పువ్వులు రహస్యంగా అల్లేవారు. సార్ వచ్చి పాఠం చెప్తుంటే కూడా పాఠం వింటునట్లే వింటూ.. సార్ కళ్ళు కప్పి మరీ కొందరు మాలలు అల్లేసేవారు.

"అన్ని పువ్వులూ దారంతో మాల కడ్తే అసలు దారమే లేకుండా వీటిని మాత్రం కాడలతోనే ఎట్లా కడ్తారు కాత్యా?" అని అబ్బురంగా అడిగేవాడు. అట్లా అల్లడం అదో బ్రహ్మ విద్యలా అనిపించేది అబ్బాయిలకు.

"ఎట్లన్నజేసి నాకు సుత అట్లా మాలల్లుడు నేర్పు కాత్యా!" అంటూ బతిమాలుతూ ఆమె వెంట పడేవాడు. సుధీర్, పావనీ, పాపలాల్, లక్ష్మా, సుజాత, శారదా, సాగర్ అందరూ కలిసి ఆడా మొగా అని తేడా లేకుండా ఎన్నో ఆటలు ఆడుకునేవారు. కలిసి నడుచుకుంటూ మైళ్ళకు మైళ్ళు వెళ్ళి చేలల్లో పనులు చేసుకునేవాళ్ళు. కలిసి బడికి వెళ్ళేవాళ్ళు. రేగిపళ్ళు, కందికాయలు, పెసర కాయలు, కంకులు, తునికి పండ్లు కలిసి పంచుకుని తినేవాళ్ళు.

ఉన్న ఊర్లో ఏడో తరగతితో చదువాగిపోయి కాత్యాలాంటి ఆడపిల్లలందరూ బడి వదిలి, పనుల దారి పడ్తే.. అబ్బాయిలు సిటీ హాస్టల్లో చేరి కొందరూ, బంధువుల ఇళ్ళలో వుండి కొందరూ, ఆటోల్లోనో, బస్సులోనో వెళ్ళి వస్తూ కొందరూ చదువులు కొనసాగించినా.. మొత్తం మీద పదో తరగతి పాస్ అయ్యి కాలేజీ చదువులు చదువుకున్నది ఏ అయిదారుగురో.. మంచి ఉద్యోగాలు చేస్తున్నవారు ఏ ఇద్దరో..

ఆ తెలిసీ తెలియని వయసులో కాత్యా లేడి కన్నుల సోయగాలు, లేడి పరుగుల చలనాలూ అతనిలో కలిగించిన చలనాలకు ఒక పేరు కూడా పెట్టుకోలేదతను. తన మనసులో ఒక స్పష్టమైన చిత్రం గీసుకోనేలేదు. పున్నాగ పూవులు కొన్నాళ్ళే పూస్తాయి కానీ, ఆమె అంటే వున్న ఇష్టం అతన్ని నిరంతరం వెంటాతున్నదెందుకో తెలుసుకోనే లేదు. జీవితంలో ఊహించని మార్పులు మంచు తుఫానుల్లా చొచ్చుకుని వచ్చాయి.

పున్నాగ పూల పరిమళాలు దీప్లా బాల్యమంతా ఎలా ఆవహించాయో.. గుర్తుకు వస్తుంటే బయటకు రాలేని కన్నీళ్ళు గుండెను మరింత భారం చేస్తున్నాయి. మదిలో ఎన్నో ఆశలూ, కోరికలూ వున్నా.. అసలు మనకేమి కావాలో, మనం ఏమి కావాలనుకుంటున్నామో మనం నిర్ణయించుకునే అవకాశం ఇవ్వనివే పరిస్థితులు. కొన్ని చేయిజారి పోయాక.. వాటి విలువలు తెలియ చెప్పేదే జీవితం. దీప్లా.. బాగా చదువుకోవాలి, మంచి ఉద్యోగం చెయ్యాలన్న కోరిక తీరక ఎంత వేదనను అనుభవించాడో.. తన జీవితాన్ని ఇంకా చక్కదిద్దుకునే సందట్లోనే అకస్మాత్తుగా తన చిన్ననాటి నెచ్చెలి పెళ్ళి చేసుకుని తననీ, తన ఊరినీ వదిలి వెళ్ళిపోయాక అంతకంటే ఎక్కువ వేదనను అనుభవించాడు.

మేళ తాళాలతో ఆమె తండాను దాటకా కానీ, ఆమె మీద ఎంత ప్రేమ పెంచుకున్నాడో అతనికి తెలియనే లేదు. తెలిసాక తట్టుకోలేక తరుచూ వంటరిగా పున్నాగ చెట్టు క్రిందకు చేరేవాడు. ఆమె ఇక నిత్యం

కనిపించదని హేమంతంలో మురిపించే పున్నాగ పువ్వుల్లా అప్పుడప్పుడు పుట్టింటికి వచ్చి వెళ్ళే అతిధి అయిపోతుందన్న ఊహకు అతని మేను జలదరించేది. అక్కడ ఆ పున్నాగ చెట్టు క్రింద అతని కనులు కురిపించలేని దుఃఖపు మేఘాలు.. రహస్యంగా గుండెల్లో వర్షించేవి.

ఆడపిల్లలకు ప్రాయం వస్తే పెళ్ళి చేసేస్తారు. అబ్బాయిలకు భార్య పిల్లలను పోషించుకునే తాహతు వచ్చినప్పుడే పెళ్ళి చేస్తారు. తన ఊహలు రెక్కలు తొడగకముందే.. పనులు చేసుకుంటూ బతుకు వెళ్ళ దీస్తున్న అతని రెక్కలు బలపడకముందే.. అతని బాల్య మిత్రురాలు దూరమయిన వాస్తవాన్ని ఆమోదించగలగడానికి అతనికి కొన్నేళ్ళు పట్టింది.

వాళ్ళ స్నేహ సమూహంలోని అబ్బాయిలు బతుకు దార్లలో ఒక్కో గమ్యం ఎంచుకుంటున్న సమయంలో, అమ్మాయిలందరూ పెళ్ళిళ్ళు చేసుకుని అత్తారిళ్ళకు వెళ్ళిపోయారు. అబ్బాయిలూ మెల్ల మెల్లగా తలొకదారినా జీవితంలో స్థిరపడ్డారు. దీప్లా కూడా తనవాళ్ళు చూసిన పిల్లను పెళ్ళి చేసుకుని భార్యా పిల్లలనూ, అమ్మానాన్నలనూ బాధ్యతగా చూసుకుంటూ పెద్దవాళ్లను సంతోషపెట్టసాగాడు.

***

పదేళ్ళు గడిచిపోయాయి. కాలగమనంలో జీవితం ఎన్నో మలుపులతో మార్పులతో సాగిపోతూనే ఉన్నది. మరీ గొప్పగా కాకున్నా ఎలాగో ఒకలాగా బతుకు బండి దొర్లించేస్తూ.. దాదాపు అందరూ బాగానే ఉన్నారనుకున్న సమయంలో.. ఎప్పుడూ తన కళ్ళముందే ఉంటే బాగుండునని కోరుకున్న కాత్యా ఊహించని రీతిలో తమ ఊరు వచ్చి చేరింది. ఆమె ఈ రకంగా పుట్టిల్లు చేరినందుకు ఎంతగానో కుమిలిపోయాడు.

అతనికి ముందు వెళ్తున్న ఆటోలో నుండి గౌరీబాయి దుకాణం దగ్గర కాత్యా దిగింది. గౌరీబాయితో ఒక రెండు నిముషాలు ఏదో మాట్లాడి చిన్నచిన్న వస్తువులు కొనుక్కుని భారంగా ముందుకు సాగింది. బండి ముందుకు పోనిచ్చి దీప్లా ఇంటికి చేరుకున్నాడు. దిగులుగా వున్న తల్లిని చూసి ..

"ఏందమ్మా అట్లున్నావు? అడిగాడు.

"ఏమి జెప్పుదురా కొడుకా! అసలు కాత్యాకు వాళ్ళ అమ్మా నాయిన అప్పుడే పెండ్లి చేద్దామని కూడా అనుకోలేదు పాపం. ఏదో పనిమీద మనూరికి వచ్చి భీమ్లానాయక్ 'చేసుకుంటే ఆ పిల్లనే చేసుకుంటా!' అని పట్టుబట్టే ఎల్లకే.. "సరే ఒక్క పిల్లకు లగ్గంజేసి దాటిచ్చినా దాటిచ్చినట్టే..!" అని మీ మామ పది రోజుల్లో పెండ్లి చేసిండు. ఆనాడు ఆయన దగ్గర ఏమీ లేక.. పిల్లకు భూమీ, జాగా, బంగారం, ఏమియ్యలే. పాపం భీమ్లా కూడా ఎన్నడూ ఏమీ అడగలే. ఆ తరువాత మీ మామ బాగానే సంపాదించుకున్నాడు.

ఇప్పుడు కాత్యా ముగ్గురు పిల్లల తల్లయినంక భీమ్లానాయక్ పిడుగు పడి సచ్చిపోయిండు. అవ్వగారి ఊరికి చేరుకున్నది గానీ.. 'అన్నలోర్చినా వదినలోరుస్తరా' అనీ, బిడ్డ కిరాయికి ఇల్లు దీసుకొని కూలికి పోకుంట బతుకుతాంది. ఇప్పుడన్న ఆ పిల్లకు భాగం పంచాలె కదా! లేకుంటే ఆ పిల్ల, బిడ్డలను ఎట్ల

బతికిచ్చుకుంటది. చిన్నవయసులనే బతుకు అగ్గిపాలయి పుట్టిల్లు చేరిన ఆడపిల్లకు భాగం పంచనీ వదినలు గాదు.. మొదాలు దాని అన్నలే సచ్చిపోతున్నారు" కొంగుతో కన్నీళ్ళు తుడుచుకున్నది.

దీప్లా అమ్మ ఇచ్చిన చాయ్ తాగి మళ్ళీ బండి తీశాడు. గౌరీబాయి దుకాణం ముందు నుంచి కాత్యా వాళ్ళింటికి వెళ్తున్న ప్రతీసారీ ఆమె చూడనే చూస్తున్నది. దాదాపు పదిహేను వందలమంది ఉన్న ఆ తండా అవసరాలు తీర్చే రకరకాల వస్తువులన్నీ అమ్ముతుంటుంది గౌరీబాయి. అటుగా వచ్చిపోయే ప్రతీ వ్యక్తీ ఆమెను పలకరిస్తూనే ఉంటారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆమె సలహా సంప్రదింపులు తీసుకుంటుంటూనే ఉంటారు.

"రా దీప్లా!" అంటూ మంచం వేసి కూర్చోబెట్టి ఆప్యాయంగా మాట్లాడింది కాత్యా. వెళ్ళి బిస్కెట్లు కొనుక్కోమని ఆమె పిల్లలకు డబ్బులిచ్చాడు. పిల్లలు సంబరంగా బయటకు వెళ్ళారు. ఆమె కాస్సేపు వెక్కి వెక్కి ఏడుస్తున్నది. మరి కాస్సేపు తన జీవితానికి అయిన గాయపు బాధ లోతు తెలియనంత గలగలా మాట్లాడుతున్నది. దోస్తులందరినీ మనిషి మనిషినీ గుర్తు చేస్తున్నది.

"నీతో ఇట్లా మాట్లాడితే ప్రాణం అలకగైతున్నది." తేట పడ్తూ అన్నది. వెళ్ళక తప్పదు గనుక ఎప్పటికో వెనుతిరిగాడు దీప్లా. ఇంటికి మరలి వెళ్తుంటే గౌరీబాయి చూపులు అతని వెన్నును గుచ్చుతున్నట్లే ఉన్నాయి.

***

రాను రాను దీప్లా కాత్యాను చూడకుండా ఉండలేక పోతున్నాడు. అతను ఎప్పుడు బడితే అప్పుడు బయటకు వెళ్ళి రావడం మామూలే కాబట్టి అతని భార్య స్వాతికి కూడా ఏ అనుమానమూ రాలేదు. ఊర్లో పెద్ద మనిషిగా కాస్త పేరు సంపాదించుకున్నాడు కాబట్టి పైకి ఎవరూ ఏమీ వ్యాఖ్యానించడం లేదు. కాత్యాకు జరిగిన ఘోరానికి భగవంతుణ్ణి మనసులోనే నిందిస్తున్నాడు దీప్లా. ఆమెను గుండెల్లో పెట్టుకుని నీకు తోడుగా నేను ఉన్నానని చెప్పి.. ఆమెను తన ప్రేమ దేవతలా చూసుకోవాలన్న తపనకూ.. సమాజపు కట్టుబాట్లకూ మధ్య నలిగిపోతున్నాడు.

ఆ రోజు బండి మలుపు తిప్పుతుంటే గౌరీబాయి దీప్లాను పలుకరించింది. "బేటా! బడా దిల్ వాలే అంటారు సూడు అసొంటోటిడివి నువ్వు.. సిన్నప్పటి సంది సూస్తున్న. ఎవ్వళ్ళకు ఏ కష్టమొచ్చినా ఓర్వలేవు. అందరినీ ఆదుకుందామనే చూస్తావ్.. నువ్వు కాత్యా  దగ్గరకు వస్తాంటే.. దాని పిల్లలు మస్తు సంబరపడ్తున్నారు. బిస్కెట్ పుడాకు, కూల్ డ్రింకులకు మస్తు పైసలిస్తవ్ కదా గందుకే.. సిన్నపిల్లలు కదా! ఇప్పుడు తిండి మీదనే ఉంటది వాళ్ళకు.." అన్నది.  దీప్లా ఉలిక్కిపడ్డాడు. పైకి తనను పొగుడుతున్నట్లే ఉన్నా ఏదో హెచ్చరిస్తున్నట్లుగా అనిపించి ఇబ్బంది పడసాగాడు.

మరో రోజు కాత్యాకి తలనెప్పిగా వుందంటే.. టీ కోసం గౌరీబాయి దగ్గర టెట్రా ప్యాక్ పాల పాకెట్ కొనడానికి వెళ్ళాడు. ఎప్పటిలా పలకరింపులు అయ్యాకా..

"అయ్యో బిడ్డకు సెత్తి నొస్తున్నదా దీప్తా బేటా! మనం కొందరి కష్టాలు తీరుద్దామనే అనుకుంటాం గానీ.. అదేందో మనకు తెలియకుంటనే మనమే కొత్త కష్టాలు తెచ్చినోళ్ళమైతం కొడుకా! అసలు కాత్యాకు ఈ సెత్తి నెప్పి ఎందుకొస్తున్నదో ఇ వరం దెల్సుకో?" ఆమె తలనెప్పికి కారణం నువ్వే అని ఆమె అన్నట్టుగా అనిపించి చెంపమీద చెల్లున చరిచినట్లయ్యింది. ఒక్క గౌరీబాయి మాత్రమే తమను గమనిస్తున్నది అనుకుంటున్నాడు దీప్తా. ఊరి పెద్దగా చెలామణి అవుతున్న అతన్ని రహస్యంగా వెంటాడే చూపులెన్నో..!

మర్నాడు కాత్యా పనులకు వెళ్తూ గౌరీబాయి దగ్గర ఆగింది. "బిడ్డా! వయసులో చాలా చిన్న పొల్లవు. నిండా మునిగి వున్నవు.. ఇసొంటప్పుడు గడ్డిపోస దొరికినా పెద్ద ఆసరా దొరికినట్టే అనిపిస్తది. అసలు ఆడ బతుకే బాధల బతుకు. ఇగ మగడు సచ్చిన ఆడదాని కష్టాలు ఇంకింత వేరు. పురిటి నెప్పుల తీరు అవి భరించినోళ్ళకే ఎరుక. ఎవళ్ళన్నా జాలిపడ్డా అది జరంత సేపే. బతుకంతా ఆమె నెప్పి ఆమెనే పడాలా! ఆ బాధలు.. ఎవరొచ్చి ముచ్చట్లు పెట్టినా తీరవు. కండ్లు తుడిసినా తీరవు. జాలి పడ్డారు గదా అని బతుకు ఎవళ్ళ సేతుల్లా పెట్టొద్దు. బద్నామ్ గావొద్దూ" అన్నది. హతాశురాలయి ముఖం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోతున్న కాత్యాని చూసి ..

"నువ్వు నన్ను గద్దర్ ది అనుకున్నా సరే! మొగోడు జర్రంత జాలి పడ్తే సరిపోయేనా బేటీ! పెండ్లాం పిల్లలున్నోడు.. పిల్లలు గల వంటరీ ఆడిదానికి ఎట్లా సాతీ ఇస్తాడు. అటెంక అల్లరయి ఏడ్సు కోకుంటా మొదాలే పైలంగా వుంటావని ఇట్లా సెప్పక తప్పుతల్లేదు బిడ్డా!" అనుకున్నది.

ఇంకో రోజు "అసలు ఎవల్లో వచ్చి నీ దుఃఖాన్ని పంచుకోవాలే.. నీ కండ్లు తుడవాలే అని సూడకు బిడ్డా! వయసులో ఉన్న ఆడిదానితో మొగోనికి మాటా ముచ్చట కావలే కానీ.. కలకాలం కష్టాలు పంచుకోలేరు. చిన్న వయసులో వచ్చిన కష్టాన్ని ధైర్యంగ ఎదుర్కో బిడ్డా! లేకుంటే బిడ్డలు ఆగమై పోతారు!" అని చెప్పింది.

సుధీర్, రమేష్, దీప్తా వెళ్తుంటే ఆపి.. "దోస్త్ లంటే ఆడిపిల్ల ఇంటికి బోయి నాస్తా జేసి, షర్బత్ లూ తాగి పోవుడు కాదు. పెద్ద మనుష్యుల పంచాయితీలు పెట్టించి ఆ పిల్లకు దక్కాల్సినది దగ్గరుండి ఇప్పించుండ్రి. పెండ్లాం పిల్లలున్నోడు గాకుండా ఎవళ్ళన్న వంటరోడు, దాన్ని ఇష్టపడి పెండ్లి జేసుకుంటానంటే దగ్గరుండి మళ్ళా పెండ్లి చేయుండ్రీ." అని హెచ్చరించింది.

కాత్యాకు అత్తింటి నుంచీ రావలసిన ఆస్తుల గురించీ పుట్టింటివారు పంచాల్సిన భాగాల గురించీ చర్చలు జరుగుతున్నాయి.

"కాత్యా గట్టిగా నిలబడు. అత్తింటి నుంచి వచ్చే అరెకరం పొలమైనా, అర్ధ గజం జాగా అయినా అస్సల్దార్ వి, వదులుకోకు. అది నీ కొడుకుల బిడ్డల కాపాడ్తది. పుట్టింటోళ్ళు ఇచ్చేదీ చిన్నమెత్తు బంగారమైనా ఇనామ్ లెక్కనే కొట్లాటల్లేకుండా కుషీగ తీస్కో. మంచికి చెడుకు వాళ్ళ అండా, వీళ్ళ అండా నీకు ఎప్పటికీ అవుసరం!" అని చెప్పింది.

అప్పుడే కాదు సందర్భం వచ్చినప్పుడు.. సందర్భం చేసుకుని మరీ కాత్యా, దీప్లాలిద్దరినీ పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నది. మూడు నెలల తరువాత నిద్దట్లోనే గుండె ఆగిపోయి ఆ ఊరి పెద్ద దిక్కు గౌరీబాయి ఈ లోకం నుండి నిష్క్రమించింది.

ఆమె కోరిక ప్రకారం ఆమె పొలంలోనే ఆమెను సమాధి చేశారు. నీలి రంగునద్దిన సమాధిపై కుటుంబ సభ్యులు తరచు పూలు చల్లి వస్తుంటారు. అన్ని సందర్భాలలో దీపం పెట్టి వస్తుంటారు.

ఆమె మరణం కుటుంబ సభ్యులను ఎంత కలత పెట్టిందోగానీ, కాత్యా, దీప్లా జంటను మాత్రం చాలా కలవరపెట్టింది. ఆ దారి నుండి వస్తూ పోతుంటే భ్రమల ప్రపంచం నుండి వాస్తవ ప్రపంచంలోకి రమ్మని.. జీవితాలను చక్కబరుచుకొమ్మని ఆమె హెచ్చరిస్తూన్నట్టే ఉంటుంది.

ఒకరోజు సుధీర్ ఇంటికి వెళ్ళి అప్పటికప్పుడు "దా సుధీర్ బండి ఎక్కు!" అంటూ అతన్ని బండి ఎక్కించుకుని తీసుకెళ్ళి బడికి వెళ్ళే దారిలో వున్న పున్నాగ చెట్టు క్రింద ఆపాడు.

"మళ్ళీ ఆ బాల్యం తిరిగి వస్తే ఎంత బాగుండు.." అనుకుని నవ్వుకున్నారిద్దరూ. అకస్మాత్తుగా దీప్లా సుధీర్ చేతులు పట్టుకుని

"అరే సుధీర్ నాతో అయితల్లేదురా.. పొద్దుగాల్ల లేస్తే గా గౌరీబాయి దాది చేను నుంచే మా చేనుకు బోవాల..! నా పని నన్ను చేసుకోనీయకుండా, దినాం ఆమె నా ఎంట బడ్తున్నట్టే ఉంటదిరా! నీకు తెలుసు కాదా! కాత్యా అంటే నాకు ఎంతిష్టమో! కష్టంల వున్న ఆమె తానకు బోయి నాలుగు మంచి మాటలు మాట్లాడి వచ్చుడు కూడ తప్పయితదా! మనం గాక ఆమెకు ఎవరున్నరు?" నిలదీశాడు.

"తప్పని ఎవరన్నారు దీప్లా? అది తప్పని నీకు అనిపిస్తే నువ్వసలు చెయ్యవు కదా! తప్పు కాకుంటే ఎవరు చెప్పినా ఆగవు కదా!" సుధీర్ అన్న మాటలకు ఉలిక్కిపడ్డాడు.

"నిజానికి నీ ఎంట బడ్తున్నది గౌరీబాయ్ గాదురా! ఆమె రూపంలో నీ అంతరాత్మ కూడా. నువ్వు చేస్తున్న దాంట్లో కుద్దుగా నీ తప్పేమీ లేకుంటే దిల్ దార్ గా ముందుకు పోతావు. యాడనో నీకు నువ్వే జావాబుదారివై ఏమీ చెప్పుకోలేక పరేషానైతున్నవు. కాత్యా అంటే నీకున్నది మోహమొ మోజో కాదు, నిజమైన దోస్తానీ అనుకుంటే.. ఆమెను బాద్నామ్ జేయ్యకుంట, అంత దూరాన నిలిచిపో! ఊరి పెద్దగా ఆమెకు రావాల్సినవన్నీ వచ్చేట్లు జూసి సాతీ ఇవ్వు"

ఎందుకో తెలియదు.. సుధీర్ ని పట్టుకుని దీప్లా వెక్కివెక్కి ఏడ్చేసాడు. సుధీర్ కూడా ఆపలేదు అతన్ని కరువు తీరా ఏడవనిచ్చాడు. అతన్ని అతను సమాధాన పరుచుకునేలా తన భుజాన్ని ఆసరా ఇచ్చాడు.

ధూళి మేఘాలు కురిసి వెలిసిన మానసంతో సుధీర్ తో దీప్లా వెనుతిరిగాడు.

ఇప్పుడు.. కాత్యాకు దక్షతగా నిలిచే బాధ్యత గల స్నేహితునిగా దీప్లా, ఆ నీలిరంగు సమాధి దారి నుండి కూడా జంకులేకుండా పయనిస్తున్నాడు. తడబాట్లు, పొరపాట్లు లేని గమ్యంలో నిర్మలంగా సాగిపోతున్నాడు.

***0***

కథామంజరి ఏప్రిల్ 2021

సంచిక విశిష్ట అతిథి



# బామ్మగారు వస్తున్నారు .. .. బహుపరాక్

## పోలాప్రగడ జనార్ధనరావు (జెన్ని)

కథ



నమ్ముకుంది, వంటబట్టింది.. అది రచనైనా, నటనైనా.. నాకబ్బింది హాస్యం అంటూ మనచేత భళ్లున నవ్వించగల ద్విపాత్రధారి శ్రీ పోలాప్రగడ జనార్ధనరావు గారు. "ఏంవిటో సార్. ఈమధ్య కలం, గళం రెండూ ఇంకిపోయాయి.. ఐతేనేం నిత్యం గుబాళించే హాస్య కథ పంపుతున్నాను" అంటూ, కథామంజరి జన్మదిన సంచిక కోసం "బామ్మగారు వస్తున్నారు.. బహుపరాక్!" ను అందించారు. స్వాతి వారపత్రికలో నుంచి పునర్ముద్రణ.



# బామ్మగారు వస్తున్నారు .. .. బహుపరాక్

పోలాప్రగడ జనార్ధనరావు (జెన్ని)

దేవులపల్లి వారి భక్తి గీతాన్ని రీమిక్స్ చేసినంత గందరగోళంలో పడ్డారు కాసుల బామ్మగారి బంధువర్గం. ఆ కలకలానికి కారణం బామ్మగార్ని శంషాబాద్ ఎయిర్పోర్టులో కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారని.

దగ్గర బంధువు.. దూరాన దుబాయ్ లో ఉన్న కాసులు బామ్మగారి కొడుక్కి కంగారుగా అరెస్టు విషయం ఫోన్ చేసి చెప్పాడు. కాసులు బామ్మగారి ఒక్కగానొక్క కొడుకు దుబాయిలో సొంతంగా పెద్ద కెమికల్ ల్యాబ్ పెట్టాడు. ఆవిడ కొడుకు దగ్గరకు తరచూ దుబాయ్ ఒంటరిగా వెళ్లి వస్తూ ఉంటుంది. పెద్దలిచ్చిన బోల్డు ఆస్తి ఉంది. వాళ్ళాయన బతికున్నప్పుడు యాత్రలకు ఆయన్ని కూడా తిప్పేది. ఆయన పోయినా ఆ అలవాటు పోలేదు. ఆవిడ రూపురేఖలు, వస్త్రధారణ గురించి నాలుగు మాటల్లో చెప్పాలంటే, నాలుగేనట్రా భడవా అని కోప్పడుతుందని భయం.

బామ్మగారు సాంప్రదాయాన్ని గౌరవించే ఉత్తమ ఇల్లాలు. తలంటుకుంటే జలుబు చేస్తుందని నమ్మిన సగటు ఆడది. అలంకరణే అడ్డమైన వెధవల్ని ఆకర్షిస్తుందన్న భావాలు గల స్త్రీ. అందుకే 'ముండనం' అదే గుండు చేయించుకుంది. రంగు రంగు చీరలే ఆకర్షణకి పుట్టిల్లు, రకరకాల ప్రలోభాలకి, అనర్థాలకి దారి తీస్తాయని, స్వచ్ఛమైన తెల్ల మల్లు పంచెలవైపే మొగ్గు చూపింది.

బామ్మగార్కి ప్రయాణాలంటే అంటే మహా ఇష్టం. ఒంటరిగా 'తానా సభలకి' తాను కూడా తయారవుతుంది. అంతేకాదు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో అక్షరాభ్యాసం దగ్గర్నుంచి, అంత్యక్రియల వరకూ, ఏ కార్యక్రమం జరిగినా క్రమం తప్పకుండా వెళ్లి శాయశక్తులా సాయం చేస్తుంది.

ఆవిడ ఎవరితోనైనా, ఏ భాషలోనైనా మాట్లాడగలదు. మోదీ గారితో మాట్లాడాలన్నా మొహమాట పడదు. ఆవిడకు ఆవేశం ఎక్కువ. అహంకారం తక్కువ.

ఎక్కడ ఏ అన్యాయం జరిగినా ఖండిస్తుంది. నాకెందుకొచ్చిన గొడవ అని ఊరుకోదు. ఆ అన్యాయాన్ని రూపుమాపడానికి ఎంత కష్టమొచ్చినా భరిస్తుంది.

***

కస్టమ్స్ అధికారి బామ్మగారిని ఎయిర్పోర్టులో, తన గదిలో ఇంటరాగేట్ చేయడం మొదలెట్టాడు.

"బామ్మ గారూ! నమస్కారం కూర్చోండి"

"కూర్చుంటాగానీ, మీ ఇంటి పేరు ఏంట్రా ఆఫీసరూ?"

"శ్రీనివాస నిలయం అమ్మా"

"ఏడిసినట్టు ఉంది నీ సమాధానం. ఇంటి పేరంటే 'సర్ నేమ్' రా నాయనా!"

"సరే ఆ సంగతి వదిలేయండి బామ్మగారూ! ఈ ఏడాదిలో జనవరి నుంచి మార్చి వరకూ, ఇంచుమించుగా పది, పదిహేనుసార్లు మీరు దుబాయ్ వెళ్ళొచ్చారు. ఏయే తేదీలంటే" కంప్యూటర్లో వెరిఫై చెయ్యబోయి, ఆవిడ మాటలకి ఖంగుతిని ఆగిపోయాడు.

"చూడు నాయనా! నువ్వు శ్రమ పడకు. నే చెబుతా విను. శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, అష్టమి మంచిది కాదని ముందు రోజు అంటే సప్తమి రోజున, మా మనవడి పుట్టినరోజుకి దుబాయ్ వెళ్ళా. అక్కడ నుంచి మతత్రయ ఏకాదశికి, మా బాబాయ్ తద్దినానికి, ఇండియా తిరిగొచ్చా .. ఆ తర్వాత .."

బిక్క మొహం పెట్టిన కస్టమ్స్ అధికారి కంప్యూటర్ 'మౌస్' పిల్లిని చూసినట్టు వణకడం మొదలెట్టింది.

"నీ మొహం చూస్తే ఇంగ్లీషు మీడియం వెలగబెట్టావని అర్థమవుతోంది. తెలుగులో చెబితే తెల్లమొహం వేశావు. ఈసారి వచ్చినపుడు పెద్దబాలశిక్ష ప్రజెంట్ చేస్తాలే. షల్ ఐ టాక్ ఇన్ ఇంగ్లీష్"

తల పట్టుకుని కూర్చున్న ఆఫీసర్ గారికి, అసిస్టెంట్ టీ తో పాటు తలనొప్పి మాత్రలు ఇచ్చాడు.

"బామ్మగారూ! ఆఖరి ప్రశ్న. మిమ్మల్ని దుబాయిలో ఫ్లైట్ ఎవరెక్కిస్తారు? ఇండియాలో ఎవరు రిసీవ్ చేసుకుంటారు? దయుంచి 'ఆబ్జెక్టివ్ టైప్' లో ఆన్సర్ చేయండి"

"మా పనివాడు 'హుస్సేన్' బట్టల ఇస్త్రీ చేయడం దగ్గర్నుంచి బాత్రూములు క్లీన్ చేయడం వరకూ అన్ని పనులూ చేస్తాడు. వాడే దుబాయిలో నన్ను ఫ్లయిట్ ఎక్కిస్తాడు. వాడి ఫ్రెండ్ ఫ్రెడ్రిక్ నన్ను ఇండియాలో రిసీవ్ చేసుకుంటాడు .. చాలా .. ఇంకా కావాలా?"

"బామ్మ గారూ! కోప్పడకండి. ఈమధ్య దుబాయ్ నుంచి మేం ఊహించని మార్గాల్లో డ్రగ్స్ స్మగుల్ అవుతున్నాయి."

"మీరు ఊహించినట్టు చేస్తే వాళ్లు స్మగులర్స్ ఎందుకవుతారు?"

"ప్లీజ్ నన్ను మాట్లాడనీయండి .. ఆ .. ఎంతవరకు చెప్పా?"

"ఎంతవరకూ చెప్పావో గుర్తుపెట్టుకోకపోతే, ఇక ఉద్యోగం ఎలా చేస్తావు రా నాయనా!"

"ఆగండి .. గుర్తొచ్చింది .. అందుకని తరచూ దుబాయ్ నుంచి వచ్చే వాళ్ళని చెక్ చేస్తున్నాం అంతే"

ఇంతలో కస్టమ్స్ ఆఫీసర్ లేడీ అసిస్టెంట్ వచ్చి, ఆయన చెవిలో ఏదో ఊదింది.

"బామ్మగారూ! ఇక్కడ ఉక్కగా ఉంది. లోపల ఏసీ రూములో కూర్చోండి"

"నాకేం మర్యాదలు చెయ్యక్కర్లేదు" అంటూ సణుక్కుంటూ లోపలికి వెళ్ళింది.

వెంటనే ఆవిడ బ్యాగ్ చెక్ చేసాడు. అందులో భగవద్గీత, నాలుగు తెల్ల మల్లు పంచెలు తప్ప ఏం లేవు. ఇంతలో ఏసీ రూం లోంచి బామ్మగారు, పంచె గుండు మీదకి లాక్కుంటూ, అరుచుకుంటూ, అపర కాళిలా వచ్చారు.

"మీ అసిస్టెంట్ కి బుద్ధి లేదు, సంస్కారం లేదు. ఆడదన్న ఇంగితజ్ఞానం లేదు. నన్ను వివస్త్రను చేసి, నగ్నంగా చెక్ చేస్తుందా? పరువు నష్టం దావా వేస్తా. ఏమనుకుంటున్నారో! మా మాచర్ల మాణిక్యరావు బాబయ్య లీడింగ్ లాయర్"

"బామ్మగారు! కూల్ డౌన్. శాంతించండి. అది మా వెరిఫికేషన్ లో ఓ భాగం అంతే .. థాంక్స్ .. ఇక మీరెళ్ళచ్చు."

"గేట్ దాటాకా మళ్ళీ పిలిచారో కోర్టుకీడుస్తా జాగ్రత్త!" అంటూ తిట్టుకుంటూ వెళ్ళిపోయింది.

"హమ్మయ్య! గాలివాన వెలిసింది" అనుకుంటూ ఫెయిల్యూర్ క్రైమ్ సినిమాకి శుభం కార్డు వేసినంత రిలీఫ్ ఫీలయ్యాడు కస్టమ్స్ ఆఫీసర్.

***

ఎయిర్పోర్ట్ లోంచి బామ్మగారు కొడుకుతో ఫోన్లో మాట్లాడడం మొదలుపెట్టింది.

"ఏవిట్రా నాయనా మీ చెక్ అప్పులు, వెధవ గొడవలు, ఇన్ని సార్లు తిరిగాను కానీ ఎప్పుడూ ఇలా జరగలేదు."

"అమ్మా! కస్టమ్స్ వాళ్ళదేమీ తప్పులేదు. హెరోయిన్ .."

"ఏమిటీ? హీరోయిన్లు కూడా స్మగ్లర్సా?"

"హీరోయిన్లు కాదు 'హెరోయిన్' అదే 'బ్రౌన్ షుగర్' అంటారు. 'ఓపియం' అదే 'గన్ హాప్', 'కోకోయిన్' లాంటి డ్రగ్స్ ని రకరకాల మార్గాల్లో స్మగుల్ చేస్తున్నారు. నీళ్లల్లో కలిసే 'నియూసిన్', 'ఫోలిక్ యాసిడ్' లతో డ్రగ్స్ ని కలిపి, నీళ్లల్లో కలిపి, స్మగ్లర్స్ రకరకాల రసాయనిక ప్రయోగాలు చేస్తున్నారు. అదో పెద్ద రాకెట్లే, చెప్పినా నీకు అర్థం కాదు."

"అలా అంటేనే వొళ్ళు మండుతుంది"

"సర్లే! కోప్పడకు. నన్ను హైదరాబాద్ రమ్మంటావా?"

"అఖ్ఖర్లేదు నాయనా! ఆ ఫ్రెడ్రిక్ వెధవ వస్తాడులే. మన బంధువులు కూడా వచ్చారు. వాళ్ళు నా వెనకాలే ఉంటార్లే"

***

దుబాయ్ లో హుస్సేన్, బామ్మగారిని దగ్గరుండి హైదరాబాద్ ఫ్లైట్ ఎక్కించాడు. ఫ్రెడ్రిక్ కి ఫోన్ చేశాడు. ఫ్లైట్లో బామ్మగారి పక్క సీట్లో తల్లి ఒళ్ళో పది నెలల పిల్లాడు. తల్లి వాడి ఏడుపు, గింజుకోవడం ఆపలేక సతమతమవుతోంది. డైపర్ వేయడానికి పిల్లాడి చేత యోగాసనాలు వేయిస్తోంది.

“డైపర్ తర్వాత వేద్దువుగాని, బాబుని నాకీయమ్మా! నేనూరుకోబెడతా” అంటూ బామ్మగారు బాబుని భుజాన వేసుకుని జోకొడుతూ “జో అచ్యుతానంద జోజో ముకుందా! లాలి పరమానంద రామ గోవిందా!” పాడ్డం మొదలెట్టింది. ఎయిర్హోస్టెస్ వచ్చి, “యు షుడ్ నాట్ సింగ్ లౌడ్లీ” అంది.

“సొల్లు మాట్లాడొచ్చా?”

“వాట్ డు యు మీన్ బై సొల్లు?”

“అన్నెససరీ టాక్. గంట నుంచి చూస్తున్నా నీ పక్కన వెధవతో సొల్లు కబుర్లు చెబుతున్నావు. రామ నామం జపిస్తే తప్పయిందా? ఉండు .. మోదీ గారికి ఫోన్ చేసి కంప్లైంట్ చేస్తా”

ఆవిడతో ఎందుకొచ్చిన గొడవని, అర్థం అవ్వకపోయినా, బాయ్ ఫ్రెండ్ తో సొల్లు కబుర్లు కంటిన్యూ చేసింది. ఈలోగా పండుగాడు యు ఫోమ్ బెడ్ మీద పడుకున్నట్టు రిలీఫ్ ఫీలయి, ఏడుపు ఆపి, ప్రశాంతంగా చూ.. చూ.. పోసాడు. బామ్మ గారి మల్లు పంచె తడిసింది. వాష్ రూమ్ కి వెళ్లి, పంచెను తడిపి, పిండుకొచ్చింది. అలవాటుగా తడి కొంగుతో మొహం తుడుచుకుంది. గాఢ నిద్ర పట్టింది. హైదరాబాదులో ఫ్లైట్ దిగేసరికి ఆవిడకు ఏదో మత్తుగా, మగతగా, అనీజీగా ఉంది.

ఫ్రెడ్రిక్ వచ్చాడు. బామ్మగారిని రిసీవ్ చేసుకుని, లగేజీ కారు డిక్కీలో సర్దాడు.

***

బామ్మగారు దుబాయిలో కోడలు పెట్టిన జున్ను తింటుంటే ఆవిడకు ఏవేవో పాత విషయాలు గుర్తుకొచ్చాయి.

“ఒరేయ్ అబ్బాయ్! నా చిన్నప్పుడు మా నాన్నగారు మా అక్కయ్యకి మన ఊరు నుంచి మద్రాసు ‘జున్ను గుడ్డ’ పంపేవారు”

“అమ్మా! ‘జున్ను గడ్డి’ గురించి విన్నా కానీ ‘జున్ను గుడ్డ’ గురించి వినలేదు. దాని గురించి చెప్పు.. చెప్పు”

“జున్ను పాలల్లో, మామూలు పాలు, తరిగిన బెల్లం కలిపి, ఓ అర మీటరు కొత్త సైను గుడ్డ, మూడు నాలుగు రోజులపాటు ఆ పాలలో బాగా నానబెట్టి, ఎండబెట్టి, నానబెట్టి, మళ్ళీ ఎండబెట్టి, ఆ ఎండబెట్టిన ‘జున్ను గుడ్డను’ రిజిస్టర్ పోస్టులో మా అక్కకి మద్రాసు పంపేవారు. ఆ ఎండిన ‘జున్ను గుడ్డ’ ను పాలల్లో నానబెట్టి, పిండి శుభ్రం చేసి, ఆ పాలల్లో జీడిపప్పు, ఏలకులు, మిరియాలు వేసి, మా అక్క జున్ను తయారుచేసుకునేది”

“వండర్ఫుల్ ప్రొసెస్ అండ్ ఎక్సెలెంట్ ఎక్స్పర్ట్ అమ్మా!”

బామ్మగారు చెమట పట్టిన మొహాన్ని తడి కొంగుతో తుడుచుకుంటుంటే, ఆవిడ బుర్రలో ఏదో ఆలోచన బొంగరంలా తిరిగింది. టక్కున ఆవిడ మనసులో ఏదో ప్లాన్ రూపు దిద్దుకుంది.

“ఒరేయ్ అబ్బాయి! నేను రేపు హైదరాబాద్ కి వెళ్తా. పాపం సుబ్బులు బామ్మగార్కి హార్ట్ ఎటాక్ వచ్చిందట. ఈసారి నాకు తోడుగా ‘హుస్సేన్’ ని కూడా తీసుకెడతా. అక్కడ సాయంగా ఉంటాడు. చాలా రోజుల నుంచి ఇండియా వస్తానంటున్నాడు. నిన్ను అడగడానికి భయపడుతున్నాడు”

"అలాగే తీసుకెళ్ళు అమ్మా!"

***

శంషాబాద్ ఎయిర్ పోర్టులో కాసులు బామ్మగారు దిగగానే, ఆవిడకు కస్టమ్స్ స్టాఫ్ సెల్యూట్ చేశారు. తనతో వచ్చిన 'హుసేన్' ని వాళ్లకు పరిచయం చేసింది.

"రండి బామ్మగారూ! మీకు అవుట్ గేట్ వరకు సెండాఫ్ ఇచ్చి వస్తాం" అంటూ కస్టమ్స్ స్టాఫ్ వాళ్లతో పాటు గేటు బయటకు వచ్చారు. అక్కడ ఆవిడ్ని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన ఫెడరిక్ కస్టమ్స్ స్టాఫ్ని చూసి కంగారు పడ్డాడు.

'హుస్సేన్'ని, 'ఫెడరిక్'ని, కస్టమ్స్ ఆఫీసర్ హఠాత్తుగా అరెస్టు చేసి, ఇంటరాగేషన్ కి ఎయిర్పోర్ట్ లోపలికి తీసుకెళ్లాడు.

లేడీ డిటెక్టివ్ లా, బామ్మగారు ముసిముసి నవ్వులు నవ్వుతూ లోపలికి వెళ్ళింది.

"డ్రగ్స్ ఎలా స్మగుల్ చేస్తున్నారు?" అని కస్టమ్స్ ఆఫీసర్ అడిగిన ప్రశ్నకు, హుస్సేన్, ఫెడరిక్ మాకేం తెలియదని దబాయించారు.

ఇలాంటి వాళ్ల చేత నిజం ఎలా కక్కించాలో కాకలు తీరిన కస్టమ్స్ అధికారులకి కప్పు కాఫీ సేవించినంత తేలిక.

కస్టమ్స్ దెబ్బలకి, షాక్ లకి వీళ్లిద్దరూ తట్టుకోలేకపోయారు.

"సార్! నిజం చెప్తాను" అని హుస్సేన్ అనగానే టార్చర్ ఆపి, వాడు చెప్పే స్టేట్మెంట్ రికార్డు చేయడం మొదలుపెట్టారు.

"సార్! ఎలా ఉంటాయో, ఎలా స్మగుల్ చేస్తారో, మేరేకో నహీ మాలూమ్ సాబ్ .. లేకిన్ దుబాయి లో మేరా భాయ్ "ఖాసిం" 'గంజి' లాంటిది నాకి ఇస్తాడు సాబ్. అది నేను బామ్మ గారి పంచలకు పెట్టి, ఇస్త్రీ సేసి బామ్మగారు హైదరాబాద్ తీసుకెళ్లే బ్యాగ్ లో పెడతా సాబ్. బస్, ఇస్ సే జాదా మేరే కో నహి మాలూం సాబ్" హుస్సేన్ నోరు మూయగానే, మరో దెబ్బ పడకుండా, ఫ్రెడ్రిక్ నోరు విప్పాడు.

"బామ్మగారు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో దిగినాకా, నే రిసీవ్ జేసుకుంటా సారు. ఆమె బ్యాగు కారు డిక్కీలో పెట్టినంక, గందులో వున్న నానమ్మ పంచెలు నా బ్యాగులో పెట్టి, ఆమె బ్యాగులో నే తెచ్చిన గసుమంటి పంచెలే పెడతా సారు. ఆమె దుబాయ్ నుంచి దెచ్చినగా పంచెలు ఓల్డ్ సిటీల బదురుద్దీన్ గాడిగిస్తా సారు. ఆడుగా పంచెల్ని, చిన్న చిన్న దస్తీ (జేబురుమాళ్ళు) లెక్క కట్ సేస్తాడు. గవి నీటిలో తడిపినాక డ్రగ్ ఎఫెక్ట్ బయట పడతది. గవి కాలేజీ పోరగాళ్ళకి, బయటున్న యూత్ కి బదురుద్దీన్ గాడే సొంతంగా సేల్ చేస్తాడు. గా కర్చీఫ్ ని నీళ్లల్లో పిండి, ముక్కుగాడ పెట్టుకుంటే మత్తు మస్తుగొస్తది. చూసేవాని ఎవ్వరికీ గింతగూడా అనుమానం రాదు సార్. గిట్ల చేసినాక మాకు కూడా జరంత పైసలు నెల నెలా యిస్తాడు సారు. గింతకన్నా మాకేం తెలవదు సారు. బాంచను దొరా కాల్ ముక్తా. మమ్మల్ని నమ్మండి సార్" అంటూ కస్టమ్స్ ఆఫీసర్ కాళ్లు పట్టుకున్నాడు.

అప్పుడు బామ్మగారు అసలు విషయం బయట పెట్టారు.

“క్రిందటి నెల ఏకాదశి రోజున హుసేన్ బ్యాగ్ లో పెట్టిన మల్లు పంచె కట్టుకుని దుబాయ్ నుంచి హైదరాబాద్ ఫ్లైట్ ఎక్కా. నా పంచె ఫ్లైట్లో చంటిపిల్లాడు అల్పాచమానం చేసి, నా పంచే తడిపాడు. అప్పుడు నేను వాష్ రూమ్ లోకి వెళ్ళి, పంచె తడిపి శుభ్రం చేసుకున్నా. అలవాటుగా తడి కొంగుతో మొహం తుడుచుకున్నా. అప్పుడు నాకు ఏదో మైకం, మగత వచ్చింది. మత్తుగా అనిపించి గాఢ నిద్ర పట్టింది. అప్పుడే నాకు అనుమానం వచ్చింది. ఆ తర్వాత మా అబ్బాయికి ‘జన్నుగుడ్డ’ గురించి చెబుతూ ఉంటే నా అనుమానం గట్టిపడింది. హుస్సేన్ గాడ్ని, ఫ్రెడ్రిక్ వెధవని పట్టిస్తే అసలు విషయం బయటపడుతుందని, మీకు ఫోన్ చేసి వివరంగా చెప్పా.”

“సెహబాష్ బామ్మగారూ! ఉచ్చ విగ్రహాలు దొరికాయి. ఇంక మూలవిరాట్ లకు ముచ్చెమటలు పట్టించి, పట్టుకుంటాం. బామ్మ గారూ! మీరు తిట్టడం వల్ల నా తెలుగు బాగా ఇంప్రూవ్ అయింది కదూ!” అని కస్టమ్స్ ఆఫీసర్ అనగానే

“ఏడిసినట్టే ఉంది నీ తెలుగు ఉచ్చారణ. ఉచ్చ విగ్రహాలు కాదు, ఉత్సవ విగ్రహాలు అనాలి!”

“సారీ బామ్మగారూ! ఈ సారి జాగ్రత్త పడతా. అన్నట్టు మీ పేరు అవార్డు కోసం ప్రభుత్వానికి రికమెండ్ చేస్తాం”

“నీ తెలివి తెల్లారినట్టే ఉంది. ఆ అవార్డు ఏదో నా పంచె తడిపిన పండు గాడికి యిప్పించు” అనగానే అందరూ బామ్మగారికి జై కొట్టారు.

***0***



కథామంజరి మే నెల 2021

సంచిక విశిష్ట అతిథి



# ఆపాత మధురం

## డి. కామేశ్వరి

కథ



రచనలు చేయడంలో సామాజిక ప్రయోజనం ఉండాలనే గట్టి నమ్మకంతో, స్త్రీ సమస్యలే కథావస్తువుగా రచనలు సాగించిన తెలుగు కథా ఋషీమణి శ్రీమతి దుర్వాసుల కామేశ్వరి గారు. "కథ రాద్దామనుకున్నా.. రాయలేని పరిస్థితుల్లో ఉన్నాను.. మీకు నచ్చితే ఈ కథ వేసుకోండి!" అంటూ 'ఆపాత మధురం' ఆణిముత్యాన్ని కథామంజరి జన్మదిన సంచిక కోసం అందించారు. ఇది నవ్య వార పత్రిక నుండి పునర్ముద్రణ.

# ఆపాత మధురం



## డి. కామేశ్వరి



ఓ ఆదివారం నాలుగు గంటల వేళ తోచలేదని బయటకు తీసుకెళ్ళమని మారాం చేస్తున్న కూతురికి 'ఇదిగో నీకు మంచి సినిమా కన్నా బాగుండేది చూపిస్తాను' అంటూ లాప్టాప్ ఆన్ చేసింది కీర్తన. బోర్లా పడుకుని, గెడ్డానికి చేతులానించి చూస్తున్న శృతి ఆనందంగా, విభ్రమంగా చూస్తూ "మమ్మీ చూడు ఆ పిట్ట పిల్లలు నోళ్ళు ఎలా తెరిచాయో. పిట్ట చూడు నోట్లో ఎలా పెడుతుందో అన్నం". కొమ్మకు వేలాడుతున్న గిజిగాడి గూటిలో బంగారు పిట్ట పిల్లలు నోళ్ళు తెరుచుకునుంటే, రెక్కలు టపటపలాడిస్తూ, ఎగురుతూ నోట్లో ఆహారం పెడుతున్న ఆ దృశ్యం వింతగా చూస్తూ అరచింది.

"పిట్ట పిల్ల ఏమిటే. బలే పేరు పెట్టావు" నవ్వింది కీర్తన.

"మరేం అనాలి. పిట్ట కదా, దాని పిల్ల కదా…" పెద్ద కళ్ళని తిప్పుతూ, ఆ కళ్ళమీద పడిన జుత్తుని తోసుకుంటూ ప్రశ్నార్థకంగా చూసింది.

"పిచ్చుక పిల్ల అంటాం. పక్షిపిల్ల అనాలా పక్షికూన అనాలా?" తల్లే సందేహంలో పడింది.

"అమ్మా చూడు చూడు…ఆ నెస్ట్… కాకిపిల్లలు, ఎంత క్యూట్ గా ఉన్నాయో" మరో దృశ్యం… మరో కేక… ఆనందం, ఆశ్చర్యం.

"మమ్మీ చూడు చూడు. ఏంటవి?" ఉడతలు చూపిస్తూ అడిగింది

"స్క్వరల్స్, ఉడతలు అంటారు" సపోటా చెట్టు మీద, చెంగుచెంగున కొమ్మల మీంచి దుముకుతూ పక్కానికి వచ్చిన కాయలు, ముందు కళ్ళతో పట్టుకు కొరుకుతూ.

"మమ్మీ మనం తిన్నట్టే తింటుంది చూడు" సంబరంగా అంది. కూతురు ఆనందోత్సాహాలు చూస్తుంటే, చిన్నప్పుడు సపోటా చెట్టు కొమ్మల మధ్య ఎలుకల బోను పెట్టి, ఉడతలను పట్టుకొని, కాసేపు ఆడి, ఆనందించి, విడిచి పెట్టేస్తే తుర్రుమని పారిపోవడం… ఇప్పటి పిల్లలు ఆ దృశ్యాలు ఎలా చూస్తారు?"

"మమ్మీ నాకో ఉడతనివ్వు, ఆడుకుంటాను" ఆశగా అడిగింది.

"వద్దమ్మా, వాటిని పట్టుకొని బోనులో పెట్టకూడదు. పాపం వస్తుంది!" అంటూ రామదాసు చిలకను పట్టుకొని బంధించిన కథ చెప్పింది. శృతి కళ్ళలో కాస్త నిరాశ.

"మమ్మీ, చూడు ఆ పారట్ జామకాయని ఎర్ర ముక్కుతో ఎలా కొరుకుతుందో." మరో దృశ్యం! మరో ఆశ్చర్యం!! చిలక కొరికిన పండ్లు కింద పడితే, తెల్లారి ఏరుకొని గౌనుతో తుడుచుకొని తినడం… చిన్నతనంలో ఎన్ని ముచ్చట్లో!!

"అమ్మా ఆవు పిల్ల చూడు… అమ్మ దగ్గర ఎలా పాలు తాగుతుందో. అమ్మా అలా పొడుస్తుందేమిటి, అమ్మ ఆవుకి నొప్పెట్టదూ?" ఆవుదూడ పొదుగు కుమ్మి కుమ్మి పాలు తాగుతున్న దృశ్యం చూసి, శృతి అంది.

"అమ్మలకి నొప్పెట్టదమ్మా. నువ్వు నా కడుపులో ఉండగా ఎలా తన్నేదానివో తెలుసా" నవ్వింది కీర్తన.

"బాగా నొప్పెట్టేదా అమ్మా. సారీ అమ్మా" శృతి బాధపడుతూ అంది.

"ఛా ఛా అదేం లేదు. అందరూ కడుపులో ఉండగా అలాగ తిరుగుతూ తంతారు. అది నొప్పెట్టదు. అమ్మలు అసలు బాధపడరు. సంతోషిస్తారు" అంది.

శృతి దృష్టి మళ్ళీ లాప్ టాప్ మీదకి మళ్ళింది. ఆవుదూడ పాలు తాగి పెరడంతా చెంగు చెంగున గెంతుతూ ఉంది. మరో దృశ్యం. పిల్లి వసారాలో పడుకుంటే, నాలుగు పిల్లలు తల్లి మీదనుంచి గెంతుతూ, వాళ్ళలో అవి పోట్లాడుకుంటూ ఆడుకుంటున్నాయి.

"మమ్మీ పిల్లి పిల్లలు ఎంత క్యూట్ గా ఉన్నాయో చూడు." వాటిని పట్టుకోవడానికన్నట్టు చేయి చాపింది లాప్టాప్ వేపు.

పెరటినిండా విరబూసిన బంతిపూలు….. వాటిమీద రంగురంగుల సీతాకోకచిలుకలు. మరో చోట, రంగురంగుల చామంతులు.

"ఇంత మంచి గార్డెన్ ఉండేదా అమ్మా మీ ఇంట్లో?" పూల స్క్రీన్ ని తాకుతూ అడిగింది. వీధి వైపంతా పూల మొక్కలూ, పెరట్లో మామిడి, పనస, సపోటా జామ… ఎన్ని చెట్లుండేవో మా అమ్మమ్మగారింట్లో. పిల్లలందరం సెలవలకు వెళ్ళినప్పుడు చెట్ల మీదే ఉండేవాళ్ళం. ఎన్ని రకాల ఆటలో" అంది కీర్తన పాతరోజులు తలంచుకుంటూ పారవశ్యంగా.

శృతి తల్లి వంక చూస్తూ "మరి మన అమ్మమ్మ గారింటికి ఇప్పుడు సెలవకి ఎవరూ రారు ఎందుకు?"

"ఎవరున్నారు? మా అక్కా అన్నయ్యా ఇద్దరూ అమెరికాలో ఉంటారు. అంత దూరం నుంచి ప్రతీ శెలవలకీ రాలేరుగా. వచ్చినా ఇప్పుడు అమ్మమ్మగారి ఇంట్లో పెరడూ తోటా ఎక్కడున్నాయి? ఇల్లు అమ్మేసి ఎపార్ట్మెంటుకి వెళ్ళిపోయారు చేసుకోలేక. ఇద్దరూ ముసలివాళ్ళైపోయారు కదా. అప్పుడు మా అమ్మమ్మకి ఆరుగురు పిల్లలు. దొడ్డమ్మలూ, పిన్నులూ, మావయ్యలూ అందరూ సెలవలకి వచ్చేవారు. ఆ రోజుల్లోలా ఇప్పుడెలా ఉంటాయి?"

శృతి కళ్ళలో అసూయ. "ఎంత బాగుండేదో కదా. అందరూ వచ్చి సర్దాగా పిల్లలు ఆడుకోవడం. మీరంతా ఎంత లక్కీ. నాకే ఎవరూ లేరు ఆడుకోడానికి!" కినుకగా అంది.

"అమ్మమ్మగారిల్లు ఎందుకు అమ్మేసారు మేం పిల్లలం ఆడుకోడానికి లేకుండా" నిలేసింది. "అసలు చెట్లు లేకుండా మన ఎపార్ట్మెంట్స్ ఎందుకు కట్టేరు?"

"ఏం చేస్తాం తల్లీ. జనం ఎక్కువైతే ఉండడానికి చోటేలేక, ఇల్లు కూల్చేసి, ఆ చోటులో యాబై ఇళ్ళు కడుతున్నారు. ఇక చెట్లకి చోటేది?"

"మరి ఆ ఉడతలూ, చిలకలూ, పిట్టలూ... అవెక్కడున్నాయి? ఎక్కడికి పోయాయి?"

"చెట్లున్న చోటు వెతుక్కుంటూ పల్లెటూళ్ళకి, లేకపోతే అడవులకి పోయుంటాయి. పిచికల్లాంటివి ఇంటి చూరులో గూడు కట్టేవి. ఇప్పుడసలు అవేమీ కనబడటమే లేదు. అంతరించిపోయాయి కాబోలు."

"అమ్మా మనం కూడా ఏదైనా పల్లెటూరు వెళ్ళిపోదామా?" ఆశగా అడిగింది.

"ఎలా వెడతాం. నీకు మంచి స్కూలూ, నాకు ఆఫీసూ అన్నీ చిన్న ఊళ్ళలో ఉండవు. ఈ సారి సెలవలకి ఎక్కడికన్నా తీసుకెడతాలే" ఊరడింపుగా అంది. "ప్రామిస్" అంది. "ప్రామిస్" అంది కీర్తన.

నిజంగా ఎంత మంచిదైంది. పాపనెత్తుకొని అమ్మమ్మగారి ఇంటికి వెళ్ళినప్పుడు వీడియో కేమరాతో షూట్ చేసింది. పాప పెద్దదైతే తన తాతగారిల్లూ, పల్లెటూర్లూ ఎలా ఉంటాయో చూపాలని. ఇప్పుడింక ఈ తరం పిల్లలు ఆవు దూడల్నీ, ఉడతల్నీ, పక్షుల్నీ, పొలాల్నీ, చెట్లూ చేనులను అన్నీ సీడీల్లో చూసి ఆనందించాల్సిందే మరి.

"ఏంటో రోజంతా పిచ్చెక్కినట్టు, చెట్లు, పుట్టలూ, పక్షులూ, పిల్లులూ, ఆవులూ గేదెలూ ఫోటోలు తీస్తున్నావు. మాటా మంతీ లేదు. కెమెరా పట్టుకు తిరుగుతున్నావు." అమ్మమ్మ కేకలేసింది.

"ఉండు అమ్మమ్మా. పాప పడుకుంది. ఇవన్నీ ఎందుకు తీస్తున్నానో తెలుసా. పాప పెద్దయ్యాక అమ్మమ్మగారి ఊరూ, ఈ ఇల్లూ, తోటలూ అవీ చూపించొద్దా?"

"అంటే ఫోటోలే చూపిస్తావా? మళ్ళీ రావేమిటి? లేకపోతే మళ్ళీ నీవొచ్చేసరికి మేముండమనా?" అమ్మమ్మ అలక.

"ఏమో మళ్ళీ ఎప్పుడవుతుందో. ఇండియా వచ్చినా ఈ ఊరు వచ్చే వీలుంటుందో లేదో."

"ఏమో తల్లీ! ఈ అమెరికా ఉద్యోగాలు... మొహాలు చూసుకోవడమే అపురూపం అయిపోతుంది. ఏదో కూతురును చూపించాలనేనా ఈ ముసలివాళ్ళ దగ్గరకు వచ్చావు. అంతే చాలు." అప్పుడే నిద్ర లేచిన మునిమనవరాలిని ఆప్యాయంగా ఎత్తుకుంది.

"పాప చూసావా ఎంతసేపు నిద్ర పోయిందో! పిల్లలకు నీళ్ళూ పాలేనే బలం. చక్కగా నూనె మర్దనా చేసి, నలుగు పెట్టి, వేడివేడి నీళ్ళుపోస్తే, వాళ్ళకు ఒళ్ళు నొప్పులూ అవీ లేకుండా, తేలికగా ఉండి, ఒళ్ళెరగకుండా పడుకునేవారు ఇదివరకూ పిల్లలు. మీరేదో నీళ్ళలో గిన్నె కడిగినట్టు సబ్బు పామి తోమేస్తున్నారు."

నిజమే ఆ మాట. అమ్మమ్మ స్టూలు వేసుకొని కూర్చొని, వెంకటమ్మ కాళ్ళమీద పాపని పడుకోబెట్టి, నూనెతో పామి పామి, మాలిష్ చేసి, నలుగుపిండితో నలుగుపెట్టి, వేడివేడి నీళ్ళు పొట్ట మీద ఒక బాల్చీడు, వీపుమీద ఒక బాల్చీడు రుద్ది రుద్ది పోయించింది. అలవాటు లేక పాప గోలుగోలున ఏడుస్తుంటే "అమ్మమ్మా ప్లీజ్ పాప ఏడుస్తుంది. అలా గట్టిగా రుద్దొద్దు. బాబోయ్ అంత వేడి నీళ్ళు వద్దు." అని గోలపెడుతుంటే "ఉండవే తల్లీ. నీ కూతురికేం కాదు. ఆ పూచీ నాది" అంటూ స్నానం చేయించింది. సాంబ్రాణి పొగవేసి,

పొడరద్ది, పల్చటి గౌను వేస్తే, చేతుల్లోనే సొమ్మసిల్లినట్టు నిద్రపోయింది. ఆ పడుకోడం పడుకోడం మూడు గంటలు పడుకుంది. లేచాక నవ్వుతూ చేతిలో వాలిపోయింది. ఎంత ఫ్రెష్ గా ఉందో! ఎంత కమ్మని వాసన వేస్తుందో!! ఆకలి మీద సీసాడు పాలు గటగటా తాగేసింది. సీసాడు పాలు మూడుసార్లు తాగేది రోజు. పాపని ఎత్తుకున్న అమ్మనీ, తాతగారినీ ఫోటోలు తీసింది.

“నిజమే అమ్మమ్మా పాప ఆవురావురుమని పాలన్నీ తాగేసింది. ఎప్పుడూ లేదిలా.” కమ్మని వాసనొస్తున్న కూతుర్ని ముద్దు పెట్టుకుంటూ అంది.

“ఒక్క వారం రోజులుండు. నీ కూతుర్ని బంతిలా తయారుచేసి పంపిస్తాను.”

రెండు రోజులనుకున్నది ఐదు రోజులుండిపోయింది. వచ్చిన చుట్టాలందరి ఫోటోలూ తీసింది. ఆ రోజు పాపకి అవన్నీ చూపిస్తుంటే పాత స్మృతులు బయటకి వచ్చాయి. అమ్మమ్మ అన్నట్టే, మళ్ళీ ఇంక ఆ ఊరు వెళ్లలేదు. తరవాత ఏణ్ణర్ధానికే తాతగారు కూర్చున్నవారు కూర్చున్నట్టే పోయారు. మరో ఏడాదికి అమ్మమ్మ. మావయ్యలు అమెరికా నుంచి వచ్చి, పొలం, ఇల్లు అమ్మి, డబ్బులు పంచుకు వెళ్ళిపోయారు. ఫోటోలే మిగిలాయి.

***

తరవాత శృతి తీరికున్నప్పుడల్లా లాప్టాప్ పెట్టుకొని, ఆ సీడీ చూస్తూ మురిసిపోయేది. చూసినప్పుడల్లా ఒక్కో ప్రశ్న... ఒక్కో సందేహం.

“మమ్మీ మీ చిన్నప్పటిలా ఇప్పుడెందుకు మీరంతా కలవడం లేదు? శలవలకి రావచ్చు కదా. అందరం అమ్మమ్మగారింటికి వెళ్ళొచ్చు కదా?”

“ఎలా కుదురుతుంది. మా అక్కా, అన్నా అమెరికా నుంచి రావాలంటే బోలెడు ఖర్చు. వాళ్ళ పిల్లలకి సెలవలూ, వీళ్ళ ఉద్యోగాలకి సెలవలూ దొరకాలి కదా. అంత దూరంనుంచి రావాలంటే ఎంత ఖర్చు!!”

“అమెరికాలో ఉండడం ఎందుకు? మనలా ఇండియా వచ్చెయ్యొచ్చు కదా?”

“మంచి ఉద్యోగాలూ, మంచి జీతాలూ. ఇండియాలో అంత డబ్బులు ఇవ్వరని రారెవ్వరూ.”

“మరి మనం ఎందుకు వచ్చేసాం?”

“మన సంగతి వేరు. నేనొక్కర్తినీ నిన్ను చూసుకోలేక వచ్చేసాను. అక్కడ పనివాళ్ళు దొరకరు కదా. ఇక్కడ మంచి ఉద్యోగం దొరికింది. అందుకు వచ్చేసాను.”

“మరి డాడీ ఉండేవారు కదా. డాడీని నీవు వదిలి వచ్చేసావు. మరి డాడీ మనతో ఎందుకు రాలేదు?” ఇదివరకూ రెండుమూడు సార్లు అడిగిన ప్రశ్న మళ్ళీ అడిగింది.

“ఆయన అక్కడ ఉద్యోగం వదలడానికి ఇష్టం లేక రాలేదు.” ముభావంగా అని లేప్టాప్లో ఇంకో దృశ్యం వేపు చూపిస్తూ, “చూసావా ఇది మీ మావయ్య పెళ్ళి ఫోటో. హోస్టన్ లో ఉంటాడు కదా మురళి అన్నయ్య.... రెండేళ్ళ క్రితం ఇండియా వచ్చాడు కదా.. వాడి పెళ్ళి. వనజ ఆంటీ చూసావా. పెళ్ళికూతురు కదా ఎన్ని

నగలు పెట్టుకుందో!! ఇది వడ్డాణం. ఇవి వంకీలు. ఇవన్నీ నాకు మా అమ్మ చేయించింది. నీకిచ్చేస్తాను నీ పెళ్ళికి." మాట మార్చి చెప్తుంటే ఏడేళ్ళ శృతి మొహంలో సంతోషం, సిగ్గు.

ఇండియా వచ్చిన ఈ రెండేళ్లలో శృతి చాలా తెలుసుకుంది. శృతి పెద్దదౌతుంది. స్కూలు పిల్లలూ, టీవీ సీరియల్సు, ఇంట్లో వంటామె నర్సమ్మ, పనిమనిషి సీతాలుతో మాట్లాడి తెలుగు బాగా నేర్చింది.

"మా ఫ్రెండ్ అందరికీ డాడీలూ మమ్మీలూ కలిసి ఉన్నారు. నాకే డాడీ లేరు. డాడీని వచ్చెయ్యమను మమ్మీ" ఓ రోజు స్కూలునుంచి వచ్చి అలిగి కూర్చుంది.

"ఆయన రారమ్మా. ఎన్నోసార్లు చెప్పాను నీకు!" కీర్తన విసుగ్గా అంది.

"అయితే మనమే వెడదాం."

"అదీ కుదరదు. శృతీ చిన్న పిల్లవు, నీకిప్పుడు చెప్పినా అర్థం కాదు."

"నాకన్నీ తెలుసు. నువ్వు అబద్ధాలు చెప్తున్నావు. డాడీ నువ్వూ డైవోర్సు తీసుకున్నారు కదూ. మా ఫ్రెండ్స్ అన్నారు. మీ మమ్మీ నువ్వూ ఒంటరిగా ఉన్నారంటే మమ్మీ డాడీ విడిపోయారన్నమాట. లేకపోతే ఈ రెండేళ్ళలో మీ డాడీ ఒక్కసారన్నా వచ్చారా? నీతో మాట్లాడారా అని అడిగారు. నీవు నా దగ్గర ఎందుకు దాస్తావు ఇదంతా?" నిలదీసింది.

"ఈ కాలం పిల్లలకి మంచి తెలివితేటలున్నాయి. మంచి ఎక్స్పోజర్ ఉంది అన్ని విషయాలూ చూసి నేర్చుకుంటున్నారు. ఇలాంటి పిల్లలకి నిజం చెప్పడం నయం!" అనుకుంది కీర్తన.

"సరే నీవిప్పుడు కాస్త పెద్దదానివయ్యావు. నీకన్నీ తెలుసు అన్నావు కదా. అవును డాడీ నేనూ డైవోర్స్ తీసుకున్నాం. ఆయన ఇంక మన దగ్గరకిరారు."

"ఎందుకు? డైవోర్స్ ఎందుకు తీసుకున్నారు?"

"మా ఇద్దరికీ పడలేదు. రోజూ కొట్టుకుంటూ, తిట్టుకుంటూ మనశ్శాంతి లేకుండా ఎందుకు కలిసి బతకడం?"

"అంటే డాడీ నిన్ను తిట్టారా? కొట్టారా?" ఇంకో ప్రశ్న.

"కొట్టడం తిట్టడం కాదు. మనసులు కలవకపోతే ఒకరినొకరు సాధించుకుంటూ ఎడమొహంగా బతకడం కుదరదు." కాస్త కఠినంగా అంది.

"సాధించడం అంటే... నీవు నన్ను పాలు తాగు అని కేకలేస్తావు. ఆ షూస్ అక్కడ ఎందుకు పడేసావని తిడతావు. టీ.వీ. అస్తమానూ చూడొద్దని కేకలు పెడతావు. షాంపూ చేసుకో, బ్రష్ చేసుకో అంటూ ప్రతీదానికీ వెంటపడి సాధిస్తూనే ఉంటావు కదా. మరి నన్ను వదిలేసి వెళ్ళిపోతావా ఒక రోజు?" సూటిగా కళ్ళలోకి చూసి అంది. కీర్తన తెల్లబోయి చూసింది. "అయితే నేనూ ఇంట్లో నుంచి వెళ్ళిపోవాలా. నీ చిన్నప్పుడు అమ్మమ్మా తాతగారూ కోపం వచ్చి కేకలు వేస్తే ఇల్లు వదిలి వెళ్ళిపోయావా?" నిలేసినట్టు అడిగింది. ఆ ధోరణికి విస్తుపోయింది కీర్తన. ఏడేళ్ళ పిల్ల ఎలా అడుగుతుంది!! కోపంతో మొహం ఎర్రబడింది.

"శృతీ ఏంటా పెద్ద మాటలు. పిల్లలు పిల్లల్లా ఉండాలి. నేను చెప్పినా నీకర్థం కాదు."

"చెప్పు, అర్థం అయ్యేటట్టు చెప్తే వింటాను." శృతి రెట్టించింది.

"చూడూ...తల్లీ, పిల్లలూ, తండ్రీ ఈ సంబంధం వేరు. బార్యాభర్తల సంబంధం వేరు."

"ఎందుకు వేరు? నేనేం చేసినా ఊరుకుంటావు. మీ అమ్మా నాన్నా కేకలేసినా సహిస్తావు. మరి డాడీ దగ్గర అలా ఉండొచ్చు కదా. డైవోర్స్ ఎందుకు తీసుకోవడం?" కీర్తన నిస్సహాయంగా చూసింది. ఎలా చెప్పి కూతుర్ని నమ్మించాలో అర్ధం కాలేదు.

"డాడీకి సారీ చెప్పి పిలు. వస్తారు" పంతంగా అంది.

"శృతీ నీకు చెప్తే అర్ధం చేసుకోవు. ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. ఇక ఆయనకీ నాకూ ఏ సంబంధమూ లేదు!" కీర్తన నిష్కర్షగా అంది.

శృతి హతాశురాలైనట్టు చూసింది. తల్లి వంక కోపంగా చూసి, విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

మరో రోజు రాఖీ పౌర్ణమి. టీవీలో అన్నలకి అక్కా, చెల్లెళ్ళు రాఖీ కట్టడం చూసింది.

"పోనీ సరే డాడీ రారు. నేనొక్కర్తినే ఉన్నాను. నాకో తమ్ముడు కావాలి. తెచ్చి ఇవ్వు. ఆడుకుంటాను. రాఖీ కడతాను. నా బొమ్మలన్నీ ఇస్తాను. మేం ఇద్దరం కలిసి గేములాడుకుంటాం. నాకు ఎవరూ లేరు. బోరు కొడుతుంది. చిన్నప్పుడు నీకు నీ బ్రదర్స్ ఉన్నారు. మీరంతా సర్దాగా ఆడుకునేవారు. నాకొద్దా మరి?" సూటిగా అడిగింది.

"తమ్ముడు ఎలా వస్తాడే? అదేమైనా బొమ్మా కొనివ్వడానికి?" నవ్వింది కీర్తన

"ఏం నీ పొట్టలోనుంచే కదా వస్తారు పాపాయిలు. టీవీలో చూసాగా. ఓ పాప వాళ్ళమ్మ పొట్ట చేత్తో పట్టుకు చూసింది. తరవాత పాపాయిని వాళ్ళమ్మ ఒడిలో పడుకోబెట్టింది." కీర్తన నిస్సహాయంగా చూసింది.

"పాపాయిలు అలా పొట్టలోనుంచి వచ్చేయరు. డాడీలు లేకుండా పాపాయిలు రారు." శృతి ఆశ్చర్యంగా అర్ధంకానట్టు చూసింది.

"సరే అయితే, ఇంకో డాడీని తీసుకురా" అంది.

"బాగుంది, చాలా బాగుంది నీ వరస తల్లీ! ఇంకో డాడీ నాకు మొగుడవ్వొచ్చు గాని నీకు డాడీ కాలేరే. ఎలా చెప్పాలే నీకు" కీర్తన మనసులో విసుక్కుంది.

"శృతీ అదంతా జరిగే పని కాదు. ఊరికే పిచ్చి మాటలు మాట్లాడకు"

"అప్పుడే డాడీ ఉన్నప్పుడే ఇంకొక పాపాయిని తేవలసింది. ఈ పాటికి నాతో చక్కగా ఆడుకొనేదిగా. అప్పుడెందుకు ఊరుకున్నావు? అందరికీ ఇద్దరు ముగ్గురు పిల్లలు"

"సరే ఈ ఉద్యోగాలతో ఒంటరిగా ఒక పాపను పెంచేసరికి తాతలు దిగొచ్చారు. ఇంకో పిల్ల కూడానా. ఇదివరకు ఆడవాళ్ళకు ఉద్యోగాలు ఉండేవి కావు. పిల్లల్ని కని సావకాశంగా పెంచేవారు. ఇప్పుడాడవాళ్ళకి ఉద్యోగాలు చేస్తూ పిల్లల్ని పెంచడం కష్టం అవుతుంది!" కీర్తన సంజాయిషీ ఇచ్చింది.

"ఉద్యోగం మానేయాల్సింది!" తప్పు నీదే అన్నట్టు అంది.

అవును. ఉద్యోగం మానేసి, తిక్క మొగుడితో కాపురం చేసి, ఇంకో పిల్లను కనుంటే తన పాట్లు, తన గతి ఏమయ్యేది! స్వాభిమానం చంపుకొని ఆరేళ్ళు గడిపింది మారతాడన్న భ్రమతో. ఓ రెండేళ్ళు పిల్లలు కనే సౌలభ్యమే కుదరలేదు. జీవితంలో స్థిరపడడానికే టైం పట్టింది. కావాలనుకున్నా ఓ ఏడాది పట్టింది గర్భం రావడానికి. పురుడు, చంటిపిల్ల, చాకిరి, భర్త సహకారం లేక ఎంత నరకం చవిచూసింది. ఉద్యోగంలో చేరాల్సిన సమయం. పిల్లని క్రెష్లో ఉంచడం, తీసుకురావడం, పని...పని......ఎంత చేసినా తృప్తిలేని భర్త. ఆ సాధింపు... ఆ కోపాలు, ప్రాణం విసుగెత్తి, ఓర్పు ఆఖరు మెట్టుకు చేరాక, నాలుగేళ్ళ పాపతో ఇండియా వచ్చేసింది. భర్తకు విడాకులిచ్చి, కొత్త జీవితాన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చేవరకూ అమ్మా నాన్నా సహకారం ఉంది గనుక నిలదొక్కుకుంది. మళ్ళీ కొత్త ఉద్యోగం. కొత్త చోటు. పల్లెటూరి నుంచి తెచ్చుకున్న పనమ్మాయి సీతాలు సాయంతో పాపని పెంచుకుంటూ ఒంటరి అయినా, కనీసం ప్రశాంతంగా బతకగలిగింది గత రెండేళ్ళనుంచీ. ఇప్పుడు పాపకి కాస్త జ్ఞానం వచ్చి, చుట్టూ ఉన్న పిల్లల్ని చూసి తెలుసుకొని వేసే ప్రశ్నలకి ఎంత కష్టం అయింది!! పాప పెద్దయ్యాక ఎలాగో తండ్రి ప్రస్తావన వచ్చి, అడుగుతుందని తెలుసుగాని, ఇంత చిన్నప్పుడే ఇలా నిలేస్తుందని అనుకోలేదు. దానికెలా చెప్పాలో, ఎలా చెప్తే అర్ధమౌతుంది... కీర్తన విలవిలలాడింది.

శృతి ఈ మధ్యన చాలా మూడీగా తయారైంది. మాటలు తగ్గించేసింది. బొమ్మలతో ఆడుకోవడం మానేసింది. స్కూలు హోమ్ వర్క్ చేసుకొని, టీ.వీ. ముందు కూర్చుంటుంది. పలకరిస్తే పది మాటలకి ఒక మాట బదులు చెప్తుంది. టీవీ చూడకపోతే లాప్టాప్ లో చూసిన దృశ్యాలే చూస్తుంటుంది తల్లిమీద అలిగినట్టు. ఇదివరకులా స్కూలు సంగతులు, టీవీలో చూసిన దృశ్యాలూ, ఏ విషయం మాట్లాడటంలేదు. "శృతీ ఏంటలా ఉన్నావు?" అని ఎన్ని సార్లడిగినా జవాబివ్వకుండా, పెద్దకళ్ళని మరింత పెద్దవి చేసి తల్లిని మింగేసేలా చూస్తుంది. మరీ గట్టిగా ఒకరోజు అడిగితే, "ఎలా ఉండాలి మరి. నాకెవరున్నారు ఆడుకోవడానికీ, మాట్లాడడానికీ? నువ్వు ఆఫీసు నుంచి రాత్రయ్యాక వస్తావు. అప్పుడు నాకు నిద్ర వస్తుంటుంది. ఇంట్లో సీతాలూ, వంటవ్వతో ఏం మాట్లాడాలి? ఏ గేమ్స్ ఆడుకోవాలన్నా ఎవరూ లేరు" అరిచింది.

నిజమే ఆ అపార్ట్మెంట్స్ లో శృతి ఈడు పిల్లలెవరూ లేరు. కాలేజీ పిల్లలు, లేకపోతే మరీ చిన్న పిల్లలు, ఉద్యోగం చేసే అమ్మాయిలు, మూడొంతులు రిటైరైన ముసలివాళ్ళు.

"పక్కింటి స్వీటీ అక్క దగ్గరకి కొంచెం సేపు వెళ్ళొచ్చు కదా." స్వీటీ ఇంజనీరింగ్ చదువుతున్నా శృతితో అప్పుడప్పుడు మాట్లాడుతూ ఉంటుంది.

"తనెప్పుడూ కంప్యూటర్ ముందు కూర్చుంటుంది. లేకపోతే సెల్ ఫోన్ పట్టుకుంటుంది. వెళ్ళి ఏం చెయ్యాలి?"

"బాగుంది వరస. నన్నేం చెయ్యమంటావు? ఇప్పుడందరూ ఎవరి లైఫ్లో వారు బిజీ. మనకి మనమే కాలక్షేపం వెతుక్కోవాలి." కీర్తనకు శృతి ఒంటరితనం అర్ధమౌతున్నా, ఏం చేయగలదు. ఆ సీడీ చూపించి తప్పు చేసానా అనుకుంది.

***

"శృతీ నీకు ఆడుకోడానికి తమ్ముడు కావాలా? చెల్లెలు కావాలా?" ఓ రోజు ఆఫీసునుంచి వచ్చి, తనతో మాట్లాడకుండా అలక సాగిస్తున్న శృతిని పక్కన కూర్చోబెట్టుకొని అడిగింది.

శృతి కళ్ళలో మెరుపు. తల్లి కడుపు వైపు చూసి, "నిజంగా పాపాయి వస్తుందా" ఆశగా తల్లి పొట్టమీద చెయ్యివేసింది. కీర్తన నవ్వి "చెప్పు మరి. తమ్ముడా చెల్లెలా?"

శృతి ఒక క్షణం ఆలోచించి "చెల్లెలొద్దు. తమ్ముడైతే రాఖీ కట్టొచ్చు. ఆడపిల్లని నేనున్నానుగా. తమ్ముడే కావాలి. ఎప్పుడొస్తాడు తమ్ముడు?" ఆశగా అడిగింది.

"వస్తాడు. అడిగిన వెంటనే రారు పాపాయిలు. టైం పడుతుంది."

"నిజంగా అంటున్నావా. ప్రామిస్" అంది. కూతురు చేతిలో చెయ్యివేసి, "ప్రామిస్. మరింక నువ్వు సంతోషంగా ఉండాలి మరి. తమ్ముడొచ్చాక నువ్వు బాగా చూసుకోవాలి. ఆడించాలి. నేను ఇంట్లో లేనప్పుడు సీతాలు సాయంతో నువ్వే చూసుకోవాలి."

"ఓ ఎస్. అన్నీ నేనే చేస్తా. పాలు పడతా. బొమ్మలన్నీ ఇచ్చేసి ఆడిస్తా. రాఖీ కడతాను." సంబరంగా అంది. కూతురు మొహంలో ఆనందం చూసాక తన నిర్ణయం సరయినదే అనిపించింది కీర్తనకి.

***

ఆర్నెల్ల తరవాత, ఒక ఉదయం కారులో వెళ్ళి, మూడేళ్ళ బాబుని వెంటపెట్టుకొచ్చింది కీర్తన. శృతి సంభ్రమంగా చూసి, "చిన్నపాపాయి కాదా. ఇంత పెద్దబాబా!! నువ్వు ఒళ్ళో పడుకోబెట్టుకొని వస్తావనుకున్నాను!!" అంది ఆశ్చర్యంగా.

"నీతో వెంటనే ఆడుకుంటాడని పెద్దబాబుని తెచ్చాను. నిన్ను ఇప్పుడే 'అక్క' అంటాడు. నీతో ఇప్పుడే ఆడుకుంటాడు చక్కగా. రా... ఇలా రా" అంటూ శృతిని పక్కన కూర్చోబెట్టుకొని, బాబు చెయ్యి చేతిలో పెట్టింది. బితుకు బితుకుమని, కొత్త చోటుని వింతగా చూస్తూ, పెద్ద కళ్లని అమాయకంగా అటూ ఇటూ తిప్పుతున్న బాబుని చూసి, "అమ్మా ముద్దుగా ఉన్నాడు కదమ్మా, బాగున్నాడు కాని సన్నగా ఉన్నాడు. అమ్మో ఎంత పెద్ద జుత్తో" అంది సంభ్రమంగా.


"మనింటికి వచ్చాడుగా. మనం బాగా చూసుకుంటే, చక్కగా బొద్దుగా ముద్దుగా తయారౌతాడు. సరే మంచి పేరు పెట్టు మరి"

"చిన్ని కృష్ణుడిలా ఉన్నాడు. వంశీ అందామా" అంది శృతి. "ఆ మంచి పేరు. అలానే పిలుద్దాం. రా మరి ఒళ్ళో కూర్చోబెట్టుకొని బాబుతో మాట్లాడు." శృతి అపురూపంగా బాబుని ఒళ్ళో పెట్టుకొని, "వంశీ నీ పేరు

బాగుందా. నన్ను అక్కా అను” అంటూ బాబుతో మాటల్లో పడిపోయింది.  ఆ కళ్ళలో మెరుపు ఆనందం చూసి, కీర్తన నిశ్చింతగా నిట్టూర్చింది.

“శృతీ సారీ రా. నీకు ఆ చెట్లూ, చేమలూ, పూలూ, పళ్ళ తోటలూ, ఆవు దూడలూ, ఉడతలూ; చిలకల పక్షిగూళ్ళూ, చిలక కొరికిన జామ పండ్ల రుచీ, కజిన్స్ తో ఆడుకునేందుకు ఎవరినీ తెచ్చివ్వలేను. మేం గడిపిన మా బాల్యాన్ని మీకివ్వలేని మమ్మల్ని క్షమించమ్మా” అనుకుంది.  నీకీయగలిగింది ఇంతే తల్లీ!!!

***0***



కథామంజరి జూన్ 2021


సంచిక విశిష్ట అతిథి

# జీవన వేదం

## గంధం యాజ్ఞవల్క్య శర్మ



కథ, నవల, నవలిక, గేయం, వ్యాసం.. ఏ ప్రక్రియ ఐనా యావత్తు జగానికి సాంఘిక విప్లవ ఆవిర్భావానికి దోహద పడ్డాయని.. పడతాయనీ కూడా, గట్టి నమ్మకంతో మన మధ్య, మన ముందు కనబడే దృశ్యాలకు అక్షర రూపాలిచ్చి కథలందించిన కథా'సోమయాజి' శ్రీ గంధం యాజ్ఞవల్క్య శర్మగారు. వారి కథాముత్యాల్లో ఓ ముత్యాన్ని కథామంజరి జన్మదిన సంచికకు అందించారు. అదే "జీవనవేదం". పునర్ముద్రణ స్వాతివార పత్రిక నుంచి.



# జీవన వేదం

## గంధం యాజ్ఞవల్క్య శర్మ

కొద్ది కాలంగా లింగంపల్లి నా మనసు తడుతోంది. అది నా జన్మస్థలం. ఎందుకో అక్కడికి వెళ్లాలనే వాంఛ నన్ను వెంటాడుతోంది. ఇప్పుడక్కడ ఎవరున్నారని..?

అమ్మా నాన్న పోయారు - మరో రక్త బంధువు బాబాయి, కొడుకు దగ్గరకు భువనేశ్వర్ వెళ్ళిపోయారు.

అయినా అక్కడ ఎవరూ లేకేం? నా బాల్యమిత్రుడు దాసు ఉంటాడు. అలాగే సుబ్బన్న కూడా. కాలం చేసిన మాయ కాకపోతే కొంత కాలంగా వాళ్ల ఆచూకీ నాకు, నా కదలికలు వాళ్లకు తెలియక పోవటమేమిటి? వీళ్ళిద్దరే కాదు. నా కళ్ళల్లో మెదిలే జానకి ఎక్కడుందో .. ఎన్నాళ్ళైంది జానకిని గురించి విని!

నేను ఐ.ఏ.ఎస్. అయి జాయింటు కలెక్టరుగా, కలెక్టరుగా పలుచోట్లకు తిరిగి, ఈనాటికి చిత్తూరు కలెక్టరుగా ఉన్నాను. ఓ వారం సెలవు పెట్టి, నా మనసును తడుతోన్న లింగంపల్లికి బయలుదేరాను కారులో .. వెనక సీటునకు వాలిపోయి కూర్చున్నాను. నా ప్రయాణం ముందుకు సాగుతుండగా, నా ఆలోచనలు 'లింగంపల్లి'లో మొదలైన నా గత జీవిత ప్రస్థానం నా ముందు ప్రత్యక్షమవుతూ నన్ను వెనక్కి లాక్కెళ్లుతోంది.

***

మా లింగంపల్లిలో అంతా చిన్నాచితకా వ్యవసాయ రైతాంగమే. పెద్ద కమతం ఇరవై ఎకరాల మెట్ట, పదిహేనెకరాల మాగాణి సేద్యం మాది. నాకు ఊహ తెలిసే పాటికి, మా బంధువుల కుటుంబాలన్నీ బస్తీలకు చేరగా మిగిలింది మాది, మా బాబాయి కుటుంబాలు మాత్రమే.

బాబాయి, మా నాన్నగారి పినతండ్రిగారి కొడుకు.

సుబ్బన్న మా పాలేరు. సుబ్బన్నను పాలేరనటం న్యాయం కాదు. అతను మా సేద్య రక్షకుడు, నేనెరిగిన మా నాన్నగారెపుడు మా పొలాల గట్లెక్కిన గుర్తులేదు. అంతా సుబ్బన్నే చూచుకునేవాడు. సుబ్బన్న అంటే నమ్మకం.. సుబ్బన్న అంటే ధైర్యం .. సుబ్బన్న నీతీ నిజాయితీలకు ప్రతిరూపం.

సుబ్బన్నకంటూ సెంటుభూమి లేదు, ఓ నిట్రాడి ఇల్లు తప్ప. కానీ సుబ్బన్నకు లేనిదేముంది, నాగరాజుగారు జయమ్మగారుండగా అనుకునే వారందరూ.

నాగరాజు గారంటే మా నాన్నగారు .. జయమ్మ మా అమ్మగారు. జానకి సుబ్బన్న కూతురు. జానకి పుట్టిన సంవత్సరానికే సుబ్బన్న భార్య చనిపోయింది. సుబ్బన్న మళ్లీ పెళ్లి చేసుకోలేదు. తలచెడి సుబ్బన్న ఇంట చేరిన అతడి అక్క, అంజమ్మే సుబ్బన్న ఇంటికి ఆడ దిక్కయింది.

జానకి అంటే మా అమ్మకెంతో జాలితో కూడిన ఇష్టం, జానకి నాకంటే మూడేళ్లు చిన్న. పుత్తడి బొమ్మలా ఉండేది.

ఇక దాసు .. నా వయసువాడే, మా ఊరి ఎలిమెంటరీ స్కూల్లో నా సహపాఠి. అరమరికలు లేని స్నేహం మాది. నాల్గవ తరగతిలో ఉండగా జానకిని ఒకటో తరగతిలో చేర్పించింది మా అమ్మగారే.

నే క్రితంలో చదివిన పుస్తకాలను జానకికి ఇచ్చాను. వాటిపై 'శ్రీరామ్' అన్న నా పేరును కొట్టేసి, జానకి పేరును వ్రాయబోయిన నన్ను ఆపి, మీ పేరే వుంచండి .. మీ పేరే బాగుంది అంది జానకి.

కాదు నీ పేరే బాగుంది అన్నాను. ఎందుకో సిగ్గు పడ్డది. కాదు మీ పేరే వుంచండి అంది .. రాజీగా, నా పేరు పక్కన జానకి పేరు రాసి ఇచ్చాను.

ఆ తర్వాత .. మా ఊళ్ళో హైస్కూలు లేకపోవడంతో, అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న నందిగంపాడు, నా సైకిల్ మీద నేను, దాసు వెళ్లి వచ్చేవాళ్ళం. మా టెన్త్ అయ్యేసరికి జానకి అయిదవ తరగతి పూర్తి చేసి హైస్కూలులో పనిచేసి రిటైర్ అయిన లోకనాథం మాస్టారి వద్ద చదివి ఏడవ తరగతికి ప్రైవేటు విద్యార్థినిగా నందిగంపాడు సెంటరులో పరీక్షలు రాసి వ్రాసి పాసైంది.

ఆ పరీక్షలకు జానకిని నా సైకిల్ మీదే నందిగంపాడు తీసుకెళ్లే వాడిని. జానకి సైకిలెక్కటానికి సిగ్గుపడితే అమ్మే నచ్చచెప్పి పంపేది జానకిని.

ఆ వేసవిలో ఒక దురదృష్ట సంఘటన జరిగింది. వాళ్ల నాన్నతో, పొలానికి వెళ్లిన దాసుకు గడ్డపలుగు పాదంపై పొరపాటుగా బలంగా తగలడంతో పెద్ద గాయం అయింది. గ్రామంలోని ఆర్.యం.పి. గారి వైద్యం వికటించగా పట్టణంలోని పెద్దాస్పత్రిలో సెప్టిక్ అయిందని కాలు తీసేశారు.

అంతటితో దాసు చదువాగిపోయింది.

నేను నా ఇంటర్ హాస్టల్ లో ఉండే చదవడంతో లింగంపల్లి తరచు వెళ్లడం వీలయ్యేది కాదు. ఇంటరయ్యాక 'పూనే'లో ఇంజనీరింగ్ సీటు వచ్చింది. 'పూనే' వెళ్లబోయే ముందు రోజు సాయంత్రం దాసును చూడడానికి వాడింటికేసి వెళ్లాను. వాడింటికి రెండిళ్ళ ఇవతలే, సుబ్బన్న ఇల్లు.

ఆరుబయట మంచం మీద కూర్చుని పూలమాల కడుతున్న జానకి కనిపించింది. నన్ను చూస్తూనే గబుక్కున లేచి తలవంచుకుని నిలబడింది. నేను ఆశ్చర్యంగా జానకిని చూస్తూ నిలబడ్డాను. ఆశ్చర్యమెందుకంటే .. దగ్గర దగ్గర రెండు సంవత్సరాలయిందేమో జానకిని చూసి .. ఎంత ఎదిగింది! విశాలమైన నేత్రాలు, మిసిమి తేరిన కపోలాలు, కొనదేరిన ముక్కు, పూల లంగా, తెల్లని పావడాతో ఎంత అందంగా కనిపించిందో! తనను నిలువెల్లా చూస్తున్న నన్ను తలెత్తి చూసి తొట్రుపాటుతో లోపలికి వెళ్ళిపోయింది.

దాసు ఇంటికి వెళ్లాను.

జానకి మా చెల్లి కోసం వస్తూ ఉంటుంది. వచ్చినప్పుడల్లా నీగురించి అడుగుతుంది అన్నాడు.

నన్ను గురించి అడుగుతుందా .. ఎందుకు అన్నాను.

ఏమో నీకు తెలియాలి .. లేకుంటే జానకికి తెలియాలి అన్నాడు.

ఎందుకో నాకు తెలియదు అన్న నాతో 'ఇవి దాచుకుంటే దాగేవికాదులే' అన్నాడు.

ఇంటికి తిరిగి వచ్చాక రేపటి ప్రయాణానికి బట్టలు సర్దుకుంటూ, అమ్మతో ఏదో యాదాలాపంగా జానకి మెట్రిక్ కు కట్టవచ్చు కదా అన్నాను.

పెద్ద చదువులు చదివితే, పెండ్లి అవ్వాలంటే అంతకంటే పెద్ద చదువు చదివినవాడు దొరకద్దా అంది అమ్మ.

అదేమిటమ్మా, జానకి అందాలరాశి అంటూ ఉంటావుగా.. అలాంటిదానికి ఏ ఇంజనేరో, ఏ డాక్టరో దొరకడా అన్నాను.

సుబ్బన్నకులంలో అంతటి వాళ్లుండొద్దా .. అంది అమ్మ.

నాకు సుబ్బన్న మా కూలం కాదని తెలుసు, కానీ సుబ్బన్న కులమేదో తెలియదు. నేనడగకుండానే సుబ్బన్న కులమేదో చెప్పింది అమ్మ.

వివేకవతి, అందాలరాశి అయిన జానకి మనకంటే ఎందుకు తక్కువ అనే ఆలోచన నన్ను కలవరపరిచింది. మనమే ఈ కులవ్యవస్థను తిరస్కరిస్తూ సుబ్బన్నను, జానకిని మనలో ఎందుకు కలుపుకోకూడదు అని ప్రశ్నించాను అమ్మను.

నాకెలాంటి సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయింది అమ్మ.

***

'పూనే'లో బీ.టెక్, చండీగర్ లో యం.టెక్. చేసిన ఆ ఆరేళ్లలో, సెమిస్టరు, సెమిస్టరుకు మధ్య సెలవులు నామమాత్రమే కావడంతో నేను లింగంపల్లి వెళ్లడం కుదిరేదికాదు. అక్కడి వార్తలు దాసు జాబులు ద్వారానే తెలిసేవి.

ఓ సారి నీ యం.టెక్. అయిపోగానే 'మీ ధర్మారావు మామయ్యగారి అమ్మాయి 'సుధ'తో నీ పెళ్లటగా.. నాలుగు రోజులుగా మీ మామయ్య వచ్చి ఇక్కడే ఉన్నారట .. నాకీ వార్త జానకి చెప్పింది. చెప్పడమే కాదు, శ్రీరాంగారికి ఇష్టమేనా అని కూడా అడిగింది' అని వ్రాశాడు దాసు.

ధర్మారావు మావయ్య, అమ్మకు తమ్ముడు. ఆమెకు మిగిలిన ఏకైక రక్తబంధువు. అమ్మకు మామయ్య అంటే ఎనలేని ఆపేక్ష.

'మావయ్య పట్ల నాకూ అభిమానమే .. కానీ సుధ నా మనసున లేదు' అని వ్రాశాను దాసుకు.

తిరుగుటపాలో మరో జాబు వచ్చింది దాసు నుండి.

జానకి ఈ మధ్య, తరచు వస్తోంది మా చెల్లి దగ్గరకు.. మొన్నటి నీ జాబును ఒకటికి రెండుసార్లు చదివిన జానకి .. 'అయితే ఆయన గారి మనసున ఎవరున్నారో వాళ్ళ తల్లిదండ్రులకు చెప్పొచ్చు కదా' అని జానకి అందిట మా చెల్లితో.

'ఇది వట్టి పిచ్చిది .. శ్రీరాంగారి మనసున తనున్నాననుకొంటోందిలా వుంది' అంది మా చెల్లి.

'అవునురా శ్రీరాం .. నీ మనసున ఎవరున్నారు' అని ప్రశ్నిస్తూ వ్రాసిన దాసుకు జవాబుగా ..

'ఎవరున్నారో నీకు తెలియదా' అనే ఒకే వాక్యం వ్రాసి పడేసాను.

***

ధర్మారావు మావయ్యకు తెల్లకామెర్లు చాలా సీరియస్ గా ఉంది అన్న నాన్నగారి టెలిగ్రామ్ చూసుకుని బాపట్ల వెళ్లాను చండీగర్నుండి. నేను వెళ్లేసరికి మామయ్య పోయారు. అమ్మ ఎంత దుఃఖించిందో.

ఆపై అనతికాలంలోనే ఎన్ని పరిణామాలో .. మీ చిన్ననాటి నుండి, మా తమ్ముడు నేను, నిన్ను సుధను భావికాలాన, దంపతులుగా భావిస్తూ వచ్చాం. చివరి క్షణాలలో సుధను నా కోడలిగా చేసుకుంటానని నా చేయిని తన చేతులో వేయించుకున్నాడు మా తమ్ముడు. నా మాటను కాదనకు. సుధను నా కోడలుగా చెయ్' అంటూ నా చేతులు పట్టుకుని కన్నీళ్లు పెట్టుకుంది అమ్మ.

నాన్నగారు కూడా, "మనం తప్ప వాళ్లకు మరెవ్వరున్నార్రా" అన్నారు.

అమ్మ కన్నీరు నన్ను బలహీనుణ్ణి చేసింది. నేను ఆశించని సుధతో నా పెళ్లి జరిగి పోయింది. నా పెళ్ళికి లింగంపల్లి నుండి దాసు, సుబ్బన్న వచ్చారు. జానకి రాలేదు. వచ్చిన దాసు నాతో ఏకాంతంగా.

"జానకి చాలా దిగులుగా వుందిరా" అన్నాడు. జానకిని ఓదార్చు అన్నాను.

***

నేను బెంగుళూరులో ఇంజినీర్ గా ఓ పెద్ద కంపెనీలో చేరాను.

మా కాపురం చూడాలని బయలుదేరిన అమ్మ, నాన్న బెంగళూరుకు అతి సమీపాన నిప్పంటుకొని దగ్ధమైన రైలుకూపేలో గుర్తుపట్టడానికి వీలులేనంతగా కాలిపోయారు.

వారి అపర కర్మలు బెంగళూరులోనే జరపాల్సి వచ్చింది. ఆ పైన నాకెందుకో 'లింగంపల్లి' వెళ్ళాలనిపించలేదు. ఎందుకంటే జానకికి నా ముఖం చూపించలేకనే.

బాబాయికి పవర్ ఆఫ్ అటార్నీ పంపి అక్కడి మా ఆస్తులన్నీ అమ్మి పెట్టమని వ్రాస్తూ పడమటి పొలానవున్న నాలుగెకరాల మాగాణి భూమిని సుబ్బన్నకు ఉచితంగా దఖలు పరచమని కోరాను.

నేను అప్పగించిన పనులన్నీ చేసిపెట్టి, బాబాయి కొడుకు దగ్గరకు భువనేశ్వర్ వెళ్ళిపోయారు.

ఓ సంవత్సరం తర్వాత దాసు, జానకి పెండ్లి బంధువుతో జరిగిందని, అతనూ బీదరైతని, జానకి అత్తారింటికి వెళ్లిందని వ్రాసాడు.

***

ఇంజనీరుగా ఉంటూనే ఐ.ఏ.ఎస్ పరీక్షలు వ్రాసి సెలెక్టయ్యాను. నన్ను అభినందిస్తూ దాసు జాబు వ్రాసాడు. అదే వాడి చివరి ఉత్తరం. ఆ తర్వాత వాడి జాబులు ఆగిపోయే ఎందుకో.

సుధను పెండ్లాడేనే తప్ప ఆమెను నేను అర్ధాంగిగా స్వీకరించానా ..? అమ్మ కన్నీళ్లు పెట్టుకుని సుధను తన కోడలిని చేయమంది. చేశాను. అంతే!

క్లబ్బుల్లో .. ఫంక్షన్లలో సుధను నా భార్యగా అతిధులకు పరిచయం చేయడం వరకే పరిమితమయ్యాను.

సుధ ఓనాడు 'మీ మనసున నేను లేనట్లున్నాను .. ఎందుకీ మౌన ఘోష మనకు, ఇలాంటి నిరాసక్త సహచర్యం నేను భరించలేను' అంటూ నానుండి వెళ్ళటానికి సిద్ధమయింది.

నేను మౌనంగా వుండిపోయాను. సుధ బాపట్ల వెళ్ళిపోయింది.

***

నా ఆలోచనలను తెంపివేస్తూ .. మీ ఊరు వచ్చాసార్ అన్నాడు డ్రైవర్ లక్ష్మణ్.

పూర్వపు మా ఇంటి ముందు కారు ఆపించాను. అక్కడ మా మండువా ఇల్లు లేదు. కొత్త భవనం ఏదో వెలసి వుంది. కారు ఆగటం చూసి, బయటకొచ్చినతను అక్కిరెడ్డిట.

వీరు శ్రీరామ్ గారు, చిత్తూరు కలెక్టరుగారు మీ ఊరివారే అన్న డ్రైవర్ మాటవిని,

"నమస్కారం సార్, రండి మనింటిలోకి" అంటూ ఆహ్వానించాడు. ఇల్లు పాతదైపోతే పడవేసి కొత్తది కట్టించాం. నాలుగు రోజుల క్రిందటే గృహప్రవేశం చేసాం అన్నాడు.

అక్కిరెడ్డి నాకో విశాలమైన గదిని కేటాయించి, నా సూట్ కేస్ తదితరాలను అందులో పెట్టించాడు.

అక్కిరెడ్డి నేను భరించలేని రెండు దుర్వార్తలు చెప్పాడు. దాసు బహిర్భూమికని బయటికెళ్లగా చీకటిలో పాము కరచి చనిపోయాడట. ఆ మరుసటి నెలలోనే సుబ్బన్న నిద్రలో మరణించాడట.

ఈ వార్తలను నేను జీర్ణించుకోలేక పోయాను.

అక్కిరెడ్డే నేను అడగకముందే చెప్పాడు జానకి గురించి. జానకి భర్త తాను తోలుతున్న ఎడ్లబండి బోల్తా పడగా తలపగిలి చనిపోయాడట. జానకి ఏణ్ణర్ధం కొడుకుతో లింగంపల్లి వచ్చిందట. అప్పటికే సుబ్బన్న లేడు. వృద్ధాప్యంతో మంచానికే పరిమితమైన మేనత్త అంజమ్మను చూసుకుంటూ, బాల్వాడీ ఆయాగా చేరి చాలీచాలని జీతంతో సతమతమౌతున్నదట.

'జానకీ ఇక్కడే ఉందా .. చాలీచాలని జీతంతో సతమతమవుతోందా .. ఎందుకు సుబ్బన్నకు సాలుకు రెండు పంటలు పండే నాలుగు ఎకరాల పొలం ఇచ్చాంగా!' అన్నాను.

ఆ పొలం జానకికి దక్కలేదు. ఊరి మునసబు చంద్రయ్య, శిస్తుకాగితాలు సంతకం పెట్టు అని సుబ్బన్నతో ఏవో కాగితాలపై సంతకాలెట్టించుకుని, సుబ్బన్న పోయాక అతను నాకు నాలుగు లక్షలు బాకీ అంటూ దౌర్జన్యం చేసి ఆ పొలం ఆక్రమించుకున్నాడు. జానకి ఏమీ చేయలేకపోయింది పాపం .. ఆమె తరఫున మాట్లాడేదెవరు అన్నాడు అక్కిరెడ్డి.

'నాన్నగారిని, నన్ను ఎరిగిన వాళ్లెందరో వచ్చి మాట్లాడి వెళ్లారు. ఊళ్లోనే వున్న జానకి ఎందుకు రాలేదు' అని అనుకుంటున్న తరుణాన రాత్రి పదకొండు గంటలకు జానకి వచ్చి నా ముందు నిలబడి,

'నేను జానకిని' అంది.

వెంటనే మాట్లాడలేకపోయాను. అవును జానకే .. కానీ జానకిలా లేదు. చీర పైటంచును మెడ మీదుగా తలపై చుట్టుకుని జానకమ్మగా ఉంది .. బొట్టులేని నొస, గతంలో నేనెరిగిన ఆ కనులలోని కాంతిపుంజాలు లేకపోగా, ఆ కనుల చుట్టూ నల్లని వలయాలు ..

'బాగున్నారా' అంది.

'ఇదిగో ఇలా ఉన్నాను.. ' అని కూర్చో అంటూ కుర్చీ చూపించాను.

జానకి కూర్చోలేదు.

నీ గురించి అంతా విన్నాను. చంద్రయ్య మీ పొలం దొంగ కాగితాలను అడ్డంపెట్టుకుని ఆక్రమించాడని తెలిసింది. మా బాబాయి మీ నాన్నకు దఖలు పరచిన పత్రాలు ఉన్నాయా అని ప్రశ్నించాను.

'ఉన్నయ్ ..' అంది.

'వాటిని వెంటనే తెచ్చి నాకు చూపించు' అన్నాను.

రేపు ఉదయం తెచ్చి చూపుతానంది.

'కూర్చో నీతో మాట్లాడాలి' అన్న నాతో 'ప్రొద్దుపోయింది. మీకు నిద్రాభంగం .. రేపు ఉదయం వస్తాను' అంటూ వెళ్ళిపోయింది.

మరునాటి ఉదయం జానకి పొలం కాగితాలను తెచ్చి ఇచ్చింది. వాటిని అవతల పెట్టి .. 'ముందు నీతో మాట్లాడాలి' అన్నాను. క్షణం అదోలా చూసి "మాట్లాడండి" అంది.

సుదీర్ఘంగా మాట్లాడాను. బాల్యం నుండి జానకి పట్ల నా అభిప్రాయం. నా జీవిత ప్రస్థానంలో నా తల్లిదండ్రుల పాత్ర .. సుధతో నాకిష్టంలేని పెండ్లి .. సుధతో, నేనెలా మసిలింది, నానుండి సుధ వెళ్ళిపోవటం .. చెప్పాను. అంతా చెప్పి 'జానకి, నా మనసున ఎవరున్నారో నీకేనాడో చెప్పవలసింది. నీవూ మౌనంగా ఉండిపోయావు. గతాన్ని వదిలేద్దాం, ఈనాడు మనిద్దరం ఒంటరులం, ఈ శూన్య జీవితాలను మనమెందుకు అనుభవించాలి. నా దగ్గరకు వచ్చేయ్, సుధ వద్ద నుండి విడాకులు తీసుకుంటాను. మనం పెండ్లాడుదాం' అన్నాను.

నేను మాట్లాడినంతసేపు జానకి తల వంచుకునే మౌనంగా విన్నది. నేను ముగించాక చటుక్కున బయటికి వెళ్లి పది నిమిషాలలో భుజాన సంచితో ఉన్న ఓ పిల్లాడితో వచ్చి,

'వీడు నా కొడుకు' అంది.

చాలా ముద్దుగా ఉన్నాడు, నన్ను చూస్తూనే 'నమస్తే' అన్నాడు చేతులు ముడిచి. ముచ్చటేసి దగ్గరకు తీసుకుని నీ పేరేమిటి అని ప్రశ్నించాను.

'శ్రీరాం' అన్నాడు.

జానకి మనసున నేనున్నాననే తలుపు నన్ను పరవశింపచేసింది.

'ఇక నీవు బడికెళ్లు నాన్నా' అంటూ కొడుకును పంపించివేసి, జానకి నా వైపు తిరిగి 'మీరు మాట్లాడడం అయిపోయిందిగా ఇక నన్ను మాట్లాడనీయండి' అంది.

'మాట్లాడు' అన్నట్లు తలూపాను.

"శ్రీరాం గారు .. గతించిన కాలంతో పాటు జారిపోయిన ఆశలను, అదృష్టాలను అందుకోవాలనే కోరిక గాని, పూనిక గాని నాకు లేవు. ఇప్పుడు నేనో తల్లిని, పెళ్లికూతుర్ని కాను, కాలేను. ఇప్పుడు నా ముందున్న కర్తవ్యాలు రెండే .. ఒకటి నా కొడుకు భవిష్యత్తును భద్రపరచడం .. ఆగామికాలాన నన్ను వాడు ఏ విషయంలోనూ ప్రశ్నించకుండా ఉండగలగడం. ఇక రెండవది .. చరమ దశలో ఉన్న మా అంజమ్మ అత్తయ్య శేషజీవితాన్ని ఎలాంటి అశాంతికి గురికాకుండా ఆమెను అంటిపెట్టుకుని ఉండటం.. ఈ రెండు బాధ్యతలు నిర్వహిస్తే చాలు. ఇక మీరింతగా మాట్లాడారు కనుక .. నా కర్తవ్యంగా మీకో విషయం చెప్పదలిచాను. దయచేసి వినండి. మీరు మీ సతీమణి సుధగారి పట్ల వ్యవహరించిన తీరు సరికాదు. పెండ్లయ్యాక ఆమె మీ అర్ధాంగి. ఆమెను మీ మౌన తిరస్కారానికి గురి చేయడం ధర్మం కాదు. మీరు ఉన్నతోద్యోగులు, ఇతరులకు ఆదర్శంగా ఉండవలసినవారు, మిమ్మల్ని నమ్మి వచ్చినవారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం క్షమార్హం కాదు. సుధగారి జీవితం ఇలా చిన్నాభిన్నం కావటానికి నా ప్రమేయం లేకుండానే నేను కారణం కావడం దురదృష్టం. ఇప్పటికీ మించిపోయింది లేదు. సుధగారి దగ్గరకు వెళ్ళండి, జరిగిన తప్పుకు క్షమాపణ కోరండి. సుధగారు గతాన్ని విస్మరించి మిమ్మల్ని అంగీకరిస్తారని నా నమ్మకం. ఎందుకంటే .. ఆమె భారత స్త్రీ. నేను ఇలా మాట్లాడటం నా స్థాయికి అనుచితం అనుకున్నా, మీకు ఆగ్రహం తెప్పించినా, నన్ను క్షమించండి!" అంటూ చేతులెత్తి నమస్కరించి అక్కడి నుండి వెళ్ళిపోయింది.

జానకి .. జానకిలా కాదు నాకో జ్ఞానదీపికలా కన్పించింది. నేను జానకి వెళ్ళిన దిశగా చేతులెత్తి నమస్కరించాను.

***

జానకి తెచ్చిన కాగితాలు చూశాను. మా నాలుగెకరాల మాగాణి భూమిని సుబ్బన్న మా కుటుంబానికి అందించిన సేవలకుగాను, జీవితాంతం అనుభవించేలా వ్రాసి ఇచ్చిన స్వాధీనపత్రమే అది.

ఆ కుటుంబానికి శాశ్వతంగా రిజిస్టర్ చేయమన్నాను కదా .. బాబాయి ఇలా ఎందుకు చేసినట్లు.. ఏమైతేనేం, సుబ్బన్న మరణానంతరం ఆ భూమిపై నాకే హక్కు ఉన్నట్లయింది.

చంద్రయ్యను పిలిపించాను .. వచ్చాడు. 'నీవు దౌర్జన్యంగా మా ఆస్తి అనుభవిస్తున్నావు. నీపై క్రిమినల్ కేసు పెట్టి జైలుకు పంపుతాను. నీ మునసబుగిరీ ఊడగొట్టిస్తాను' అని హెచ్చరించాను.

చంద్రయ్య కాళ్లబేరానికొచ్చి ఆ పొలం జోలికి పోనని బైండోవర్ రాసి యిచ్చాడు.

కాకుమాను రిజిష్టార్ ఆఫీసుకెళ్ళి జానకికి ఆ పొలాన్ని రిజిస్టర్ చేసి, మరుక్షణమే అటునుండి అటే బాపట్ల బయలుదేరాను.

సుధగారికి నా శుభాకాంక్షలు చెప్పండి అంది జానకి.

***

సుధ దగ్గరకి వెళ్లి జానకి 'ఏమన్నదో చెప్పి' నన్ను క్షమించు, గతాన్ని మరచిపోదాం, చిత్తూరు వెళ్దాం అన్నాను.

నాకేసి, నా కళ్ళకేసి సుదీర్ఘంగా చూసిన సుధ, ఆ నా కళ్ళలో ఏం చూసిందో .. ఏం నమ్మిందో 'క్షమించడం అనేటంత మాట ఎందుకులెండి, చిత్తూరుకు కాదు, ముందు తిరుపతి కెళదాం' అంది.

తిరుపతి వెళ్ళాం, కాలిబాటన పైకి వెళదాం అంది సుధ. మెట్లెక్కే వెళ్ళాం. నాచేత తలనీలాలిప్పించింది. పుష్కరిణిలో తనతో పాటు మునకలు వేయించింది. నాచేత పట్టుధోవతి ఉత్తరీయం కొనిపించి, కట్టించి, తానూ పట్టుచీరె ధరించి, "మీరు ఈ జిల్లా కలెక్టరు కావచ్చు, కానీ మనం సామాన్య భక్తుల్లా 'క్యూ'లోనే స్వామిని దర్శించాలంది. అలాగే చేసాం. మరో మూడు నెలలో మన మ్యారేజీడే.. ఆనాడు మళ్ళీ వద్దాం. లింగంపల్లి వెళ్లి జానకి గారితో సహా!" అంది.

"అయితే మళ్లీ తలనీలాలు.. ఈ గుండు తప్పదా నాకు?" అన్నాను.

"మీరు ఇలాగే బాగుంటారు!" అంది గోముగా.

***0***

# కథామంజరి

## చదవండి, వినండి